PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 320 | విజయవాడ, ఆదివారం 22 జూన్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 22 June 2025 | Rs

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఎకరం రూ.99 పైసలు

- కార్పొరేట్ల గుప్పెట్లోకి ప్రభుత్వ భూములు

2



సెంచరీతో చెలరేగిన పంత్

- భారత్ తొలి ఇన్నింగ్స్ 471/10
- భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు రెండో రోజు

8



యోగాను ప్రపంచం గుర్తించింది

- ఆధునీకరించి, వైద్యంలోనూ వాడుతాం : ప్రధాని మోడీ
- ఒలింపిక్స్‌లో చేర్చాలి : సిఎం చంద్రబాబు
- విశాఖ యోగాసనాలలో 3.01 లక్షల మంది భాగస్వామ్యం... గిన్నిస్ బుక్‌లో నమోదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

యోగాను ప్రపంచం గుర్తించిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. 'యోగాను మరింతగా విశ్వవ్యాప్తం చేస్తాం. దీనికోసం యోగాను మరింతగా ఆధునీకరిస్తాం. ఆధునిక పరిశోధనల ద్వారా యోగా సైన్స్‌ను బలోపేతం చేస్తాం. వైద్య సేవల్లోనూ వినియోగిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు ప్రధాన వైద్య సంస్థలు ఈ దిశలో ఇప్పటికే కృషి చేస్తున్నాయి.' అని చెప్పారు. విశాఖ సాగర తీరంలో శనివారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం నిర్వహించిన 'యోగాంధ్ర -2025'లో ఆయన పాల్గొని అసనాలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం చరిత్ర సృష్టించింది. తీరం పొడవునా కిలోమీటర్ల తరబడి ప్రజలు యోగసనాలు వేశారు. ఆర్‌కె బీచ్ నుంచి భోగాపురం వరకూ సుమారు 30 కిలోమీటర్ల మేర ఈ ప్రక్రియ కొనసాగిదంది, సముద్రంలో 11 యుద్ధ నౌకలపై నేవీ సిబ్బంది ఆసనాలు వేస్తూ యోగాడేలో పాల్గొన్నారు. 3.01 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రారంభం నుండి చివరి వరకు పరిశీలించిన గిన్నిస్ బుక్ పరిశీలకులు లక్షల మంది 'యోగాంధ్ర -2025'లో పాల్గొన్నట్లు ధృవీకరించారు. ఈ మేరకు ధృవ పత్రాలను రాష్ట్ర మంత్రులు లోకేష్, సత్యకుమార్‌లకు అందచేశారు. గతంలో సూరత్‌లో 1.47 లక్షల మందితో సాధించిన యోగా రికార్డును విశాఖపట్నం కార్యక్రమం అధిగమించినట్లు గిన్నిస్ పరిశీలకులు నిర్ధారించారు.



విశాఖ తీరంలో యోగ సాధకులతో కలిసి ఆసనాలు వేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోడీ యోగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను వేదికపై విడుదల చేశారు. అనంతరం ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ ప్రతి దేశం, ప్రతి సమాజం యోగాను జీవన శైలిలోనూ, ప్రభుత్వ విధానాల్లోనూ భాగంగా మార్చుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. దశాబ్ధకాలం క్రితం జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితిని కోరిన రోజును గుర్తు చేసుకున్నారు. 'చాలా తక్కువ సమయంలో 175 దేశాలు ఆ ప్రతిపాదనకు మద్దతు తెలిపాయి.' అని ఆయన చెప్పారు. పదకొండు సంవత్సరాల తరువాత ప్రస్తుతం అంతరిక్షంలో శాస్త్రవేత్తలు సైతం యోగా చేస్తున్నారన్నారు. దివ్యాంగులు బ్రెయిలీ లిపి ద్వారా యోగా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. దీనికి వయోపరిమితి, హద్దులు లేవని అన్నారు. ఇది మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. అశాంతి, అలజడులు పెరుగుతున్న తరుణంలో వ్యక్తిగత క్రమ శిక్షణతో జీవన శైలిలో మార్పు కోసం యోగా అలవర్చుకోవాలన్నారు. ప్రపంచాన్ని స్థూలకాయ సమస్య వేధిస్తోందని, వంటనూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవాలని సూచించారు. వైద్యంలో సైతం యోగాను అమలు చేయాలని మిగతా 7లో

రాష్ట్ర ప్రజలను నిరాశపరిచింది

'ప్రధాని' విశాఖ పర్యటనపై సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖ పర్యటన రాష్ట్రప్రజలను నిరాశపరిచిందని సిపిఎం రాష్ట్రకమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో యోగాంధ్ర పేరుతో విశాఖ వచ్చిన ప్రధాని రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన సమస్యలతో సహా విశాఖ ఉక్కుపై ఒక్క మాట కూడా చెప్పలేదని పేర్కొన్నారు. ప్రధాని తన ప్రసంగంలో విశాఖ నగరం ప్రకృతి, అభివృద్ధిల సంగమం అని పేర్కొన్నారని తెలిపారు. ఆనాటి పోర్టు నుంచి స్టీల్ ప్లాంట్ వరకు ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థల వృద్ధితోనే విశాఖ నగరాభివృద్ధి సాధ్యమైందన్న విషయం గమనార్హమని పేర్కొన్నారు. మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు విశాఖ సందర్శించిన ప్రధాని 'ఉక్కు' విషయంలో దాటవేయడం దారుణమని విమర్శించారు. ప్రధాని సభలోనే ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని స్పష్టమైన ప్రకటన చేయిస్తారని నగర ప్రజలు, కార్మికులు ఆశించారని, కానీ అలా జరగలేదని వివరించారు. గతంలో ఏ ప్రధానమంత్రి రాష్ట్రానికి వచ్చినా, ఆ ప్రాంత ప్రజల సమస్యలు ప్రస్తావించి నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం ఒక చారిత్రాత్మక వాస్తవమని తెలిపారు. మనిషి ఊబకాయం మొదలు ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతల నివారణకు సైతం యోగా పరిష్కారమన్న రీతిలో ప్రధానమంత్రి ప్రసంగం సాగిందని విమర్శించారు. అమెరికా తరపున ఇజ్రాయెల్ పెట్రేగిపోయి గాజాలో చిన్న పిల్లలను సైతం చంపడం, ఇరాన్‌పై మారణహోమం సాగిస్తుండడం వంటి అఘాయిత్యాలకు పాల్పడుతుంటే వాటిపై కిమ్మనకుండా ఇటువంటి హితబోధలు చేయడం దేశ ప్రజలను తప్పుదారి పట్టించేందుకే దోహదపడుతుందని పేర్కొన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దుర్మార్గాలను ఖండించకుండా మౌనం వహించి యోగాతో శాంతి సమకూరుతుందని చెప్పడం మరోపెద్ద దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలపైనా, రాష్ట్రాభివృద్ధి, విభజన హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, రాజధాని, పోలవరం నిర్వాసితులకు నిధులు వంటి అంశాలపై ప్రధాని దృష్టిపెట్టాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం యోగా పేరుతో ప్రధాని మెప్పు పొందాలని కాకుండా రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావలని సూచించారు.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు

- దిగుమతి సుంకం రద్దుతో ధరల పతనం
- ప్రస్తుతం టన్ను ధర రూ.18,600కు పతనం



3



భారత్‌లో జులై నుంచి

టెస్లా విక్రయాలు

- ముంబయిలో తొలి షోరూం

ముంబయి : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు, ఆయనతో కలిసి అనేక వినాశకర విధానాల రూపకల్పనలో భాగస్వామి అయిన ఎలన్ మస్క్ భారత్‌లోనూ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపజేయనున్నారు. ఇందులో భాగంగా తన ప్రఖ్యాత బ్రాండ్ 'టెస్లా' కార్లను దేశంలో వచ్చే జులై నుంచి విక్రయించడానికి సిద్ధమవుతున్నారు. దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో టెస్లా తొలి షోరూం ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. తొలుత మోడల్ వై రేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యువి కార్లను విక్రయించనున్నట్లు సమాచారం. ఆ తర్వాత డిమాండ్‌ను బట్టి దేశ రాజధాని న్యూఢిల్లీలోనూ షోరూంను ఏర్పాటు చేసేందుకు టెస్లా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

ముగ్గురు అధికారుల తొలగింపు

ఎయిర్ ఇండియాకు డిజిసిఎ ఆదేశాలు

న్యూఢిల్లీ : ఫ్లైట్ ఆపరేషన్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉన్నతాధికారితో సహా ముగ్గురు సీనియర్ అధికారులను తక్షణమే వారి విధులు, బాధ్యతల నుంచి తొలగించాల్సిందిగా ఎయిర్ ఇండియాను డిజిసిఎ ఆదేశించింది. పైలట్ లైసెన్సులు చెలుబాటు, వారి విశ్రాంతి అవసరాలకు సంబంధించి పలు ఉల్లంఘనలకు, వ్యవస్థాగత వైఫల్యాలకు కారణమైనందుకు ఈ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది.

శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. క్రమశిక్షణా చర్య తీసుకోవాల్సిందిగా డిజిసిఎ కోరిన కీలక అధికారుల్లో ఒకరు ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఐఓసిసి) డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ కాగా, మరొకరు సిబ్బంది షెడ్యూలింగ్ విభాగాన్ని పర్యవేక్షించే ఎగ్జిక్యూటివ్, మూడో వ్యక్తి డివిజన్ పరిధిలో ప్లానింగ్ చేపట్టే అధికారి. ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే వీరిపై అంతర్గత క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరిందని, ఆ ఉత్తర్వులను అమలు చేశామని ఎయిర్ ఇండియా పేర్కొంది. డిజిసిఎ ఆదేశాలు వెలువడిన వెంటనే కంపెనీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసరే నేరుగా ఐఓసిసిని పర్యవేక్షిస్తున్నారని తెలిపింది. వివిధ అంశాలకు సంబంధించిన ఆడిట్‌లో ఎలాంటి ఉల్లంఘన అయినా జరిగినట్లు కనుగొంటే వెంటనే పెనాల్టీలు కూడా విధించాల్సి వుంటుందని డిజిసిఎ హెచ్చరించింది. లైసెన్సుల సస్పెన్షన్ లేదా ఫ్లై చేసేందుకు ఎయిర్‌లైన్స్ అనుమతిని ఉపసంహరించుకోవడం వంటి చర్యలు కూడా వుంటాయని హెచ్చరించింది. గత వారంలో అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ 787 విమాన ప్రమాదంలో 272 మంది మరణించిన నేపథ్యంలో ఎయిర్ ఇండియాపై నిశిత పరిశీలన పెరిగిన తరుణంలో శుక్రవారం నాటి ఆదేశాలు వెలువడ్డాయి. నిర్దిష్ట లోపాలు అంటే సిబ్బంది లైసెన్సింగ్ అవసరాలు, వారి విశ్రాంతి గంటలు, వారి ఇటీవలి అవసరాలకు సంబంధించినవి, అంటే నిర్దిష్ట సంఖ్యలో టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లతో పాటూ ఒక విమానాన్ని సురక్షితంగా, చట్టబద్ధంగా నడిపేందుకు పైలట్‌కు నిర్దిష్ట కాలపరిమితి లోపు వుండాల్సిన అనుభవం వంటివి. "ఈ లోపాలకు నేరుగా బాధ్యులైన కీలక అధికారులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు లేకపోవడమే ప్రత్యేకించి ఆందోళన కలిగిస్తోంది." అని ఆ ఆదేశాలు పేర్కొన్నాయి.

ఫీజు కట్టకపోతే పరీక్ష ఫలితాల్ని వెల్లడించరా?

- నాగార్జున వర్సిటీ నిర్వాకంపై హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

డిగ్రీ కాలేజీలు అఫిలియేషన్, ఇతర ఫీజులు చెల్లించలేదని చెప్పి పరీక్షా ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెల్లడించకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. కాలేజీల యాజమాన్యాలు ఫీజులు చెల్లించకపోతే విద్యార్థుల ఫలితాలను వర్సిటీ ఎలా ఆపేస్తుందని ప్రశ్నించింది. దీనిపై రిజిస్ట్రార్ ఈ నెల 23న హైకోర్టు వచ్చి వివరణ ఇవ్వాలంది. ఈ మేరకు జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు రాసిన 2022-25 బ్యాచ్ విద్యార్థుల పరీక్షా ఫలితాలను నాగార్జున వర్సిటీ నిలిపివేసిందంటూ ప్రకాశం జిల్లాకు చెందిన కార్తికేయ డిగ్రీ కాలేజీ, శ్రీగౌతమీ డిగ్రీ కాలేజీ, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ, గుంటూరు జిల్లాలోని మహాత్మాగాంధీ కాలేజీ యాజమాన్యాలు పిటిషన్లు వేశాయి. అఫిలియేషన్ ఫీజుతో పాటు ఇతర ఫీజులు చెల్లిస్తేనే ఫలితాలను వెల్లడిస్తామని వర్సిటీ పరీక్షల కంట్రోలర్ చెప్పారని తెలిపాయి. వర్సిటీ చర్యపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

'ఆమె' కూడా మహిళే

ట్రాన్స్ ఉమెన్‌కూ హక్కులున్నాయ్ : హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

సంతానోత్పత్తి లేని కారణంగా ట్రాన్స్ ఉమెన్ (పురుషుడి నుంచి మహిళగా మారిన వ్యక్తి)ని మహిళగా పరిగణించేందుకు వీల్లేదన్న వాదనను హైకోర్టు తిరస్కరించింది. చట్టపరంగా స్త్రీగా ఆమోదించాలంది. స్త్రీ తత్వాన్ని కేవలం సంతానోత్పత్తికి మాత్రమే పరిమితం చేయరాదంది. రాజ్యాంగంలో లింగ భేదం లేదని గుర్తు చేసింది. సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కారణంగా చూపుతూ ట్రాన్స్ ఉమెన్‌ను 'స్త్రీ' హోదాను నిరాకరించడం రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 21 ప్రకారం వివక్ష కిందకే వస్తుందని తీర్పు చెప్పింది. ట్రాన్స్ ఉమెన్‌కు తన కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసే హక్కు ఉంటుందని చెప్పింది. ఒక ట్రాన్స్ ఉమెన్ తన భర్త, అత్తమామలు, బంధువుపై ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. ఇదే సమయంలో ట్రాన్స్ ఉమెన్‌కు అత్తమామలపై ఫిర్యాదు చేసే హక్కు ఉంటుందని తేల్చింది. అయితే, తమ ముందున్న కేసులో ట్రాన్స్ ఉమెన్ చేసిన ఆరోపణలకు ఆధారాల్లేవంది. భర్త, అత్తమామలు కట్నం కోసం వేధించినట్లుగా ఆధారాలు కూడా లేవంది. సెక్షన్ 498-ఏను వర్తింప చేసేందుకు ట్రాన్స్ ఉమెన్ చేసిన ఆరోపణలకు కూడా ఆధారాలు లేవని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కీలక తీర్పు చెప్పారు. ఒంగోలుకు చెందిన షబానా ట్రాన్స్ ఉమెన్..

చెన్నైకి చెందిన విశ్వనాథన్ కృష్ణమూర్తి ప్రేమించుకుని 2019 జనవరిలో హైదరాబాద్ ఆర్య సమాజంలో పెళ్లి చేసుకున్నారు. షబానా తన భర్తతో కలిసి ఒంగోలులో తన తల్లిదండ్రులతో కలిసి ఉండేవారు. అత్తమామలతో కూడా షబానా మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. పెళ్లి జరిగిన మూడు నెలలలోపే విశ్వనాథన్ చెన్నైకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో షబానా చెన్నైలోని విశ్వనాథన్ ఇంటికి వెళ్లింది. అక్కడ తన అత్తమామలు తనను చంపేస్తామంటూ బెదిరించారని, భర్త కూడా తిట్టారంటూ షబానా ఒంగోలు మహిళా పిఎస్‌లో కేసు పెట్టారు. భర్త, అత్తమామలతో పాటు వారి బంధువుపై కూడా ఫిర్యాదు చేశారు. తమపై కేసును కొట్టేయాలంటూ 2022లో భర్త, అత్తమామలు హైకోర్టును ఆశ్రయించారు. ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా పరిగణించరాదని వారి తరపున న్యాయవాది తాండవ యోగేష్ వాదించారు. దీనిపై పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె ప్రియాంక లక్ష్మి ప్రతివాదన చేస్తూ, అభియోగాలు వాస్తవమో కాదో తేల్చాల్సింది కింది కోర్టేనని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, స్త్రీ, పరుషులకే కాదు.. ట్రాన్స్‌జెండర్లకూ హక్కులు ఉంటాయని, ఈ మేరకు సుప్రీంకోర్టు కూడా చెప్పిందని గుర్తు చేసింది.

జాప్యం చేస్తే సుప్రీంకు వెళతాం

జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణపై ఫరూక్ అబ్దుల్లా



అనంతనాగ్ : జమ్ము కాశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడంలో అసాధారణ జాప్యం జరిగితే తమ పార్టీ సుప్రీంకోర్టుకు వెళుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. దక్షిణ కాశ్మీర్ జిల్లాలోని కొకెర్‌నాగ్ ఏరియాలో పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల తర్వాత, ప్రజలు తమ సమస్యలు వెంటనే పరిష్కారం కావాలనుకున్నారని చెప్పారు. రాష్ట్ర హోదాను ఇంతవరకు పునరుద్ధరించకపోవడంతో పలు సమస్యలు పరిష్కరించడం సాధ్యం కావడం లేదని తెలిపారు. "రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం మేం వేచి చూస్తున్నాం. కానీ కేంద్రం ఇంకా ఎక్కువ సమయం తీసుకుంటే, సుప్రీంకోర్టుకు వెళ్లడం తప్ప మాకు మరో మార్గం లేదు." అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తే, తమకు అన్ని అధికారాలు వస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. ఇరాన్, ఇజ్రాయిల్ ఘర్షణల గురించి వ్యాఖ్యానిస్తూ, యుద్ధాన్ని ఆపేలా ఆ రెండు దేశాలకు బుద్ధినివ్వాలని దేవుడిని కోరుకుంటున్నానని అన్నారు. శాంతి యుతంగానే సమస్యలను పరిష్కరించుకోగలమని, శాంతి లేకపోతే ఏదీ సాధించలేమని చెప్పారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలనుద్ధేశించి మాట్లాడుతూ ఇంతమంది భద్రతా బలగాలు వున్నా, డ్రోన్లు వంటి సాంకేతికతలు వున్నా తీవ్రవాదులు బైసరన్ మైదానానికి చేరుకోగలిగారని అన్నారు. తీవ్రవాదాన్ని నిర్మూలించామని కేంద్రం చెబుతోందని, అటువంటప్పుడు పహల్గాం దాడికి పాల్పడిన వారు ఎక్కడ నుండి వచ్చారని ఆయన ప్రశ్నించారు. దాడికి పాల్పడిన ఆ నలుగురిని ఇంతవరకు పట్టుకోలేక పోయామన్నారు. మనది చాలా శక్తివంతమైన దేశమని చెప్పకుంటామని, చెప్పేదానికి, చేసేదానికి పొంతన లేదని, ఇప్పటివరకు ఆ నలుగురిని పట్టుకోలేకపోయామని అన్నారు.

టెకీల్లో ఎఐ భయాలు..

- ఊడుతోన్న ఉద్యోగాలు
- కంపెనీల పొదుపు చర్యలు

3

కేరళ యూనివర్సిటీకి విదేశీ విద్యార్థులు

- నాలుగేళ్లలో 138 శాతం దరఖాస్తుల పెరుగుదల
- అమెరికా, బ్రిటన్, రష్యా సహా 81 దేశాల అభ్యర్థులు




తిరువనంతపురం : మన దేశ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రయత్నిస్తుంటే... వివిధ దేశాల విద్యార్థులు కేరళ విశ్వవిద్యాలయంలో చదువుకునేందుకు పోటీపడుతున్నారు. అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పిన తిరువనంతపురంలోని ఈ యూనివర్సిటీకి విదేశీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల సంఖ్య ప్రతి సంవత్సరం భారీగా పెరుగుతోంది. విద్యా ప్రమాణాలతోపాటు విదేశీ విద్యార్థులకు అన్ని అంశాల్లోనూ ఇస్తున్న తోడ్పాటు దరఖాస్తుల పెరుగుదలకు కారణమవుతోంది. గత నాలుగేళ్లలో 138 శాతం పెరుగుదల నమోదైంది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 81 దేశాల నుంచి 2,620 మంది విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2021-22లో 1,100 మంది, 2022-23లో 1400 మంది, 2024-25లో 2,600 మంది విదేశీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 52 దేశాలకు చెందిన 205 మంది అంతర్జాతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో అమెరికా, బ్రిటన్, కొలంబియా, పెరూ తదితర దేశాల వారున్నారు.

కోర్సులకు డిమాండ్ ఇలా

విద్యార్థుల్లో ఎక్కువమంది కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌ను ఎంపిక చేసుకున్నారు. ఆ తరువాత పొలిటికల్ సైన్స్, సైకాలజీ, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, భాషా శాస్త్రం (లింగ్విస్టిక్), ఇంగ్లీష్ లిటరేచర్‌కు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటస్టిక్స్ వంటి కోర్సులకు కూడా దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తున్నాయి.

విదేశీ విద్యార్థుల నుంచి అధిక దరఖాస్తులు : సిజిఎ డైరెక్టర్ సాబు జోసెఫ్

రాష్ట్రంలోని మిగిలిన యూనివర్సిటీలతో పోలిస్తే కేరళ విశ్వవిద్యాలయానికి విదేశీ విద్యార్థుల నుంచి అత్యధిక దరఖాస్తులు వస్తున్నాయని వర్సిటీలోని సెంటర్ ఫర్ గ్లోబల్ అకడమిక్స్ (సిజిఎ) డైరెక్టర్ సాబు జోసెఫ్ తెలిపారు. ఈ సంవత్సరం దరఖాస్తుల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లకు 1,265, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు 1,020, పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లకు 335 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది ఎంపిక కోసం విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ పోర్టల్‌కు పంపించినట్లు ఆయన తెలిపారు. అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, ఇరాన్, ఇరాక్, ఒమన్, సౌదీ అరేబియా, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, తుర్క్‌మెనిస్తాన్, తజికిస్తాన్, ఇండోనేషియా, థాయిలాండ్, వియత్నాం, దక్షిణాఫ్రికా తదితర దేశాల విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విదేశీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలను, సాంస్కృతిక కార్యక్రమాలను, వార్షిక గ్రాడ్యుయేషన్ వేడుకలను విశ్వవిద్యాలయం నిర్వహిస్తోందని తెలిపారు. విదేశీ విద్యార్థులను ఆదరిస్తూ ఇక్కడి వారితో కలిసిపోయేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. విశ్వవిద్యాలయానికి ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ప్రాముఖ్యతకు, విద్యా నైపుణ్యాలకు, సాంస్కృతిక వైవిధ్యం పట్ల ఉన్న నిబద్ధతకు ఈ దరఖాస్తుల పెరుగుదలే నిదర్శనమని అన్నారు.


విశాఖ తీరం వెంబడి యోగాసనాలు వేసిన జనం


యుద్ధ నౌకపై యోగాసనాలు వేసిన నావికాదళ సిబ్బంది

ప్రజల సహకారంతో యోగా సక్సెస్

26 జిల్లాల్లో 26 థీమ్‌లు : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం గ్రాండ్ సక్సెస్ అయిందని, ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం అనంతరం విశాఖ కలెక్టరేట్‌లో మంత్రులు, అధికారులతో కార్యక్రమ నిర్వహణపై ఆయన సమీక్షించారు. తర్వాత మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉదయం ఆరు గంటలకు యోగా చేసే ప్రదేశానికి రావాలని ఔత్సాహికులకు పిలుపునిస్తే తెల్లవారుజామున రెండు గంటల నుంచే వేదిక వద్దకు చేరుకోవడం ప్రారంభించారన్నారు. సాగరతీరంలో యోగా చేయాలనుకున్న చోటుకు 3,03,654 మంది క్యూఆర్ కోడ్‌తో వచ్చారని వెల్లడించారు. యోగాతో ఉపయోగం ఉందని భావించడం వల్లే ప్రజల నుంచి ఇంత స్పందన లభించిందని అన్నారు. శనివారం ఒక్కరోజే ప్రపంచ వ్యాప్తంగా 12 లక్షల చోట్ల 10 కోట్ల మంది ప్రజలు యోగాలో భాగస్వాములయ్యారన్నారు. యోగా దినోత్సవ విజయవంతానికి మంత్రులు, అధికారులు బాగా పనిచేశారన్నారు. టెక్నాలజీని ఉపయోగించి కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిత్యం పర్యవేక్షించారు.


మీడియాతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

22,122 మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల పాటు సామూహిక సూర్య నమస్కారాలు చేసి రికార్డు సాధించారని, వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. వంద పర్యాటక ప్రాంతాల్లో యోగా చేయాలని లక్ష్యం పెట్టుకుని 101 చోట్ల నిర్వహించామన్నారు. సూరత్‌లో 1.47 లక్షల మందితో యోగా చేసి గిన్నిస్ రికార్డ్ సాధిస్తే నేడు ఒకే వేదికపై మూడు లక్షల మంది పైచిలుకుతో యోగా చేసి రికార్డును తిరగరాశామన్నారు. రాష్ట్రంలో 2.17 కోట్ల మంది ప్రజలు యోగాడేలో పాల్గొన్నారన్నారు. యోగాను ప్రమోట్ చేసేందుకు ఐదు లక్షల చొప్పున టీ షర్టులు, మ్యాట్లు కేంద్రం పంపించిందన్నారు. యోగాను ప్రోత్సహించేలా కార్యాచరణ చేపడతామన్నారు. ఆర్గానిక్ ఆహారాన్ని అలవాటు చేసుకుంటే ప్రజలు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

ఉక్కుపై సిఎం స్పందన ఇలా..

మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా 'విశాఖ ఉక్కు రాష్ట్ర ప్రజలందరి సెంటిమెంట్ అని, దానిని టిడిపి కూటమి ప్రభుత్వం కాపాడిందని చంద్రబాబు అన్నారు. విశాఖ రైల్వే జోన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పోలవరం పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు అభివృద్ధిని వికేంద్రీకరిస్తున్నామని చెప్పారు. విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు.

టిడిపి కార్యాలయంలో యోగా డే వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో శనివారం యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఎపిఇడబ్ల్యుఐడిసి ఛైర్మన్ కుప్పం రాజశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎవి రమణ, నేతలు పర్చూరి కృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వన్ ఎర్త్ వన్ హెల్త్ యోగా ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా వారు అన్నారు. శరీరానికి ఆరోగ్యం ప్రధానమని, ప్రజలు ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేందుకు యోగాను ఆచరించాలని తెలిపారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన టిడిపి మాజీ కార్పొరేటర్ మాలకొండయ్యకు వైద్యం కోసం పార్టీ తరపున రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య చేతుల మీదుగా అందించారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ సహాయం అందించినట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.


భౌతికకాయాన్ని సందర్శించిన బుల్లితెర నటుడు హైపర్ ఆది

ముగిసిన కంచర్ల రామయ్య అంత్యక్రియలు

ప్రజాశక్తి-కందుకూరు (నెల్లూరు జిల్లా)

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్ తండ్రి రామయ్య అంత్యక్రియలు శనివారం సాయంత్రం ముగిశాయి. రెండు రోజులుగా రామయ్య భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం నెల్లూరు జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉంచారు. శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, టిడిపి శ్రేణులు రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం రామయ్య భౌతికకాయానికి అంతిమయాత్ర నిర్వహించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యేలు నాగేశ్వరరావు, మద్దూరి మాలకొండయ్య, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ దివి శివరాం, బొల్లినేని రామారావు, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది తదితరులు పాల్గొన్నారు. కాలేజీ అవరణలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

సమ్మె నోటీసు అందజేత

- మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. తదితర డిమాండ్ల సాధనకు జులై 9న జరగనున్న దేశవ్యాపిత సమ్మెలో పాల్గొనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ పి సంపత్‌కుమార్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందించినట్లు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణ, కె ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మున్సిపల్ కార్మికులందరికీ షరతులు లేకుండా తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని, ఆప్కాస్ రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని కోరారు. 12వ పిఆర్‌సి వెంటనే నియమించాలని, కార్మికులకు జిఓ 1615 అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడుల్లో బోధన సాగేదెలా?

- మొన్నటి వరకు టీచర్లకు బదిలీలు
- ఇప్పుడు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలలు తెరిచి పది రోజులైంది. ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు బోధన అప్పగించకుండా ఇతర కార్యక్రమాలను పాఠశాల విద్యాశాఖ కేటాయిస్తోంది. దీంతో బోధన కార్యక్రమంతో పాటు పాఠశాలల్లోని అడ్మిషన్లపై కూడా ఉపాధ్యాయులు దృష్టి సారించలేకపోతున్నారు. వేసవి సెలవులు అనంతరం ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమైన విషయం తెలిసిందే. తరగతి గదుల్లో ఉపాధ్యాయులను బోధన పనులకు పరిమితం చేయకుండా ఇతరవి అప్పగిస్తోంది. పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి కావాల్సిన ఉపాధ్యాయుల బదిలీలను ఈ నెల 16వ తేదీ వరకు చేసింది. 17 నుంచి 19వ తేదీ వరకు ఎస్ఆర్, ఎల్‌పిసిల కోసం ఉపాధ్యాయులు ఎంఆర్‌సిలకు తిరగడం సరిపోయింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం కోసం ఉపాధ్యాయులను ఉపయోగించింది. పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులతో రిజిస్ట్రేషన్ చేయించి నిర్దేశించుకున్న 2 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంది. ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమమంతా ఉపాధ్యాయులే చేశారు. ఈ నెల 20న యోగా ట్రయల్, 21న యోగా నిర్వహించడంతో తరగతి గదుల్లో బోధించలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల 23 నుంచి 28 వరకు ఆరు రోజులపాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను పాఠశాల విద్యాశాఖ నిర్వహించనుంది. ఆ తర్వాత లీడర్ షిప్‌తోపాటు మరికొన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనుంది. అనంతరం జులై 5న మెగా పేరెంట్ సమావేశాల కోసం ఉపాధ్యాయులను సన్నద్ధత చేయనుంది. వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాల్సిన బదిలీలు, శిక్షణ తరగతులను బడులు జరిగే సమయంలో నిర్వహిస్తూ జూన్ నెలలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు విద్యాశాఖ ఆటంకం కలిగిస్తోంది. ఇప్పటికే సుమారు 12 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాలకు హాజరైతే ఇక్కడ బోధన జరిగే అవకాశం ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో ధర

- కోకో రైతు సదస్సులో తీర్మానం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్ (తూర్పు గోదావరి జిల్లా)

అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కోకో గింజలకు ధర నిర్ణయించాలని ఎపి కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో రైతులు డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడిలో శనివారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల కాశీ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.870 ధర ఉండగా, రాష్ట్రంలో కొనుగోలు కంపెనీలు రూ.450 మాత్రమే ధర ఇస్తూ రైతులను మోసం చేస్తున్నాయన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కిలో కోకో గింజలకు రూ.50 సబ్సిడీ ఇవ్వడంతో కిలో కోకో గింజలకు రూ.500 ధర నిర్ణయించారని, ఈ ధర ఏ మాత్రమూ గిట్టుబాటు కాదన్నారు. కోకో రైతులను రాష్ట్ర వ్యాప్తంగా సంఘటితం చేసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి కోకో గింజలను రైతులే మార్కెటింగ్ చేసుకునే విధంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు సిండికేట్‌గా మారి మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అనుగుణంగా రైతుల వద్ద ఉన్న గింజలను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. టార్గెట్లు అయిపోయాయంటూ రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. పేద రైతుల వద్ద ఉన్న కోకో గింజలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీలు ధర తగ్గించి కొనుగోలు చేస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు.


సదస్సులో సంఘీభావం ప్రకటిస్తున్న రైతులు

కోకో బోర్డును ఏర్పాటు చేయాలని, వెంకట్రామన్నగూడెంలో కోకో పరిశోధన కేంద్రం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ళ వెంకట సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

వసతి లేక.. ఆహారం అందక..

'యోగాంధ్ర'లో తీవ్ర అవస్థలు పడ్డ గిరిజన విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖకు వచ్చిన 22 వేల పైచిలుకు మంది గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విఐపిల సేవలో తరించి గిరి విద్యార్థులను గాలికి వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. గిన్నిస్ రికార్డు కోసం 108 సూర్య నమస్కారాలను సామూహికంగా చేయించేందుకు శుక్రవారం విద్యార్థులను ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌కు తీసుకొచ్చారు. అయితే వారికి సరైన ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలు కల్పించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాత్రి భోజనాలు చాలకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఆకలితో అలమటించారు. వసతి ఏర్పాట్లు లేక వందల మంది మైదానాల్లో, బస్సుల్లో నిద్రించారు. క్యూలైన్లలో గంటల తరబడి నీరు, భోజనం కోసం వేచి ఉండాల్సిన అవస్థ ఏర్పడింది. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులు ముందుగానే విశాఖపట్నం చేరుకుని కార్యక్రమ ఏర్పాట్లలో నిమగ్నమైనప్పటికీ ఈ విద్యార్థుల పరిస్థితిని మాత్రం పట్టించుకోలేదు. విశాఖ వ్యాలీ, పెందుర్తిలోని కల్యాణ మండపాలకు తరలించిన కొంతమందికి తప్ప మిగిలిన వారికి వసతి కరువైంది. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకే యోగాకు సిద్ధంగా ఉండాలని విద్యార్థులకు చెప్పిన అధికారులు వారికి సౌకర్యాలు మాత్రం కల్పించకపోవడం చర్చనీయాంశమైంది. ఉదయం అల్పాహారం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి నిరీక్షించారు.



ఎయు వద్ద అల్పాహారం కోసం పడిగాపులు కాస్తున్న గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సహాయకులు

పిఎం.పాలెం క్రికెట్ స్టేడియంలో గందరగోళం

పిఎం.పాలెం వద్దగల ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో యోగాడే టీషర్టులు, మ్యాట్ల కోసం జనం ఎగబడ్డారు. దీంతో గందరగోళం నెలకొంది. ఈ స్టేడియాన్ని గాజువాక ప్రాంతానికి చెందినవారికి కేటాయించారు. వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుని యోగాసనాలు వేసేందుకు సకాలంలో చేరుకోలేదు. దీంతో అధికారులు వేరే ప్రాంతానికి చెందిన వారిని అనుమతించారు. ఈ క్రమంలో అక్కడ కొంత మందికి టీషర్టులు, మ్యాట్లు అందలేదు. అలాగే గాజువాక ప్రాంతానికి చెందిన ఒక కూటమి నాయకుడు టీషర్టులు, మ్యాట్లు ఉన్న బస్తాలను పట్టుకుపోవడం మరింత గందరగోళానికి దారితీసింది.

రికార్డుల కోసం విద్యార్థులకు ఇబ్బందులు: ఎస్ఎఫ్ఐ

విశాఖపట్నంలో యోగాంధ్ర పేరుతో గిరిజన ప్రాంతాల నుంచి 25 వేల మంది విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్, కె ప్రసన్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉత్తరాంధ్ర, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో ముందస్తుగానే కళాశాలల బస్సులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పలు విద్యా సంస్థలు మూడు రోజులపాటు సెలవులు ఇవ్వాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నన్నయ యూనివర్సిటీ పరిధిలో లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా అంతరాయం ఏర్పడి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు. గిన్నిస్ రికార్డుల కోసం విద్యార్థులను ఉపయోగించడం సరికాదన్నారు.

యోగాలో పాల్గొంటేనే మస్టర్లా?

- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీలో పనిచేసే వ్యవసాయ కార్మికులు యోగా, బిజెపి నిర్వహించే మీటింగ్‌ల్లో పాల్గొంటేనే మస్టర్లు వేస్తామన్న అధికారుల విధానాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు.

యోగా డే సందర్భంగా పలు జిల్లాల్లో ప్రభుత్వం నిర్వహించే యోగా కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా రాకపోవడంతో ప్రభుత్వాలు తమపై చర్యలు తీసుకుంటాయోమోనన్న భయంతో మండలస్థాయి అధికారులు ఉపాధి హామీలో పనిచేసే వ్యవసాయ కార్మికులను యోగా కేంద్రాలకు రావాలని ఒత్తిడి చేశారన్నారు. రాలేమని చెప్పిన పేదలకు ఉపాధి హామీ మస్టర్లు వేయబోమని, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో అధికారులు ఆదేశాలు జారీ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఎకరం రూ.99 పైసలు

- కార్పొరేట్ల గుప్పెట్లోకి ప్రభుత్వ భూములు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పారిశ్రామిక వేత్తలకు ఉదారంగా ప్రభుత్వం భూములను కట్టబెడుతోంది. మార్కెట్ ధర కన్నా తక్కువకే కేటాయిస్తుండటం పట్ల ప్రజల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. తాజాగా న్యూజెర్సీలోని టీనెక్ ప్రధాన కార్యాలయంగా ఉన్న కాగ్నిజెంట్ ఐటి సంస్థకు విశాఖలో ఎకరా 0.99 పైసల వంతున 21.31 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇదే తరహాలో ఇప్పటికే విశాఖలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఎకరా రూ.99 పైసలు వంతున 22 ఎకరాలను కేటాయించింది. కాగ్నిజెంట్ ఐటి సంస్థకు నామినల్ ధరకు భూములు కేటాయించిన విషయాన్ని పలు పత్రికలు వెలుగులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ విశాఖ కేంద్రంగా ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో ఉర్సా కంపెనీకి కూడా ఇదే తరహాలో భూములు కట్టబెట్టారనే ప్రచారం జరగడం, ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకోవడం తెలిసిందే. ఈ విషయంలో ప్రభుత్వం ఉర్సా కంపెనీకి రూ.99 పైసల వంతున ఇవ్వలేదని, మార్కెట్ ధర నిర్ణయించి కేటాయించినట్లు ప్రభుత్వం అప్పట్లో వివరణ ఇచ్చింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పారిశ్రామికవేత్తలకు భూములు నామమాత్రపు ధరకు కేటాయిస్తుండటం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్పొరేట్లకు భూ పందేరం

ఐటి పరిశ్రమల ప్రోత్సాహం పేరుతో విలువైన ప్రభుత్వ భూములను పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు పెద్దయెత్తున భూపందేరం చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు భూములు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలిచ్చినా ప్రభుత్వాలు అందుకు భిన్నంగా ముందుకు వెలుతున్నాయి. పరిశ్రమలను ప్రోత్సహించాలనే ముసుగులో అనుకూల కంపెనీలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు అవసరానికి మించి భూములు కేటాయిస్తుండటంతో ప్రభుత్వ భూములన్నీ కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. తాజాగా కాగ్నిజెంట్ కంపెనీ 2029 నాటికి కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కంపెనీ రూ.1,582.98 కోట్ల పెట్టుబడితో 8 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించింది. రూ.99 పైసల వంతున భూములు కేటాయిస్తున్న విషయాన్ని ఎస్ఐపిబి తీర్మానం చేసిందని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) కింద కాపులుప్పాడ వద్ద ఈ భూమిని నామమాత్రపు ధరకు ప్రభుత్వం కేటాయించింది.

27న కృష్ణాబోర్డు భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలం (ఖరీఫ్) నీటి కేటాయింపులు చేయాల్సిన నేపథ్యంలో ఈ నెల 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు కెఆర్ఎంబి సమాచారం పంపింది. రెండు రాష్ట్రాల్లోని ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాగునీటి అవసరాలు, నీటి లభ్యత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు చేయనున్నట్టు సమాచారం.

కడప కమిషనర్‌తో సహా ఏడుగురికి షోకాజ్ నోటీసులు

- లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని మేయర్ ఆదేశాలు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

చట్టపరమైన విధులను ఉద్దేశపూర్వకంగా విస్మరించడంపై జిహెచ్ఎంసి చట్టం-1955 సెక్షన్ 88 కింద హైకోర్టు ఆదేశాలను సైతం పాటించని కడప కార్పొరేషన్ కమిషనర్ సహా ఏడుగురు అధికారులకు మేయర్ కె.సురేష్‌బాబు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, కార్పొరేషన్ సెక్రటరీ రాజశేఖర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ చెన్నకేశవరెడ్డి, సిటీప్లానర్ వై. వెంకటరమణ, హెల్త్ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్, రెవెన్యూ ఆఫీసర్ కన్నయ్య ఉన్నారు. వారం రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని, సంతృప్తి కరమైన సమాధానం లభించని నేపథ్యంలో జిహెచ్ఎంసి చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవడంతోపాటు కోర్టు ధిక్కార చట్టం- 1971 వర్తించే విధంగా చట్టపరమైన చర్యలు అమలవుతాయని నోటీసులో పేర్కొన్నారు.

ఈనెల 20న కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాలు ముంగిట నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఎందుకు ఆటంకం కలిగించారో చెప్పాలని వివరణ కోరారు. చట్టపరమైన బాధ్యతలను నిర్వహించక పోవడంతోపాటు న్యాయపరమైన ఆదేశాలను ఎందుకు పాటించలేదని ప్రశ్నించినట్లు తెలిపారు. జిహెచ్ఎంసి-1955 యాక్టులోని సెక్షన్-88 ప్రకారం మేయర్‌కు గల అధికారాల మేరకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

భార్య హత్య.. ఆపై తానూ ఆత్మహత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను హత్య చేసి తాను ఆత్మహత్యయత్నం చేసిన సంఘటన గుంటూరులో శనివారం చోటచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కన్నావారితోటలో దారుబోయిన రాజు, లక్ష్మీ (40) దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రాజు తన భార్యతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు.

ఈ నేపథ్యంలో శనివారం కూడా లక్ష్మీతో ఘర్షణ పడ్డాడు. విచక్షణ కోల్పోయిన రాజు తన భార్యను మారణాయుధంతో కొట్టి చంపాడు. అనంతరం, గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్త ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాజును ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డిఎస్‌పి అరవింద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నగరంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదోని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదోని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న కర్నూలు జిల్లా, ఆదోని నియోజకవర్గం, దాణాపురం సభలో సర్పంచ్‌ను అవమానించిన ఘటనపై క్షమాపణ కోరిన ఎమ్మెల్యే పార్థసారధి ఆ పేరుతో సర్పంచ్ మతాన్ని ఉపయోగించడం మరింత దారుణమని పేర్కొన్నారు. ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి కులాన్ని, మతాన్ని బట్టి ప్రభుత్వ కార్యక్రమం నడిచే వేదికపై ప్రజాప్రతినిధి అయిన సర్పంచ్‌ను పిలవాలా వద్దా? అని నిర్ణయించడం ఎమ్మెల్యేగా రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి మచ్చతేవడమేనని విమర్శించారు. ఎమ్మెల్యే క్షమాపణలో చిత్తశుద్ధి లేదని, కాబట్టి ముఖ్యమంత్రి స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిజిపి కార్యాలయంలో యోగా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిజిపి కార్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. యోగా కార్యక్రమం ఉదయం 6:30 నుంచి 7:30 గంటల వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో ఐజిపి (ఈగల్) ఆకె రవికృష్ణ, భద్రతా సెక్రటరీ హరికుమార్ ఐజిపి (రిటైర్డ్), సిఇఒ రాజన్‌తోపాటు పోలీస్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల పోలీసు ప్రధాన కార్యాలయాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

61,266 పాఠశాలల్లో యోగాంధ్ర నిర్వహణ

- సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 61,266 పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమం జరిగిందని సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగాసనాలు వేసి రికార్డు నెలకొల్పడంలో భాగమయ్యారని వెల్లడించారు. సుమారు 60 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు


ఆయిల్ పామ్ గెలలతో రైతు

- దిగుమతి సుంకం రద్దుతో ధరల పతనం
- ప్రస్తుతం టన్ను ధర రూ.18,600కు పతనం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

లాభాల పంటలా కీర్తి గడించిన ఆయిల్ పామ్ సాగు నష్టాల బాట పట్టింది. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించింది. ఈ కారణంగా ఆయిల్ పామ్ గెలల ధర పతనమైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కేంద్ర సర్కారు చర్యలతో దేశీయ మార్కెట్లో ధరలు పడిపోవటం పరిపాటిగా మారింది. వంట నూనెలు ఉత్పత్తి చేసే సంస్థలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు నేలను తాకుతున్నాయి. గత నెలలో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.20,290 వరకు ఉండేది. దిగుమతి సుంకం తగ్గించిన తర్వాత రూ.18,600కు ధర పడిపోయింది. రానున్న రోజుల్లో టన్నుకు మరో రూ.మూడు వేలు తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు 40,826 ఎకరాల్లో విస్తరించింది. అత్యధికంగా నల్లజర్లలో 10,490 ఎకరాల్లో సాగు జరుగుతుండగా కడియం మండలంలో అత్యల్పంగా మూడు వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది.

గతంలో లాభాల పంట

జిల్లాలో పండిన ఆయిల్‌పామ్ గెలలను గానుగ ఆడించి, ముడి చమురును పెద్దాపురం, నల్లజర్లలోని యర్నగూడెలో మిల్లులకు తరలిస్తుంటారు. ఆయా మిల్లుల్లో ప్రతి నెలా సగటు ముడి చమురు నిష్పత్తి (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో-ఒఇఆర్) ఆధారంగా అధికారులు, వ్యాపారుల కమిటీ ఆయిల్‌పామ్ గెలలకు ధర నిర్ణయించి ప్రకటిస్తుంది. గతేడాది 2023 మార్చిలో టన్నుకు రూ.21,940, ఏప్రిల్‌లో రూ.22,518, మే నెలలో రూ.23,365, జూన్‌లో రూ.26,000 చొప్పున రైతులకు చెల్లించాయి. గడిచిన రెండేళ్లలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం టన్ను రూ.18,600 చొప్పున ధరలు నిలకడగా ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం మరో రూ.3000 తగ్గితే టన్ను రూ.15,600కు దిగజారే పరిస్థితులు ఉన్నాయి. ఇవే ధరలు కొనసాగితే నష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో తిరోగమనం

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ధరలు ఒక్కసారిగా నేలను తాకాయి. 2020 సెప్టెంబరులో టన్ను రూ.10,112 ఉండగా అప్పటి నుంచి క్రమేపీ ధరలు పెరిగాయి. 2021 జనవరిలో రూ.15,500, జూన్‌లో రూ.16,828 చొప్పున కొనుగోళ్లు జరిగాయి. 2022 చివరిలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని 30 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది. అనంతరం 27.5 శాతానికి సుంకం పెంచటంతో కొంత ఆశాజనక పరిస్థితులు నెలకొన్నాయి. మళ్లీ 16.5 శాతానికి తగ్గించడంతో ఆయిల్ కంపెనీలు, ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు ధరలను భారీగా తగ్గించాయి.

ధరలు నిర్ణయించేది ఇలా

ఆయిల్ పామ్ కొనుగోలుకు సంబంధించిన ధరలను ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధుల సమక్షంలో నిర్ణయాలు జరగుతుంటాయి. కంపెనీలు రైతులకు మొక్కలను అందజేసి ఫలసాయం అందజేసిన తర్వాత కమిటీ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తుంటాయి. దిగుమతి సుంకం తగ్గటంతో ఆయిల్ కంపెనీలు దేశీయా మార్కెట్లో కొనుగోలుపై ఆసక్తి చూపటం లేదు. దీంతో ధరలు నేతలను తాకుతున్నాయి.

పెట్టుబడి కూడా రావడం లేదు

టన్ను రూ.18,600 మించి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఎరువుల ధరలు పెరగటంతో సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఒకు వైపు దిగుబడులు తగ్గిపోవటం మరోవైపు ధరలు లేకపోవటంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. కనీసం టన్నుకు రూ.20,000 చెల్లిస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. మరో రూ.3000 పతనమైతే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

- పి.వెంకటనారాయణ, పామాయిల్ రైతు, నల్లజర్ల.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఎస్‌ఎఫ్ఐ ఆలిండియా మహాసభను విజయవంతం చేయండి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరళ రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఎస్ఎఫ్ఐ ఆలిండియా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్య అందరి హక్కు అనే నినాదంతో ప్రపంచశాంతిని కోరుతూ నాలుగు రోజులపాటు కేరళ రాష్ట్రంలో జాతీయ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో నూతన జాతీయ విద్యా విధానంపై చర్చించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విద్యా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 117ను తీసుకొచ్చి ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఎన్నికల ముందు ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన నారా లోకేశ్ నేడు విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసి పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు, ప్రయివేటు దోపిడీకి వ్యతిరేకంగా మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేస్తామని తెలిపారు. కర్తవ్యాలను, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

స్పిరి పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.25 కోట్ల మేర ఆస్తి నష్టం

ప్రజాశక్తి- సత్యవేడు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పాలగుంట గ్రామం వద్దనున్న స్పిరి ప్యాకింగ్ (టివి, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్ మాన్యూఫ్యాక్చరింగ్) యూనిట్ పరిశ్రమలో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సుమారు రెండు గంటల పాటు మంటలు చెలరేగాయి. దీంతో పరిశ్రమలోని 60 మంది కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. కార్మికులు బయటకు రావడంతో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. దట్టమైన పొగలు కమ్మేయడంతో పరిశ్రమ పరిసర గ్రామ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పరిశ్రమలోని భారీ యంత్రాలు,


మంటల్లో కాలి బూడిదైన పరిశ్రమలోని యంత్రాలు

గూడ్స్, ముడి పదార్థం, పైకప్పు అగ్నికీలలకు బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.25 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ యాజమాన్యం పేర్కొంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని,ప్రమాద ఘటన కారకాలపై అధికారుల నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉందని యాజమాన్యం తెలిపింది. పరిశ్రమను గత రెండు రోజులుగా షట్ డౌన్ చేసి శుభ్రపరిచే పనిలో కార్మికులు ఉన్నారని పేర్కొంది.

పైసలిస్తేనే బిల్లులు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బిల్లులు పరిష్కారం కావాలంటే కాసులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని చిన్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం బిల్లులో ఏకంగా 15 నుంచి 20 శాతం వరకు చెల్లిస్తేనే పరిష్కారమువుతన్నాయని అంటున్నారు. ఆర్థికశాఖలో పనిచేస్తున్న కీలక ఉద్యోగులే ఈ కమిషన్ల వ్యవహారంఅట మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్ని బిల్లుల్లో అయితే 30 శాతం వరకు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఉద్యోగులకు సంబంధించిన బిల్లులతోపాటు, నిర్మాణ రంగంలో జరుగుతున్న పనులకు కూడా అనేక సంవత్సరాలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన పనులని వైకాపా ప్రభుత్వం, వైకాపా హయాంలో జరిగిన పనులు అని తెలుగుదేశం ప్రభుత్వం బిల్లుల చెల్లింపులను నిలిపివేస్తున్నట్లు చాలాకాలంగా ఆరోపణలు ఉన్నాయి.

దీ ంతో ఎంతో కొంత ముట్టచెప్పి బిల్లులను పరిష్కరించుకోవడమే మేలని కాంట్రాక్టర్లు భావిస్తున్నారు. దీంతో నేరుగా ఆర్థికశాఖ చుట్టూ తిరిగే వారి సంఖ్య కూడా పెరిగిపోతున్నట్లు సమాచారం. మంత్రులు, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో అధికారులను కలిసే వారు కొందరైతే, ఆర్థికశాఖ అధికారుల పేషీల్లో పనిచేసే వారిని ఆశ్రయిస్తున్న వారు కొంతమంది కనిపిస్తున్నారు. చేసిన పనులకు రావాల్సిన బిల్లుల కోసం రెండేళ్లుగా తిరుగుతున్నామని ఒంగోలు, నెల్లూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు చెప్పారు. నెలకు కనీసం ఏడెనిమిది సార్లయినా సచివాలయానికి రావాల్సి వస్తోందని, అయినప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నడిరోడ్డుపై వ్యక్తి దారుణ హత్య

- వెంబడించి కత్తులతో దాడి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నడిరోడ్డుపై ఓ వ్యక్తిని నలుగురు దుండుగులు కత్తులతో దారుణంగా నరికి హత్య చేసిన సంఘటన ఏలూరు జిల్లా దెందులూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన మింగి ఎర్రబాబు సొంత పనుల నిమిత్తం తన స్నేహితుడైన సుధాకర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గోపన్నపాలెం వెళ్లారు. సుమారు 11 గంటల సమయంలో తిరిగి ఏలూరుకు వస్తుండగా సోమవరప్పాడు గ్రామ శివారుకు వచ్చేసరికి వెనుకగా వచ్చిన ఒక కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడిపోయారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు ఒక్కసారిగా ఎర్రబాబుపై కత్తులతో దాడి చేశారు. దుండగుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినా వెంబడించి పట్టుకుని పలుమార్లు ఆయన మెడపై నరికారు. దీంతో ఎర్రబాబు ఘటన స్థలంలోనే మృతి చెందారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

పాఠశాల విలీనం వద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి - చాపాడు

వైఎస్ఆర్ కడప జిల్లా చాపాడు మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లె గ్రామం ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5వ తరగతుల విద్యార్థులను 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొర్రాయపల్లి మోడల్ పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. స్కూలు ప్రారంభమైనప్పటి నుంచి విద్యార్థులను పాఠశాలకు పంపడం లేదు. ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పలు దఫాలు పాఠశాలకు వచ్చి విద్యార్థులను పంపాలని అడిగినప్పటికీ వారు ససేమిరా అంటున్నారు. శనివారం పాఠశాలను తెరిచేందుకు వచ్చిన ప్రధానోపాధ్యాయులు శ్రీదేవిని విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకున్నారు.

పాఠశాలను తెరవకుండా నిరసన తెలిపారు. దళితులమైన మా విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పిల్లలను చదువుకు దూరం చేసే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామంలోని పాఠశాల కొనసాగించకపోతే మండల, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. గ్రామంలో పాఠశాలను కొనసాగిస్తే తప్ప ఇతర పాఠశాలకు తమ పిల్లలను పంపమని ఖరాకండిగా చెప్పారు. సమస్యను దృష్టిలో పెట్టుకుని అధికారులు పాఠశాల మార్పును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తగ్గిన నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ : ప్రత్యక్ష పన్ను వసూళ్ల పడిపోవడం దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడానికి మరో సంకేతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్ నుంచి జూన్ 19 నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.4.59 లక్షల కోట్లకు తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలోని రూ.4.65 లక్షల కోట్ల రాబడితో పోల్చితే 1.39 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. అడ్వాన్స్ పన్ను వసూళ్లు 3.87 శాతం పెరిగి రూ.1.56 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ 1 నుంచి జూన్ 19 మధ్య కార్పొరేట్ పన్ను వసూళ్లు 5 శాతం పైగా క్షీణించి రూ.1.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కార్పొరేటేతర పన్నులు అయినటువంటి వ్యక్తిగత ఆదాయపు పన్ను కలుపుకుంటే స్వల్పంగా పెరిగి రూ.2.73 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్స్ 58 శాతం పెరిగి రూ.86,385 కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 4.86 శాతం పెరిగి రూ.5.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.



మహీంద్రా నుంచి ఎల్‌సివి ఫ్యూరియో8 విడుదల

ముంబయి : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా ట్రక్ అండ్ బస్ బిజినెస్ (ఎంటిబి) కొత్తగా తేలికపాటి వాణిజ్య వాహనం (ఎల్‌సివి) విభాగంలో అత్యధిక మైలేజీని అందించే మహీంద్రా ఫ్యూరయో 8ను విడుదల చేసినట్లు ప్రకటించింది. 6 టైర్ల ఈ వేరియంట్ 7 అడుగులలో లోడింగ్ ఏరియా కలిగి ఉటుందని వెల్లడించింది. వినియోగదారులకు ప్రయోజనాలను చేకూర్చడంలో కొత్త ప్రమాణాలను సృష్టించే విధంగా ఈ కొత్త ట్రక్ సిరీస్‌ను రూపొందించామని మహీంద్రా గ్రూపు ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు వినోద్ సహాయ్ పేర్కొన్నారు

టెకీల్లో ఎఐ భయాలు..

- ఊడుతోన్న ఉద్యోగాలు
- కంపెనీల పొదుపు చర్యలు



న్యూఢిల్లీ : టెక్నాలజీ కంపెనీల్లో పని చేస్తోన్న ఉద్యోగులను కృత్రిమ మేధా (ఎఐ) కలవరపరుస్తోంది. ఎఐ వల్ల తమ ఉద్యోగం ఎప్పుడు ఊడుతోందోననే భయాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. టెక్నాలజీ కంపెనీలు ఇటీవల వరుస పెట్టి ఉద్యోగులను తొలగించడమే ఇందుకు ప్రధాన కారణం. దిగ్గజ కంపెనీలన్నీ ఎఐపై దృష్టి పెట్టడం ద్వారా దాదాపు కొత్త నియామకాలను నిలిపివేశాయి. మరోవైపు భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో పొదుపు చర్యలకు దిగుతున్నాయి. ఈ పరిణామాలు అంతిమంగా ఉద్యోగుల ఉద్వాసనకు దారి తీయడం ఆందోళనకరం. ఎఐ సాంకేతికత కారణంగా రాబోయే సంవత్సరాల్లో కొన్ని ఉద్యోగాలు తగ్గుతాయని అమెజాన్ సిఇఒ ఆండీ జాస్సీ తన ఉద్యోగులతో పేర్కొన్నారు. అదే సమయంలో కొన్ని కొత్తరకం ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఇప్పటికే అమెజాన్ తన డివైసెస్ అండ్ సర్వీసెస్ విభాగంలో (అలెక్సా, కిండిల్, జూక్స్) కొంత మందిని తొలగించింది. ఎఐ ఆధారిత సాధనాలతో పనులను సులభతరం చేస్తూ.. ఖర్చులను తగ్గించుకోవాలని భావించింది.

ఈ ఏడాదిలో మైక్రోసాఫ్ట్ వరుసగా మూడో సారి తమ సిబ్బందిపై వేటు వేసింది. ప్రస్తుత నెలలోనూ ఉద్వాసనలు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. ముఖ్యంగా సేల్స్ విభాగంలో పని చేసేవారిని తొలగించనుంది. ఎఐలో పెట్టుబడులు పెంచడం, వ్యాపారాన్ని సరళీకరించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. మరో దిగ్గజ ఇంటెల్ కంపెనీ తన ఫౌండ్రీ విభాగంలో 15 శాతం నుంచి 20 శాతం ఉద్యోగులను, అంటే సుమారు 10,000 మందిని జులై నుంచి తొలగించడానికి ప్రణాళికలు వేసింది.. మరో సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ తన 5 శాతం ఉద్యోగులను లేదా 500 మందిని తొలగించే ప్రయత్నంలో ఉంది. ఎఐ సాంకేతికతతో పనులను సులభతరం చేయడం, ఖర్చులను తగ్గించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

తక్కువ పనితీరు ఉన్న 5 శాతం ఉద్యోగులకు సమానమైన 3,600 మందిని తొలగిస్తామని మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ వెల్లడించారు. ఫేస్‌బుక్, హారిజన్ విఆర్ ప్లాట్‌ఫారమ్, లాజిస్టిక్స్ విభాగాలు ఈ కోతలతో ఎక్కువగా ప్రభావితం కానున్నాయి. దిగ్గజ వాల్‌మార్ట్ కంపెనీ 1,500 ఉద్యోగాలను తొలగిస్తోంది. ఖర్చులను తగ్గించడం, వ్యాపారాన్ని సరళీకరించుకోవడం కోసం ఉద్వాసనలు తప్పడం లేదని పేర్కొంది. జాక్ డోర్సీ నేతృత్వంలోని బ్లాక్ కంపెనీ సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని ఉద్వాసనలు చోటు చేసుకోనున్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

బిఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త 5జి సేవలు

- సిమ్ లేకుండానే 100 ఎంబిపిఎస్ స్పీడ్

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్ సరికొత్త 5జి ఇంటర్నెట్ సేవలను హైదరాబాద్‌లో ప్రారంభించింది. క్వాంటమ్ 5జి (క్యూ5జి) పేరుతో హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు పోటీని ఇవ్వాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా రూ.999కే 100 ఎంబిపిఎస్ స్పీడ్‌తో నెట్ సేవలను ప్రారంభించింది. ప్రీమియం ప్లాన్ రూ.1,499తో 300 ఎంబిపిఎస్ సేవలను ఆవిష్కరించింది. దీనికి ఎలాంటి సిమ్ కార్డ్, వైరింగ్ అవసరం లేదని ఆ కంపెనీ వెల్లడించింది. బిఎస్ఎన్ఎల్ క్యూ -5జి తీసుకున్న వినియోగదారుల ఇళ్లపై సిపిఇ పరికరాలను ఏర్పాటు చేస్తారు. స్పెషల్ ఇండోర్ రూటర్‌ను ఉపయోగించడం ద్వారా బిఎస్ఎన్ఎల్ 5జి టవర్ నుంచి సిగ్నల్‌ను అందుకుంటుందని తెలిపింది. క్యూ అంటే క్వాంటమ్. ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ పెద్దగా అందుబాటులో లేని టైర్-2, టైర్-3 నగరాలను లక్ష్యంగా చేసుకుని బిఎస్ఎన్ఎల్ కొత్త క్యూ-5జి ఎఫ్‌డబ్ల్యుఎ సేవలను ఆవిష్కరించింది.

ఈ సరికొత్త సర్వీస్‌లు వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, నెట్వర్క్ లేని నివాస ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడంలో సహాయపడుతుంది. క్వాంటమ్ 5జి సేవలను ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి బెంగళూరు, పాండిచ్చేరి, విశాఖపట్నం, పూణె, గ్వాలియర్, చండీగఢ్ వంటి నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.


కొరియా గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, గిరిజనులు


పాదయాత్రను ప్రారంభిస్తున్న ప్రజాసంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు

కొఠియా సరిహద్దు గ్రామాల సమస్యను పరిష్కరించాలి

- ఆంధ్ర - ఒడిశా సరిహద్దు గ్రామాల్లో గిరిజన సంఘం పాదయాత్ర

ప్రజాశక్తి-సాలూరు రూరల్

దశాబ్దాల కాలం నుండి ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో వివాదాస్పదంగా ఉన్న కొఠియా సరిహద్దు సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొఠియా గ్రామాల్లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఎగువ శెంబి గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర ఎగువ కొఠియా, దిగువ కొఠియా, ముడకారు, బర్నపాడు, పగులు చెన్నూరు, పట్టుచెన్నూరు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గెమ్మెల జానకిరావు మాట్లాడుతూ.. ఒడిశా ప్రభుత్వం ఇటీవల కాలంలో దూకుడు పెంచి గిరిజనులపై దాడులకు దిగుతోందని, ఈ దాడులను అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని, గిరిజనులకు రక్షణ కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని తెలిపారు.

షెడ్యూల్ ఏరియాలో సర్వ హక్కులు గిరిజనులకే చెందుతాయని, ఇవేమీ పట్టకుండా గిరిజనుల భూములను లాక్కోవడానికి ఒడిశా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు రక్షణ కల్పించకుండా చోద్యం చేస్తోందని తెలిపారు. అధికారులకు కనువిప్పు కలగాలన్న ఆలోచనతోనే స్థానిక గిరిజనులు, ప్రజా సంఘాలతో కలిసి పాదయాత్ర చేపట్టామని చెప్పారు.

సమస్యలను పరిష్కరించి గిరిజనులకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను రాజకీయ ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని, ఈ వైఖరి మారాలని, ఈ ప్రాంత అభివృద్ధికి రెండు రాష్ట్రాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తాడంగి సన్నము, కొమ్ములు, బీమా, రంజిత్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించిన ఎల్ఐసి హెచ్‌ఎఫ్ఎల్

న్యూఢిల్లీ : గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించినట్లు ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెల్లడించింది. ఆర్‌బిఐ ఇటీవల రేపురేటును తగ్గించిన నేపథ్యంలో తమ సంస్థ కూడా వడ్డీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టామని పేర్కొంది. దీంతో గృహ రుణాలపై వడ్డీ రేట్లు 7.50 శాతం నుంచి ప్రారంభమవుతాయని ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ ఎండి, సిఇఒ త్రిభువన్ అధికారి తెలిపారు. కొత్త వడ్డీ రేట్లు జూన్ 19 నుంచి అమల్లోకి వచ్చాయని సంస్థ 36వ ఫౌండేషన్ డే సందర్భంగా వెల్లడించారు.

సంపాదకీయం


మనోభావాలు

మనిషి జీవితంలో ఒక పరిధి మేరకు మాత్రమే మనోభావాలకు ప్రాముఖ్యతనివ్వాలి. మనోభావాల ప్రాతిపదికన సమాజం, ప్రపంచం నడవవు. 'మనిషన్నాక కూసింత కళాపోషణ వుండాలి' అన్నట్టుగానే...మనిషన్నాక మనోభావాలూ వుంటాయి. కానీ, అవి వ్యక్తిగతమైనవి. వాస్తవాలు వేరు... మనోభావాలు వేరు. కాలక్రమంలో మనోభావాలు మారుతుంటాయి. కానీ, సత్యం సార్వజనీనమైనది. మనోభావాల మత్తులో సత్యాన్ని, వాస్తవాన్ని గుర్తించలేకపోవడం మూర్ఖత్వం. ముఖ్యంగా విద్య, సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక, శాస్త్రీయ, కళా రంగాల్లో మనోభావాలు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. ఒక వ్యక్తి మనోభావాలు, మరో వ్యక్తికి గాని, సమాజానికి గాని అక్కరలేనివి. బిజెపి అధికారంలోకి వచ్చాక మనోభావాల పేరుతో మూకదాడులు పెరిగాయి. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటనకు చోటు లేకపోతే, అది నియంతృత్వానికి దారితీస్తుంది. 'కళల విషయంలో ఎవరి భావన వారిది' అంటాడు కొడవటిగంటి. సాహిత్య మేధో రంగాల్లో భావ ప్రకటన కీలకమైనది. మాధ్యమం ఏదైనా సమాజం గురించి, జీవితం గురించి తమ అభిప్రాయాలను వారిదైన కళాత్మక ప్రక్రియలో వ్యక్తీకరించేదే భావప్రకటనా స్వేచ్ఛ. మనోభావాల పేరుతో ఆ స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం, భావ ప్రకటన గొంతు నులమడం సమాజానికి శ్రేయస్కరం కాదు, అది ప్రజాస్వామ్యబద్ధం అంతకన్నా కాదు. 'వాక్ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ.. అన్ని ఇతర స్వేచ్ఛలకు పునాది. అదిలేని ప్రజాస్వామ్యం ఒక ప్రహసనమే' అంటారు అంబేద్కర్.

పెరుమాళ్ మురుగన్ దగ్గర నుంచి మేఘా ఎం. వేమూరి వరకూ ఎంతో మందిపై మనోభావాల పేరుతో భౌతికంగా, మానసికంగా దాడులు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో సినిమాలు, రచనలు, స్టాండప్ కామెడీ, కళా ప్రదర్శనలు, నాటకాలపై మనోభావాలు దెబ్బతిన్నాయనే ఆరోపణలు ఎక్కువయ్యాయి. ఒకవైపు వాస్తవాలను, చరిత్రను వక్రీకరించే సినిమాలు చేస్తూనే.. మరోవైపు మనోభావాల పేరుతో 'పికె', 'పద్మావతి' వంటి సినిమాలను నిషేధించాలని కోర్టులకెక్కిన ఘటనలూ వున్నాయి. అదేమంటే.. దాడులకు దిగడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల కోర్టులు తీసుకున్న వైఖరి భావప్రకటన హక్కుకు ఇచ్చిన గౌరవం ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' సినిమా విడుదలపై వివాదం, మతం, భాష, ప్రాంతీయ భావోద్వేగాల పేరిట సినిమాలపై నిషేధాలు, బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భావ ప్రకటన హక్కుకు, ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా నిలిచింది. 'భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం, ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కు ఉంది. దాన్ని కేవలం ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న పరిమితుల వరకు మాత్రమే నియంత్రించవచ్చు. మిగతా ఏ కారణంతోనూ ఆ హక్కును అడ్డుకోవడం చట్టబద్ధం కాదు, సినిమా చూడటం, చూడకపోవడం వ్యక్తిగతమైన హక్కు. ఇతరులకు ఆ హక్కును నిరాకరించే అధికారం ఎవరికీ లేదు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు- 'మనోభావాలు గాయపడటమనే దానికి అంతులేకుండా పోయింది. ఏదైనా చూసినా, విన్నా, ఎవరోకరి మనోభావాలు గాయపడుతూనే వుంటాయి. ఆ వెంటనే హింస, విధ్వంసం, ఈరోజు ఒక సినిమా అయింది, రేపు ఎవరోకరు ఒక నాటకాన్ని వేయద్దొంటారు. మనం ఏ దిశగా పయనిస్తున్నాం?' అన్న జస్టిస్ భుయాన్ ప్రశ్న అందరినీ ఆలోచింపజేసేదే!

'మనకు నచ్చని వారి భావప్రకటనా స్వేచ్ఛను మనం గౌరవించకపోతే, మనం స్వేచ్ఛను నమ్మినట్లు కాదు' అంటారు నోమ్ చామ్‌స్కీ. ఈ మాటలు మన సమాజానికొక హెచ్చరిక. దేశంలో సినిమాలు, సాహిత్యం, నాటకాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకంగా మూక దాడులు, హింస, బెదిరింపులకు మనోభావాలు, భావోద్వేగాలు కారణంగా చెబుతున్నారు. ఈ పేరుతో భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవడమంటే సృజనాత్మకతను, ప్రజాస్వామ్యాన్ని, సామరస్యతను బలహీనపర్చడమే. ప్రజలను బెదిరించే ఈ మూకలు, గ్రూపులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించడమంటే, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే. భావప్రకటనా స్వేచ్ఛ లేకపోతే, సమాజం జీవితం కోల్పోతుంది.

మంచి మాట



భూమిని పంచడమంటే...
అధికారాన్ని పంచడమే.
- ఎస్.ఆర్. శంకరన్,
మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి.

సుప్రీం న్యాయమూర్తుల సంచలన వ్యాఖ్యలు

ప్రస్తుతం





తెలకపల్లి రవి

కేంద్రం సుప్రీం కోర్టుతో ఎలా చెలగాటమాడుతున్నదో గత కొద్ది రోజులుగా అత్యున్నత న్యాయ వ్యవస్థకు సంబంధించిన వివాదాలు, వ్యాఖ్యానాలు చూస్తే అర్థమవుతుంది. సాక్షాత్తూ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, నవంబరులో ఆయన పదవీ విరమణ అనంతరం బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్‌లు స్వయంగా మాట్లాడిన మాటలే ఇందుకు తార్కాణంగా వున్నాయి. జస్టిస్ చంద్రచూడ్ పదవీ విరమణానంతరం వరుసగా వచ్చే సిజెఐ లు ఎవరూ ఆరు మాసాలకు మించి కొనసాగే అవకాశం లేదని అందరికీ తెలుసు. అంటే కీలకమైన రాజ్యాంగ సవాళ్లు, నియామకాలు, వ్యవస్థాగతమైన నిర్ణయాలు తేల్చకుండా పేరబెట్టేందుకూ, నచ్చనివి ఆలస్యం చేసేందుకు అవకాశం లభించినట్టుగా మోడీ ప్రభుత్వం భావిస్తున్నది. గవర్నర్లపై గతంలో ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం లేవనెత్తడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. పూర్తిగా రాజ్యాంగ నిబంధనల మేరకు ఇచ్చిన కీలకమైన తీర్పునే తిరగదోడేందుకు స్వయంగా రాష్ట్రపతిని రంగంలోకి దింపడం అందుకోసమే. ఈ వ్యూహాలు ఎలా వున్నా ప్రాథమిక హక్కుల రక్షణకు మాత్రం కట్టుబడి వున్నానని సుప్రీం కోర్టు స్పష్టం చేస్తున్నది. కానీ రోజువారీ నిర్వహణకు సంబంధించిన ఆలస్యాలు, ఆటంకాలు వెన్నాడుతుండటం ఆందోళన కలిగిస్తుంది.

ముక్కలు చేస్తే ఎలా?

మే 26న బాధ్యతలు స్వీకరించిన వెంటనే జస్టిస్ గవాయ్ కేంద్ర ప్రభుత్వానికి ఒక వర్తమానం పంపించారు. కొలీజియం తొలి సమావేశానికి అధ్యక్షత వహించినప్పుడే సమూలమైన మార్పులు ప్రతిపాదించారు. జడ్జిల నియామకాలకూ, బదిలీలకూ సంబంధించి చేసే సిఫార్సులపై ఏక మొత్తంగా చర్య తీసుకోవాలితప్ప దశలవారీగా ముక్కలుముక్కలుగా నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన కోరారు. కొలీజియం పంపిన సిఫార్సులలో కొన్నింటిని విడదీసి నిర్ణయాలు చేస్తే సీనియారిటీ దెబ్బతిని పోవడమేగాక దాని సాధికారత గురించే సందేహాలు ఏర్పడతాయన్నది ఆయన అభిప్రాయంగా చెబుతున్నారు. సిజెఐ గవాయ్ రాకముందటి కాలానికి సంబంధించిన కొన్ని సిఫార్సులే ఇప్పటికీ పెండింగులో వున్నాయని న్యాయవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కొలీజియంలో సిజెఐ గాక న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, జె.కె.మహేశ్వరి, బి.వి.నాగరత్న సభ్యులుగా వున్నారు. బాధ్యతలు చేపట్టగానే తొలి చర్యగా జస్టిస్ గవాయ్ ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల పేర్లను సుప్రీం కోర్టుకు సిఫార్సు చేశారు. జస్టిస్ అంజారియా, విజయ్ బిష్ణోయ్, ఎ.ఎస్.చందూర్కర్‌ల పేర్లను పంపించారు. ఆ పేర్లన్నిటినీ కేంద్రం వెంటనే ఆమోదించడంతో సుప్రీం కోర్టు జడ్జిల పూర్తి సంఖ్య 34కు చేరుకున్నది.

సుప్రీంకోర్టు జడ్జిల నియామక సిఫార్సులతో పాటు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులుగా అయిదుగురి పేర్లను పంపుతూ, మరో నలుగురు ప్రధాన న్యాయమూర్తులను అటూ ఇటూ బదలాయించేలా పేర్లు పంపించింది. 22 మందిని వారి వ్యక్తిగత అభ్యర్థనలను లేదా వ్యవస్థ అవసరాలను బట్టి బదిలీ చేసింది. ప్రత్యేకించి ఢిల్లీ హైకోర్టుకు ఆరుగురు జడ్జిలను ప్రతిపాదించింది. ఇందులో ఒకరు మాత్రం ఆమోదం తెల్పడంలో ఆలస్యం వల్ల పూర్తి కాలేదు. వాస్తవానికి నియామకాల ప్రక్రియలో అన్ని ప్రతిపాదనలూ ఒకేసారి ఆమోదించాలన్న నిబంధనేమీ లేదు. అయినా న్యాయవ్యవస్థ మాత్రం అందులోని చిక్కుల రీత్యా ముక్కలుముక్కల కింద చూడొద్దనే చెబుతున్నది. 2014లో అప్పటి సిజెఐ ఆర్.ఎం. లోధా ఈ విషయమై మాజీ న్యాయమంత్రి రవిశంకర్‌కు అభ్యంతరం తెలియజేశారు. మాజీ సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రమణ్యం పేరును పక్కన పెట్టడంపట్ల ఆయన అభ్యంతరం చెప్పగా సుబ్రమణ్యం తన నామినేషన్‌నే ఉపసంహరించుకున్నారు. 2022లో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నాయకత్వంలోని ధర్మాసనం ఈ విధంగా ఇష్టమైన వారిని మాత్రమే కేంద్రం ఎంచుకునే పద్ధతి పనిలో విశ్వాసానికి విఘాతం కలిగిస్తుందని, తప్పు సంకేతాలు పంపుతుందనీ విమర్శించారు. అయితే 2023 డిసెంబర్‌లో ఆయన పదవీ విరమణ చేయడంతో ఆ విచారణ ముందుకు సాగడంలేదు.

స్వతంత్రత, సమతుల్యత

న్యాయవ్యవస్థకు సంబంధించిన విషయాలపై నిర్ణయాలు తీసుకోవడానికిగాను జ్యుడిషియల్ కమిషన్ నియమించాలని చాలా కమిటీలు సిఫార్సులు చేశాయి. అయితే దానికి బదులుగా మోడీ సర్కారు 2014లో జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టం (ఎన్‌జాక్) తీసుకొచ్చింది. సమూలమైన సంస్కరణల కోసంగాక కేవలం నచ్చిన వారిని నియమించుకునే అధికారం కోసం తెచ్చిన బిల్లు ఇది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తున్నదనే కారణంగా దీన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం 2015లో కొట్టివేసింది. అప్పటి నుంచి ఒక నియామక నియమావళి రూపొందించుకోవాలని అంటున్నా అది పూర్తి కావడం లేదు. న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకోవడం తప్పనే వాదన చాలామంది తీసుకొస్తుంటారు గానీ ప్రభుత్వం లేదా కార్యనిర్వాహక వర్గం నియమించడం కూడా వాంఛనీయం కాదనేది మరో కోణం. న్యాయ వ్యవస్థ తీరుపైన కొందరు న్యాయమూర్తులపై ఆరోపణల గురించి ఎప్పుడూ చర్చ లేవనెత్తి ప్రభుత్వానికి పెత్తనం ఇవ్వడమే దీనికి పరిష్కారమన్నట్టు మాట్లాడుతుంటారు. ఇటీవలి కాలంలోనైతే స్వయంగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ న్యాయవ్యవస్థ కాదు, పార్లమెంటే సర్వోన్నతమన్న వాదన తీసుకొచ్చారు. న్యాయ వ్యవస్థ స్వచ్ఛతనూ స్వతంత్రతనూ కాపాడేవిధంగా ఏం చేయాలన్నదే ఇక్కడ సమస్య. కానీ బిజెపి, దాని మద్దతుదారుల ఆలోచన వేరు. ఏదో విధంగా న్యాయ వ్యవస్థపై పెత్తనం చేయాలన్నదే వారి అసలైన ఆలోచన.

సిజెఐ గవాయ్ ఈ విషయంలో సూటిగానే స్పందించారు. అంతకు ముందే సుప్రీం కోర్టులో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం స్పష్టత నిచ్చింది. ఏ వ్యవస్థ అయినా రాజ్యాంగానికి లోబడి పని చేయవలసిందే గానీ ఎవరూ అతీతులు కాదన్నది. న్యాయ, పాలనా, శాసన వ్యవస్థలు మూడు స్తంభాలనీ, పరస్పర గౌరవంతో మెలగాలని తన స్వరాష్ట్రం మహారాష్ట్రలోనే సత్కార కార్యక్రమంలో ఆయన ప్రకటించారు. రాజ్యాంగం 142వ అధికరణం ప్రకారం సుప్రీం కోర్టు గనక ఏదైనా విషయంలో పూర్తి న్యాయం కోసం ఒక చర్య తీసుకోవడం అవసరమని భావిస్తే ఆ మేరకు ఉత్తర్వునివ్వవచ్చునని ఆయన తేల్చిచెప్పారు. కానీ అదే సమయంలో నవంబరులో పదవి చేపట్టబోయే జస్టిస్ సూర్యకాంత్ విభిన్నమైన వైఖరి ప్రకటించారు. కోర్టులు శాసన వ్యవస్థను దాటి ప్రవర్తించరాదనీ, ప్రజాభిప్రాయాలపై స్వారీ చేయరాదని విమర్శించారు. అందుకు బదులుగా కోర్టులు ప్రజాస్వామ్య సంభాషణా ప్రక్రియను పటిష్టం చేయాలనీ, శ్రుతిమించిన జోక్యంతో సమతుల్యతను దెబ్బతీయరాదని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా విపరీతంగా విస్తరించిన ప్రస్తుత కాలంలో ప్రతి తీర్పుపైన వెనువెంటనే అనేక రకాల స్పందనలు వస్తున్నాయనీ, అందరినీ సంతృప్తి పర్చడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ మితిమీరిన క్రియాశీలత టెర్రరిజంగా మారిపోకూడదని సిజెఐ గవాయ్ కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సిజెఐల స్థాయిలోని ఇద్దరు కీలక న్యాయమూర్తులు ఇలా మాట్లాడటం యాదృచ్ఛికమేనా అని సందేహాలు వ్యక్తమైనాయి. ఇదిలా వుంటే మరో సందర్భంలో సిజెఐ మాట్లాడుతూ బుల్డోజర్ న్యాయం అనమతించబోమని తమ తీర్పుల ద్వారా చెప్పామన్నారు. అధికార యంత్రాంగం తానే న్యాయమూర్తి, అధికారి, తలారి అన్నట్టు వ్యవహరిస్తామంటే కుదరబోదన్నారు. కోర్టు విచారణలో వుండగానే ఉత్తర్వులు రాకుండానే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూల్చివేతలకు పాల్పడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదవులు, అవినీతి

ఈ నెలారంభంలో లండన్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ ఆయన జడ్జిల నియామకంలో ప్రభుత్వాలదే చివరి మాటగా వున్నదని, రెండుసార్లు సిజెఐల విషయంలో సీనియార్టీని తోసిపుచ్చిందని గుర్తు చేశారు. అదే సమయంలో న్యాయమూర్తులు పదవీ విరమణ వెనువెంటనే పదవులు తీసుకోవడం సరికాదని కూడా గట్టిగా ప్రకటించారు. తాను అలా తీసుకోబోనని ఆయన ప్రకటిస్తే జస్టిస్ ఓకా మాత్రం ఈ విషయంలో తాను పునరాలోచిస్తానని దాటవేశారు. కనీసం ఇద్దరు మాజీ సిజెఐలు గవర్నర్ పదవులు తీసుకోవడం, ఒకరైతే వెనువెంటనే రాజ్యసభకు వెళ్లడం సరైంది కాదనే భావం సర్వత్రా వుంది. అంతేగాక న్యాయ వ్యవస్థలో అవినీతిని గురించి కూడా ఇటీవల తరచూ విమర్శలు వస్తున్నాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం సందర్భంలో నోట్ల కట్టలు తగలబడిపోవడం ఇందుకు పరాకాష్ట. దీనిపై విచారణకు కొలీజియం ఉన్నత స్థాయి న్యాయమూర్తుల బృందాన్ని నియమించింది. దాని నివేదిక మేరకు ఆయనను రాజీనామా చేయమని కోరితే మొండికేశారు. గత్యంతరం లేక ఆయన అభిశంసన కోసం రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. దీనిపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వంటి వారు సందేహాలు వ్యక్తం చేస్తూ జస్టిస్ వర్మకు మద్దతు తెల్పడంతో సుప్రీంకోర్టు పూర్తి నివేదికను బయటపెట్టింది. నోట్లు తగలబడిన గది తనది కాదన్న జస్టిస్ వర్మ మాట వాస్తవం కాదని, ఆయనే సూచనలు చేసి మరీ తగలబెట్టించారని నివేదిక పేర్కొంది. అయితే సిబాల్ వింత ధోరణిలో వాదిస్తున్నారు. న్యాయమూర్తిని తొలగించే అధికారం ప్రభుత్వానికి ఇవ్వడమేంటని ప్రశ్నిస్తూనే వర్మ చాలా మంచి న్యాయమూర్తి అని కపిల్ సిబాల్ కితాబులివ్వడం సందేహాలు పెంచుతున్నది. కేంద్రం ఈ విషయంలో త్వరగా రంగంలోకి దిగకుండా ఆలస్యం చేస్తున్నదని మరికొందరు విమర్శిస్తున్నారు.

మనోభావాలకు అంతెక్కడ?

న్యాయవ్యవస్థను రకరకాల వివాదాల్లోకి లాగి ఇరకాటంలో పెడుతున్న ఈ పూర్వ రంగంలో నటుడు కమల్ హాసన్ కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి సుప్రీం కోర్టు కీలకమైన తీర్పునిచ్చింది. తమిళం నుంచి కన్నడం పుట్టిందని తాను ప్రేమతో చెప్పానే గానీ తక్కువ చేయడానికి కాదనీ, ప్రేమ క్షమాపణలు కోరదని కమల్ గట్టిగా వాదించారు. అసలు ఏవో వ్యాఖ్యలకుగాను ఆయన క్షమాపణలు చెప్పాలని ఆదేశించే పని హైకోర్టుకు ఎందుకని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 'థగ్ లైఫ్' విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిర్దేశించింది. భిన్న మతాలు, కులాలు, భాషలతో కూడిన ఈ దేశంలో ఎవరో ఒకరి మనోభావాలు దెబ్బ తింటాయని భావ ప్రకటనా స్వేచ్ఛను హరించలేమని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఈ విధంగా సుప్రీంకోర్టు స్థాయిలో వ్యాఖ్యలు, వివాదాలు కూడా సంచలనాత్మకంగా మారడం విశేషమే.

★

> జస్టిస్ చంద్రచూడ్ పదవీ విరమణానంతరం వరుసగా వచ్చే సిజెఐ లు ఎవరూ ఆరు మాసాలకు మించి కొనసాగే అవకాశం లేదని అందరికీ తెలుసు. అంటే కీలకమైన రాజ్యాంగ సవాళ్లు, నియామకాలు, వ్యవస్థాగతమైన నిర్ణయాలు తేల్చకుండా పేరబెట్టేందుకూ, నచ్చనివి ఆలస్యం చేసేందుకు అవకాశం లభించినట్టుగా మోడీ ప్రభుత్వం భావిస్తున్నది. గవర్నర్లపై గతంలో ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం లేవనెత్తడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. పూర్తిగా రాజ్యాంగ నిబంధనల మేరకు ఇచ్చిన కీలకమైన తీర్పునే తిరగదోడేందుకు స్వయంగా రాష్ట్రపతిని రంగంలోకి దింపడం అందుకోసమే. ఈ వ్యూహాలు వున్నా ప్రాథమిక హక్కుల రక్షణకు మాత్రం కట్టుబడి వున్నానని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తున్నది. కానీ రోజువారీ నిర్వహణకు సంబంధించిన ఆలస్యాలు, ఆటంకాలు వెన్నాడుతుండటం ఆందోళన కలిగిస్తుంది.

> రాజ్యాంగం 142వ అధికరణం ప్రకారం సుప్రీం కోర్టు గనక ఏదైనా విషయంలో పూర్తి న్యాయం కోసం ఒక చర్య తీసుకోవడం అవసరమని భావిస్తే ఆ మేరకు ఉత్తర్వునివ్వవచ్చునని గవాయ్ తేల్చిచెప్పారు. కానీ అదే సమయంలో నవంబరులో పదవి చేపట్టబోయే జస్టిస్ సూర్యకాంత్ విభిన్నమైన వైఖరి ప్రకటించారు. కోర్టులు శాసన వ్యవస్థను దాటి ప్రవర్తించరాదనీ, ప్రజాభిప్రాయాలపై స్వారీ చేయరాదని విమర్శించారు. అందుకు బదులుగా కోర్టులు ప్రజాస్వామ్య సంభాషణా ప్రక్రియను పటిష్టం చేయాలనీ, శ్రుతిమించిన జోక్యంతో సమతుల్యతను దెబ్బతీయరాదని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా విపరీతంగా విస్తరించిన ప్రస్తుత కాలంలో ప్రతి తీర్పుపైన వెనువెంటనే అనేక రకాల స్పందనలు వస్తున్నాయనీ, అందరినీ సంతృప్తి పర్చడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ మితిమీరిన క్రియాశీలత టెర్రరిజంగా మారిపోకూడదని సిజెఐ గవాయ్ కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సిజెఐల స్థాయిలోని ఇద్దరు కీలక న్యాయమూర్తులు ఇలా మాట్లాడటం యాదృచ్ఛికమేనా అని సందేహాలు వ్యక్తమైనాయి.

యోగాను సైన్సు ఎందుకు అంగీకరించదు..

కామన్ సెన్స్



దేవరాజు మహారాజు


కొన్నేళ్ళ క్రితం వరకూ శారీరక శ్రమ ఎక్కువగా ఉండేది. అప్పటివారు చేసే పనులన్నీ జీవన శైలిలో అంతర్భాగంగా ఉండేవి. ప్రత్యేకంగా వ్యాయామం చేయడం ఉండేది కాదు. పరిశ్రమలు పెరిగి, యంత్రాలు వచ్చి శారీరక శ్రమం స్థానంలో బుద్ధి బలానికి విలువ పెరుగుతున్నకొద్దీ వ్యాయామం అవసరమైంది. ఆటలు అవసరమయ్యాయి. అందుకే అన్ని రకాల వ్యాయామాల్ని, జిమ్నాస్టిక్స్‌ని, ఆటల్ని, క్రీడల్ని సైన్సు ఆమోదించింది. ముక్కు మూసుకుని చేసే ధ్యానాన్ని, యోగాను, సమాధిని సైన్సు అంగీకరించలేదు.

ఆటలకూ, క్రీడలకూ దేవుడితోనూ, మతాలతోనూ సంబంధం లేదు. కానీ, హిందూ మతానికి సంబంధించి కొందరు యోగాను, ధ్యానాన్ని, సమాధిని పరమాత్మలో లీనమయ్యేందుకు మార్గంగా ఎంచుకున్నారు. ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు లంకె పెట్టారు. అందువల్ల వీటిని సైన్సు గుర్తించదు. మత ధర్మాల్లాగా ఇవీ విశ్వాసాలుగా ఉండిపోతాయి. ముందుగా ఆ తేడాను గమనిస్తే వాటి వాటి స్థానాలేమిటో బోధపడుతుంది.

యోగాను ప్రతిపాదించిన పతంజలి "యోగః చిత్తవృత్తి నిరోధకః" అన్నాడు. అంటే యోగ ఆలోచనల్ని స్థంభింపజేస్తుందని అర్థం! అంతే కాదు. యోగ మోక్షానికి మార్గమనే చెప్పాడు పతంజలి-అంతేకాని, ఆరోగ్య సాధన కోసం ఇది పనికొస్తుందని చెప్పలేదు. ఇటీవలి కాలంలో ఆధునిక యోగా గురువులు వారి వారి ఆలోచనల్ని జోడించి, జనాన్ని మభ్యపెడుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ఆధునిక వ్యాపార గురువులు యోగ క్యాన్సర్‌నీ, ఎయిడ్స్‌నీ కూడా తగ్గిస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పతంజలి-యోగాను ప్రతిపాదించిన కాలానికి క్యాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులు గుర్తించబడలేదు. యోగ ఈ వ్యాధుల్ని తగ్గిస్తుందంటే మరి నిరూపణ ఏదీ? వారి దగ్గర నిరూపణ ఏదీ లేదని కూడా మనకు తెలుసు. అయినా కూడా వారు పెట్టే 'చెవిలో పువ్వుని' భక్తితో పెట్టించుకుని, వారి పిట్టకథలు వింటూ ఉండాలని వారి కోరిక! యోగాతో సర్వ రోగాలూ మటుమాయం అయ్యే మాటైతే-నిత్యం యోగాను పాటించిన రామకృష్ణ పరమహంస, రమణ మహర్షులను క్యాన్సర్ ఎందుకు కబళించిందీ? మనకు మనం ఆలోచించుకోవలసిన విషయాలు.

'యోగ'-అంటే వ్యాయామం అనే అర్థం కూడా ఉంది కదా? మరి దాన్ని తీసుకుంటే తప్పేమిటి? అనేవారు కొందరుంటారు. దేహ దారుఢ్యానికి ఉపయోగపడే పరేడ్ సైనికులకు, ఎన్.సి.సి. కాడిట్‌లకు ఉంటుంది. స్కూలు పిల్లలకు డ్రిల్ పీరియడ్ ఉంటుంది. యోగ ఇలాంటి శారీరక వ్యాయామాల కిందికి రాదు. వైద్య రంగంలో 'ఫిజియోథెరపీ' ట్రీట్‌మెంట్ ఉంది. ఏ రోగికి ఎలాంటి వ్యాయామం అవసరమో, అది ఎంత కాలం చేయాల్సి ఉంటుందో వైద్య నిపుణులు నిర్ణయిస్తారు. జిమ్‌లో కూడా ట్రైనర్లు ఉంటారు. మీ ధ్యేయమేమిటో తెలుసుకుని, మీకు ఎలాంటి వ్యాయామం అవసరమో వారు అలాంటివి నిర్ధారిస్తారు. చెప్పుకోవాల్సింది ఏమంటే వ్యాయామానికి ఒక ధ్యేయం ఉంటుంది. ఏం కావాలనుకుంటున్నాం-ఏం సాధించాలనుకుంటున్నాం అనేదానిమీద ఎక్సర్‌సైజ్ ప్రోగ్రాంలు వుంటాయి. వైవిధ్యభరితంగా ఇన్ని ఆటలు, క్రీడలు, వ్యాయామాలు ఉండగా యోగా ఎందుకు? దాని వల్ల ఒనగూరే ప్రయోజనం ఏముందీ? అనేది సీరియస్‌గా ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. చదువుల్లో కూడా అంతే కదా? మనం ఏం కావాలనుకుంటున్నామో, దాన్ని బట్టే కోర్సులుంటాయి.

డాక్టర్ అశోక్ రాజ్ గోపాల్ మోకాలి చిప్ప మార్పిడి చేసే ప్రత్యేక నిపుణుడు. ఆయన చెప్పిన విషయాల్ని 'ద డెయిలీ టెలిగ్రాఫ్' ప్రకటించింది. న్యూ ఢిల్లీకి చెందిన డీన్ నెల్సన్ కూడా కొన్ని వివరాలు అందించాడు. ఈ భారతీయ వైద్య నిపుణులు ఇచ్చిన వివరాలను, వివరణలను బట్టి మనం తెలుసుకోగలిగేది ఏమంటే-చాలా మంది యోగా గురువులు



మోకాలి చిప్ప మార్పిడి కోసం సర్జరీ చేయించుకున్నవారే! ఇంకా చాలామంది ఇప్పటికీ సర్జరీ లైన్లో నిలబడుతున్నవారే. 'థండర్ బోల్ట్' అనే వజ్రాసనం వేసేవారికి ఈ మోకాలి చిప్ప ఆపరేషన్‌లు తప్పనిసరి అవుతున్నాయి. ఇంతకూ వజ్రాసనం ఎలా వేస్తారు? అంటే మోకాళ్ళు రెండూ వెనక్కి మడిచి, మడిమెల మీద కూర్చుంటారు. దాని వల్ల మోకాళ్ళ ఒత్తిడికి గురై నాడులూ, జాయింట్లు దెబ్బతింటాయి. ఫలితంగానే యోగా గురువులు, వారి శిష్యులూ కలసికట్టుగా సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోంది. మరో ముఖ్య విషయమేమంటే ఈ యోగా గురువులు ఎవరికీ మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఏమాత్రం ఉండదు. ఇష్టం వచ్చినట్టుగా కాళ్ళూ, చేతులూ, మెడ, భుజాలు వంచి విచిత్రమైన భంగిమలలో జనాన్ని ఆకర్షిస్తుంటారు.

యోగా వల్ల కీళ్ళ నొప్పులు వస్తాయని, ముందే నొప్పులు ఉన్నవారికి అవి అధికమౌతాయనీ ఆర్థోపెడిక్ డాక్టర్లు వివరణ ఇస్తున్నారు. వెన్నెముకను విల్లులా వెనకకు వంచడం వల్ల అనేక అనర్థాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మనిషి వెన్నెముక ముందుకు వంగడానికి అనువుగా నిర్మాణమై ఉంది. మరి అందుకు విరుద్ధంగా వెనకకు వంచడమంటే రిస్కు తీసుకోవడమే కదా? మనిషనే జెండాను ఎగరేస్తున్నట్టు మనిషి వెన్నెముక జెండా కర్రలాగా, భూమికి 90 డిగ్రీల కోణంలో నిలబడి ఉంటుంది. అంటే భూమ్యాకర్షణ శక్తిని ఎదుర్కొంటూ వెన్నెముక మనిషిని నిలబెడుతుంది. అలాంటి ముఖ్యమైన భాగాన్ని ఇష్టం వచ్చినట్టు వంచడం అనేది తెలివైన పని కాదు. బాల్యం నుండే ఆసనాలు అభ్యాసం చేసేవారి విషయం వేరు. మధ్య వయస్సులో, వృద్ధాప్యంలో ప్రారంభించేవారు సమస్యలు ఎదుర్కోక తప్పదు.

ప్రాణాయామంలో గట్టిగా శ్వాసపీల్చి, వదిలేయాల్సిన గాలిని, అంటే కార్బన్ డై ఆక్సైడ్‌ను వదిలివేయకుండా ఎక్కువ సేపు ఊపిరితిత్తుల్లో బలవంతంగా ఆపడం జరుగుతుంది. అది మంచిది కాదని నిపుణులు చెప్తారు. ఎక్కువ ఆక్సిజన్ పీల్చుకుంటే ఆరోగ్యం చేకూరుతుంది. కానీ కార్బన్ డై ఆక్సైడ్ సత్వరం వదిలేయాల్సిన వాయువు. శరీరంలోని జీవన క్రియల్ని నిర్వర్తించడానికి మొత్తానికి మొత్తంగా శారీరక ధర్మాల్ని పర్యవేక్షించడానికి మెదడుకు ఎక్కువ రక్తం అవసరమౌతుంది. శరీరానికి అందే ఆక్సిజన్‌లో 20 శాతం మెదడే ఉపయోగించుకుంటుంది. యోగా చేసేప్పుడు మెదడుకు తగినంత ఆక్సిజన్ అందదు. అందుకే మెదడు స్తబ్దుగా అయిపోయి, భ్రమలు కలగడం ప్రారంభమౌతాయి. అలాగే సుష్టుగా భోజనం ముగించాక చూడండి ఒళ్ళంతా బరువుగా, బద్ధకంగా, స్తబ్దుగా ఉంటుంది. అలా ఎందుకూ అంటే-జీర్ణాశయం నిండిన ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ మొత్తంలో రక్తం జీర్ణ వ్యవస్థకు చేరుతుంది. ఫలితంగా మెదడుకు ఆక్సిజన్, రక్తప్రసరణ తాత్కాలికంగా తగ్గుతాయి. కాలో, చెయ్యో తిమ్మిరెక్కడం అలాంటిదే-రక్త ప్రసరణలో అంతరాయమే- యోగ, ధ్యానం చేయడం వల్ల, సమాధిలోకి పోవడం వల్ల జరుగుతున్నదీ అదే! ఆలోచనల్ని అరికట్టి, మెదడును మొద్దుబారించి, భ్రమల్లోకి, కల్పనల్లోకి పోవడమే!

'శ్వాస మీద ధ్యాస' అని చెపుతారు కొందరు. అంటే ఏమిటీ? కళ్ళు మూసుకుని, శ్వాస మీద ధ్యాస పెట్టి ఇష్ట దైవాన్ని తలచుకోవడం. అట్లా అట్లా భ్రమల్ని ఊహల్ని పెంచి పోషించుకుని దైవ దర్శనమయ్యిందని సంతృప్తిని పొందవచ్చు. ఈ ఐహిక బంధాల్లోంచి బయటపడి ఒక స్థాయికి ఎదిగి తపస్సు చేస్తే-ఆధ్యాత్మిక శక్తిని సాధించగలమని సాధువులు చప్పుంటారు. అసలు విషయమేమంటే మెదడుకు తగినంత ఆమ్లజని అందక, కలిగే భ్రమలే అవి! మనకు సాధువులు, మహర్షులు ఉన్నారు. ఇన్నివేల ఏళ్ళలో వీరిలో ఎవరైనా తపస్సు చేసి, వాస్తవంగా దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకున్నారా? తమ దేవుణ్ణి పక్కవారికెవరికైనా చూపించి పరిచయం చేశారా? లేదే-మెదడును పనికిరాని పదార్థంగా మార్చుకోవడం గొప్పపని కాదు. దాన్ని నిరంతరం వాడుతూ కొత్త కొత్త అన్వేషణలు, ఆవిష్కరణలు చేయడమే మనిషి ధ్యేయం కావాలి. చురుకైన అవయవాన్ని మరింత చురుకుగా చేసుకోవడమే విజ్ఞుల పని!

'జ్ఞాన సాధన పేరుతో మెదడును తిమ్మిరెక్కించి, భ్రమల్లో తేలిపోయి, దివ్య లోకాల సందర్శనం అంటూ, దైవ దర్శనమయ్యిందనే భ్రమలో జనానికి తప్పుడు సమాచారమిచ్చేవారిని పిచ్చివాళ్ళ కింద జమకట్టాలి. మహానుభావులెప్పుడూ తోటివారికి పనికొచ్చే పని చేస్తారు. తమను తాము వ్యర్థులుగా మార్చుకునే ప్రక్రియలు చేపట్టరు. జనానికి తప్పుడు దారులు చూపించరు. వాస్తవంలోనే భవ్యమైన భవితకు దారులు వేస్తారు.

/వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త/

> ఆటలకూ, క్రీడలకూ దేవుడితోనూ, మతాలతోనూ సంబంధం లేదు. కానీ, హిందూ మతానికి సంబంధించి కొందరు యోగాను, ధ్యానాన్ని, సమాధిని పరమాత్మలో లీనమయ్యేందుకు మార్గంగా ఎంచుకున్నారు. ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు లంకె పెట్టారు. అందువల్ల వీటిని సైన్సు గుర్తించదు. మత ధర్మాల్లాగా ఇవీ విశ్వాసాలుగా ఉండిపోతాయి. ముందుగా ఆ తేడాను గమనిస్తే వాటి వాటి స్థానాలేమిటో బోధపడుతుంది.

ప్లాస్టిక్ భూతం

- వినియోగంలో అమెరికాదే తొలిస్థానం
- మూడో స్థానంలో భారత్
- 9.3 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉద్గారం
- హెచ్చరిస్తున్న పర్యావరణ నిపుణులు, మేధావులు

న్యూఢిల్లీ : ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కాలుష్యాల్లో ప్లాస్టిక్ భూతం ఒకటి. రోజురోజుకూ దీని ఉత్పత్తి, వినియోగం పెరిగిపోతున్నది. ప్రభుత్వాల నుంచి నియంత్రణ కరువైంది. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రకృతిని నాశనం చేస్తున్నాయి. వినియోగంలో అగ్రస్థానంలో ఉన్న అమెరికా ప్లాస్టిక్ నియంత్రణకు అడ్డం పడుతోంది. పర్యావరణ ఒప్పందాల నుంచి ఏకపక్షంగా వైదొలిగి ప్రపంచానికే నష్టం కలగజేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాల విడుదల, ప్లాస్టిక్ వినియోగం.. భారత్‌లోనూ అధికంగా ఉండటంపై పర్యావరణవేత్తలు, మేధావులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనీ, దీనిపై ప్రభుత్వాలు కఠినమైన విధానాలను రూపొందించాలని సూచిస్తున్నారు.

టాప్-10 దేశాలు ఇవే..!

ప్రపంచవ్యాప్తంగా 50,702 మున్సిపాలిటీల నుంచి సేకరించిన 2020 డేటా ఆధారంగా సైన్స్ జర్నల్ నేచర్‌లో ప్రచురించిన సెప్టెంబర్ 2024 అధ్యయనం ప్రకారం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్లాస్టిక్ ఉద్గారిణిగా ఉంది. దీని ప్రకారం.. వార్షిక ప్రపంచ ప్లాస్టిక్ వ్యర్థ ఉద్గారాలలో 52.1 మిలియన్ టన్ (ఎంటి)కి గానూ భారత్ 9.3 ఎంటి (20 శాతం) వాటాను కలిగి ఉన్నది. ఆ తర్వాతి స్థానాల్లో నైజీరియా (3.5 ఎంటి), ఇండోనేషియా (3.4 ఎంటి), చైనా (2.8 ఎంటి), పాకిస్తాన్ (2.6 ఎంటి), బంగ్లాదేశ్ (1.7 ఎంటి), రష్యా (1.7 ఎంటి), బ్రెజిల్ (1.4 ఎంటి), థాయ్‌లాండ్ (1 ఎంటి), కాంగో (1 ఎంటి)లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

మన దేశంలో...

ఢిల్లీ-హర్యానా సరిహద్దులోని టిక్రి కలాన్ వద్ద ఉన్న 250 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ప్లాస్టిక్ బజార్‌లో.. ప్లాస్టిక్ స్క్రాప్‌లతో నింపబడి ఉన్న తెల్లటి పిపి రఫియా సంచుల ఎత్తైన దిబ్బలున్నాయి. భారత్‌లోని ప్రతి జిల్లా నుంచీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇక్కడకు వస్తాయని పివిసి, ప్లాస్టిక్ వ్యర్థ డీలర్ల సంఘం కార్యాలయ కార్యదర్శి విజయ్ వర్మ చెప్పారు. 10-15 టన్నుల సామర్థ్యం కలిగిన 30 నుంచి 50 ట్రక్కుల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రతి రోజూ వస్తాయని శర్మ తెలిపారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల గణాంకాలు చెప్పినదాని కంటే ఎక్కువే ఉంటాయనీ, రోజుకు 200-250 ట్రక్కులు వస్తాయని కొందరు వ్యాపారులు చెప్తున్నారు. దీన్ని బట్టి టిక్రి కలాన్ వద్ద భారీ అనధికారిక మార్కెట్ నడుస్తున్నదని తెలుస్తున్నది.



దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యుటిలు) నుంచి కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిసిపిబి) 2022 విశ్లేషణలో.. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) భారత్‌లో 12 శాతం ప్లాస్టిక్ మాత్రమే రీసైకిల్ చేయబడుతుందని, దానిలో 20 శాతం కాలిపోతుందనీ, 70 శాతం గణనీయమైన స్థాయిలో లెక్కించబడలేదని వివరించింది.

సింహభాగం ప్లాస్టిక్ లెక్కల్లోకి రావటం లేదు

భారత్‌లో 5.8 ఎంటి ప్లాస్టిక్ బహిరంగంగా కాల్చబడుతున్నది. ఇది విషవాయువుల విడుదలకు కారణమవుతున్నది. 3.5 ఎంటి ప్లాస్టిక్ పర్యావరణంలోకి విడుదలై, అది చివరగా మహాసముద్రాల్లో కలుస్తున్నది. భారత్‌లో ఉత్పత్తి అయ్యే మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలు 27.8 ఎంటిలు అని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. 2022లో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం భారత్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల భూతం భయపెట్టిస్తున్నది. ఇక్కడ 12.3 శాతం ప్లాస్టిక్ రీసైకిల్ అవుతున్నది. 19.8 శాతం కాల్చబడుతున్నది. 67.9 శాతం లెక్కల్లోకి రావటం లేదు.

లోక్‌సభలో భారత ప్రభుత్వం తెలిపిన సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) సమాచారం ప్రకారం.. 2019 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి 3.36 ఎంటిలుగా ఉన్నది. ఆ తర్వాత 2020లో 3.47 ఎంటిలు, 2021లో 4.13 ఎంటిలు, 2022లో 3.9 ఎంటిలు,2023లో 4.34 ఎంటిలుగా ఉన్నది. భారత్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను విడుదల చేసే రాష్ట్రాల్లో ఏడాదికి 0.782 ఎంటిలతో తమిళనాడు టాప్‌లో ఉన్నది. ఆ తర్వాతి స్థానాల్లో తెలంగాణ (0.528 ఎంటి), ఢిల్లీ (0.403 ఎంటి), మహారాష్ట్ర (0.395 ఎంటి), కర్ణాటక (0.360 ఎంటి)లు ఉన్నాయి. తక్కువ ప్లాస్టిక్ వ్యర్థాలను విడుదల చేసే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సిక్కిం ఏడాదికి కేవలం 84.64 టన్నుల వాటాతో ముందు వరుసలో ఉన్నది. ఆ తర్వాతి స్థానాల్లో నాగాలాండ్ (342.89 టన్నులు), త్రిపుర (347.3 టన్నులు), అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్ (744 టన్నులు), లఢక్ (860.5 టన్నులు) ఉన్నాయి.

జిడిపిలో ప్లాస్టిక్ పరిశ్రమ వాటా 1.4 శాతం

2023 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో రూ.3.5 లక్షల కోట్లుగా అంచనా వేయబడిన ప్లాస్టిక్ పరిశ్రమ.. 2028 ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా. ఇది 30 వేల ప్రాసెసింగ్ యూనిట్లకు నిలయంగా ఉన్నది. వాటిలో ఎక్కువ భాగం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలే కావటం గమనార్హం. ఇవి 40 లక్షల మందికి పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాయి. జిడిపిలో 1.4 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ సుమారు 1.07 లక్షల కోట్ల విలువైన ప్లాస్టిక్‌లను ఎగుమతి చేసిందని ప్లాస్టిక్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ తెలిపింది.

తలసరి ప్లాస్టిక్ వినియోగం 13 కేజీలు

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉన్నది. అమెరికా మొదటి స్థానంలో ఉన్నది. తలసరి ప్లాస్టిక్ వినియోగం 13కిలోలుగా ఉన్నది. ఇది ప్రపంచ సగటు 30 కిలోలతో పోలిస్తే తక్కువే అయినా.. ప్రమాదకరమేనని అంటున్నారు. భారత్.. ఒక వ్యక్తికి ఒక రోజుకు 0.054 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను విడుదల చేస్తున్నది. ఇది ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, నియంత్రణలో భారత అసమర్థతను బహిర్గతం చేస్తున్నది.

ప్లాస్టిక్ ప్రమాదకరం

ప్లాస్టిక్ ఇతర పదార్థాలు, వస్తువులలాగా అంత త్వరగా భూమిలోనో, నీటిలోనో కలిసిపోదు. ఇది నశించాలంటే చాలా ఏళ్ల సమయం పడుతుంది. కాలక్రమేణా, ఇది సూక్ష్మ, నానో-పరిమాణ కణాలుగా విడిపోతుంది. ఇవి నేల, గాలి, నీరు, కూరగాయలు వంటి ఆహార పదార్థాల్లోకి చొచ్చుకుపోయి.. మానవులు, జంతువులలో ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. గుండె, మెదడు, జీర్ణ వ్యవస్థ, రక్త ప్రవాహం.. ఇలా మానవుడి శరీరం ఉండే కీలక అవయవాలు, జరిగే పనులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. ఇక జంతువులైతే.. తెలియక తరచుగా ప్లాస్టిక్‌ను తింటుంటాయి. ఇవి కాస్తా.. ఆ పశువుల ప్రాణాలను హరించివేస్తాయి. ఇక పరిశ్రమల నుంచి విడుదలయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులు, కుంటలు, నదులు, సముద్రాలను కలుషితం చేసి, అక్కడి జీవరాశికి ప్రమాదకరంగా మారుతున్నాయి.

చట్టబద్ధమైన ఒప్పందం వాయిదా

ప్లాస్టిక్ వ్యర్థాల సంక్షోభ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని.. 2022లో 175 ఐక్య రాజ్యసమితి సభ్య దేశాలు ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టటానికి మొట్టమొదటి చట్టబద్ధమైన ఒప్పందాన్ని రూపొందించటానికి అంగీకరించాయి. గతేడాది కొరియాలోని బుసాన్‌లో జరిగిన చర్చల సందర్భంగా.. ప్లాస్టిక్ ఉత్పత్తిని మూసివేయటం వంటి వివిధ అంశాలపై విభేదాల కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తి చేసే దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకతే దీనికి కారణమైంది. తదుపరి చర్చలు ఆగస్టు 4 నుంచి 14 వరకు జెనీవాలో జరగనున్నాయి.

జస్టిస్ వర్మవి కట్టుకథలు

- ఆయన వాదనలో పస లేదు
- నిర్ధారించిన సుప్రీంకోర్టు కమిటీ

న్యూఢిల్లీ : జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను విచారించిన త్రిసభ్య కమిటీ ఆయన వాదనలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ముఖ్యంగా వర్మ రెండు వాదనలను కమిటీ ముందు వినిపించారు. తన ఇంటిలోని సామగ్రి గదిలో ఎవరో నగదును ఉంచి ఉంటారని, తనను కేసులో ఇరికించేందుకు సామగ్రి గదికి నిప్పు పెట్టారని ఆయన చెప్పుకొచ్చారు. అయితే సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఈ వాదనలతో ఏకీభవించలేదు. ఆయనను అభిశంసించాలని సిఫార్సు చేసింది. సామగ్రి గదిలోకి ఎవరైనా వెళ్లే అవకాశం ఉన్నదని, కాబట్టి తాను లేని సమయంలో ఎవరో ఆ గదిలో డబ్బు పెట్టి ఉంటారని జస్టిస్ వర్మ తనకు మద్దతుగా చెప్పారు. అయితే కమిటీ తన 64 పేజీల నివేదికలో దీనిని తోసిపుచ్చింది. స్టోర్‌రూములోకి వెళ్లాలంటే జస్టిస్ వర్మ అనుమతి తప్పనిసరి అని, ఆ గది ఆయన నియంత్రణలోనే ఉన్నదని తేల్చింది.

ఎవరో వచ్చి కరెన్సీ ఎలా పెడతారు?

కమిటీ నివేదిక నేపథ్యంలో జస్టిస్ వర్మను పదవి నుండి తప్పించడం లాంఛనమేనని తేలిపోయింది. ఈ నెల 21న ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో జస్టిస్ వర్మ అభిశంసనకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తారు. తనపై కుట్ర జరిగిందని జస్టిస్ వర్మ ఎంతగా వాదించినా కమిటీ పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన తుగ్లక్ క్రిసెంట్ బంగళా వర్మ అధీనంలోనే ఉన్నదని కమిటీ తన నివేదికలో తెలియజేసింది. జస్టిస్ వర్మ కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఎవరూ ఆ బంగళాలో ప్రవేశించలేరంటూ సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన స్టేట్‌మెంటును ప్రస్తావించింది. సిట్టింగ్ జడ్జి నివాసంలోని సామగ్రి గదికి ఎవరో వచ్చి కరెన్సీని పెట్టడం అసంభవం. బంగళా గేటు వద్ద నిరంతరం ఐదుగురు గార్డులు, ఓ పీఎస్ఓ ఉంటారు. పైగా ఆ ఇంటిలో అనేక మంది పాత, నమ్మకస్తులైన సేవకులు కూడా ఉన్నారు. ఆ ప్రాంగణంలో వారి కోసం ఆరు క్వార్టర్లు ఉన్నాయి' అని వివరించింది.

బదిలీకి కారణం కూడా అడగలేదు

సామగ్రి గదికి ఎవరో ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారంటూ జస్టిస్ వర్మ చేసిన వాదనను కూడా కమిటీ పట్టించుకోలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని జస్టిస్ వర్మ తొలుత చెప్పారని గుర్తు చేసింది. పైగా ప్రమాదంపై ఆయన పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదని తెలిపింది. 'అలహాబాద్ హైకోర్టుకు తనను బదిలీ చేస్తే జస్టిస్ వర్మ నిరాకరించలేదు. వెంటనే అంగీకారం తెలిపారు.

మామూలు పరిస్థితులలో అయితే కుటుంబ సభ్యులను సంప్రదించిన తర్వాతే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారు. మూడు సంవత్సరాల పాటు ఢిల్లీ హైకోర్టులో పనిచేసిన తనను ఎందుకు బదిలీ చేశారో తెలుసుకోవాలని అనుకుంటారు. కానీ అదేమీ జరగలేదు' అని చెప్పింది. ఎలాంటి ఫిర్యాదు లేకుండా దశాబ్ద కాలం ఆయన సేవలు అందించారని, కాబట్టి ఆయన తన బదిలీకి కారణమేమిటో తెలుసుకొని ఉండాల్సిందని వ్యాఖ్యానించింది.

కుమార్తె, ప్రైవేటు కార్యదర్శి ఏం చేశారంటే...

సెలవులు గడిపేందుకు సత్పురా అటవీ ప్రాంతానికి వెళ్లిన జస్టిస్ వర్మ ప్రమాద సమాచారం తెలిసినా మార్చి 15వ తేదీ వరకూ తన బంగళాకు చేరుకోని విషయాన్ని కమిటీ ప్రస్తావించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య ప్రైవేటు కార్యదర్శి తనిఖీకి వచ్చినా వర్మ హాజరు కాలేదని తెలిపింది. మంటలు అదుపులోకి వచ్చాయని చెబుతూ జస్టిస్ వర్మ కుమార్తె అగ్నిమాపక సిబ్బందిని బంగళా లోపలికి రానీయలేదని చెప్పింది. గదిలో కాలిపోయిన నోట్ల కట్టలు ఉన్నాయన్న విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని జస్టిస్ వర్మ ప్రైవేటు కార్యదర్శి రాజీందర్ సింగ్ కార్కీ అగ్నిమాపక సిబ్బందికి సూచించారని కమిటీ తెలియజేసింది. అగ్నిమాపక సిబ్బంది వెళ్లిపోయిన తర్వాత కర్కీ గదిని శుభ్రం చేయించారని మహమ్మద్ రహీల్ అనే సేవకుడు కమిటీకి చెప్పారు. విచారణ సమయంలో కర్కీ పరస్పర విరుద్ధమైన స్టేట్‌మెంట్లు ఇచ్చారు. విచారణ ప్రారంభం కాగానే మార్చి 15-25 తేదీల మధ్య సీసీటీవీలో నమోదైన దృశ్యాలను హార్డ్‌డిస్క్ నుండి తొలగించడంపై కమిటీ ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

చినుకు రాలదు.. సాగు సాగదు..!

- వర్షాభావంతో మందకొడిగా సార్వా పనులు
- జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే అవకాశం

ప్రజాశక్తి - కాళ్ల (పశ్చిమగోదావరి)

సార్వా సీజన్ ప్రారంభంలోనే రైతులను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. రుతుపవనాలు ముందుగా వచ్చినా వర్షాలు సరిగా కురవకపోవడంతో సార్వా సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. జూన్ ఒకటో తేదీన కాల్వలకు నీరు వదిలారు. సాధారణంగా జూన్ నెలాఖరు నాటికే నారుమళ్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే వర్షాలు కురవకపోవడం, కాల్వలకు నీరు వదిలినా మరమ్మతులు, ఇతర పేర్లతో పూర్తిస్థాయిలో నీరు దిగువకు విడుదల చేయకపోవడంతో దుక్కులు సైతం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

పశ్చిమగోదావరి జిల్లాలో రైతులు జులై మూడో వారంలోగా వరి నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. జూన్ చివరి నాటికి నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేసి, జులై మూడో వారం నాటికి నాట్లు పూర్తి చేస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో లక్షా 50 వేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఈ మేరకు పశ్చిమలో 37,500 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 1500 ఎకరాల్లోనే నారుమడుల ప్రక్రియ పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సాగులో సన్న రకాలను ప్రోత్సహించేందుకు ఎంటియు 1262 రకం విత్తనాలను అన్ని మండలాల్లో దాదాపు 125 ఎకరాల్లో విత్తన పంటగా వేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. 50 శాతం సబ్సిడీపై ఈ విత్తనాలు అందిస్తున్నారు. వరిసాగులో నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించడానికి జిల్లావ్యాప్తంగా మూడు లక్షల ఎకరాలకు అవసరమైన నానో యూరియా, డిఎపి ప్రయివేటు మార్కెట్లో అందుబాటులో ఉంచారు.



నారుమడి కోసం ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

భూసారాన్ని బట్టి ఎరువులను వాడాలి

అధికంగా ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి రైతులకు భూసార పరీక్షల కార్డులు అందిస్తున్నారు. ఫలితాల ఆధారంగా ఎరు వులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులకు అవకాశం ఉం టుంది. దీనిలో భాగంగా గతేడాది 16,205 మట్టి నమూనాలు సేక రించారు. ఈ ఏడాది 22,500 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు. వ్యవ సాయ భూముల్లో నత్రజని, కార్బన్, జింకు తక్కువగా ఉన్నాయని గుర్తిం చారు. ఈ మేరకు రైతులకు భూసార పరీక్షలు కార్డులు అందించి వాటి ఆధారంగా ఎరువులు వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.

ముందస్తు నాట్లు మేలు

జడ్.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం

సార్వా సాగులో వీలైనంత త్వరగా ముందస్తు నాట్లు వేయడం వల్ల మంచి దిగుబ డులు సాధించొచ్చు. ఇప్పటికే పంట కాల్వల్లో సమృద్ధిగా నీరు ఉంది. రైతుల త్వరిత గతిన నారుమడులు వేయాలి. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లోనే నారుమడులు పూర్తయ్యాయి. విత్తనాలు, అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జులై మూడో వారం నాటికి నాట్లు ప్రక్రియ పూర్తి చేస్తే నవంబర్, డిసెంబర్‌లలో సంభవించే తుఫాన్ల వల్ల ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

భారత్-పాక్ యుద్ధం ఆపినా...

నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వరు : ట్రంప్ సోత్కర్ష

వాషింగ్టన్ : భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపినంత మాత్రాన తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వరని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. సైనిక చర్చల ద్వారానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, అమెరికా మధ్యవర్తిత్వం ప్రసక్తే లేదని రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేసినప్పటికీ ట్రంప్ పాతపాటే పాడారు. 2026 నోబెల్ శాంతి బహుమతికి పాకిస్తాన్ తనను నామినేట్ చేయడంపై ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో స్పందించారు. 'భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపినందుకు నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వరు. నేను ఏం చేసినా ఆ బహుమతి నాకు రాదు' అని వ్యాఖ్యానించారు. తన చొరవ, దౌత్యంతో అనేక కీలకమైన శాంతి ప్రయత్నాలు ఫలించాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. 'నేను, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో కలిసి రువాండా, కాంగో మధ్య ఒప్పందాన్ని కుదర్చడంతో యుద్ధం ఆగిపోయింది. రువాండా, కాంగో ప్రతినిధులు సోమవారం వాషింగ్టన్ వస్తారు. పత్రాలపై సంతకాలు చేస్తారు. ఇది ఆఫ్రికాకు... ప్రపంచానికే గొప్ప రోజు' అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదుర్చుకునేందుకు రువాండా, కాంగో అంగీకరించాయి. సెర్బియా, కొసావో మధ్య యుద్ధాన్ని ఆపినందుకు, ఈజిప్ట్-ఇథియోపియా మధ్య శాంతి నెలకొల్పినందుకు నోబెల్ రాదు. అబ్రహం ఒప్పందాలకూ నేనే కారణం' అని ట్రంప్ తెలిపారు. ఇజ్రాయిల్‌కు, అనేక అరబ్ దేశాలకు మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్న సమయంలోనే అబ్రహం ఒప్పందాలు కుదిరాయి.

30 వరకు వ్యవసాయ డిప్లమో కోర్సులకు గడువు పెంపు

ప్రజాశక్తి - పెనుమంట్ర (పశ్చిమగోదావరి)

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సులకుగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుటకు గడువును ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లుగా మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ ఇక్కడ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఈనెల 16వ తేదీన ముగియాల్సిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లుగా తెలిపారు. ఏ కారణం చేతనైనా ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ %షషష.ఖఅస్త్రతీబ.ఖఎ.ఱఅ% ను వీక్షించ వలసిందిగా కోరారు. స్థానికులు ఏవైనా సందేహాలుంటే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు లేదా వ్యవసాయ పాలిటెక్నిక్, మార్టేరు కార్యాలయ పనివేళల్లో వచ్చి సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో

నిర్మాత మహేశ్ జిరావాలా మృతి

అహ్మదాబాద్ : అహ్మదాబాద్‌లో ఈ నెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో సినీ నిర్మాత మహేశ్ జిరావాలా (34) మరణించారు. డిఎన్ఎ మ్యాచింగ్ ద్వారా ఆయన ప్రమాదంలో చనిపోయినట్లు ధ్రువీకరించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహేశ్ జిరావాలా ద్విచక్ర వాహనంపై ఆ ప్రాంతం మీదుగా వెళు తున్నప్పుడు... విమానం అహ్మదాబాద్‌లోని మేఘనినగర్ హాస్టల్ భవనంపై కూలిపోయిందని ఓ పోలీస్ అధికారి తెలిపారు. మహేశ్ మృతదేహాన్ని కుటుంబా నికి అందజేసినట్లు పేర్కొన్నారు. డిఎన్ఎ పరీక్షల్లో జిరావాలా విమాన ప్రమాదంలో మరణించినట్లు నిర్ధారణ అయ్యిందని.. ఆయన కుటుంబం ఆయన మృతిని నమ్మలేకపోయిందని తెలిపారు. సంఘటనా స్థలంలో పోలీసులు కాలిపోయిన స్కూటర్, సిసి టీవీ ఫుటేజీ తదితర ఆధారాలను సేకరించారని సెక్టార్- జాయింట్ సీపీ జైపాల్ సింగ్ రాథోడ్ చెప్పారు.

బడి బస్సు భద్రమేనా..?

- విద్యాసంస్థల పునఃప్రారంభం
- తూర్పుగోదావరి జిల్లాలో 700లకు పైగా ప్రైవేట్ బస్సులు
- అంతంత మాత్రంగానే ఫిట్‌నెస్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి (తూర్పుగోదావరి)

పాఠశాలల ప్రారంభమైన వేళ బడి బస్సులు భద్రమేనా.. అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నాణ్యమైన విద్య నందిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. విద్యార్థులను గ్రామాల నుంచి పిల్లలను పట్టణంలోని పాఠశాలలకు తీసుకొచ్చేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నాయి. విద్యార్థులను రవాణా చేసినందుకు రవాణా చార్జీలను కూడా వసూలు చేస్తున్నారు. అయితే విద్యాసంస్థల యజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పలుమార్లు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. బస్సు సీట్లకు మించి విద్యార్థులను ఎక్కువగా చేరవేస్తున్నాయి. బస్సుల ఫిట్‌నెస్‌ను డ్రైవర్ కండీషన్‌ను పట్టించుకోవడం లేదు. ఇలాంటి బస్సులపై దృష్టి సారించి పిల్లలకు ఎలాంటి ఆపద ఏర్పడకుండా ప్రభుత్వం ఏటా ఫిట్‌నెస్ సంబంధించిన పరీక్షలు చేయాలని నిర్ణయించింది. అందుకుగాను ప్రతి సంవత్సరం బస్సులకు అందించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ను స్కూల్ ప్రారంభానికి ముందే ముగిసేట్లుగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏటా అధికారులు బస్సులు ఎంత మేర ఫిట్‌నెస్ ఉన్నాయనే దానిపై తనిఖీలు చేస్తూ విద్యాసంస్థలు పున:ప్రారంభం వరకూ సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఫిట్‌నెస్ చర్యల్లో భాగంగా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ తూర్పుగోదావరి జిల్లాలోని పలు విద్యాసంస్థలకు చెందిన బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు.

తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు పాఠశాల భవనాలకు రంగులు వేస్తూ అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ విద్యార్థులను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై మాత్రం దష్టి పెట్టడం లేదు. మరోవైపు కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడానికి వాహనాలకు తాత్కాలికంగా మరమ్మతు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతేడాది ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నా ఫిట్‌నెస్ ప్రక్రియ అంతంత మాత్రంగానే ఉంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గడువు ముగిసినా విద్యా సంస్థల బస్సులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని అధికారులు మాత్రం స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ సారైనా యాజమాన్యాలు పాఠాలు నేర్చుకుంటాయా.. ధనార్జనే ధ్యేయంగా అర్హతలేని బస్సులకు మెరుగులు దిద్దె దర్జాగా తిప్పుతారా అన్న సందేహాలు విద్యార్థి సంఘ నాయకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.



బడి బస్సు ఫిట్‌నెస్ అర్హత సాధించాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. కానీ చాలా యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లు వదలుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. పాత బస్సులకు కొత్త రంగులద్ది బస్సులను నడిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాలను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని విమర్శలు లేకపోలేదు. జిల్లాలో రవాణాశాఖ అధికారిక లెక్కల ప్రకారం 700లకు పైగా బడి బస్సులు ఉన్నాయి అందులో జిల్లా కేంద్రానికి చుట్టు పక్కల ఉన్న మండలాల్లోనే ఎక్కువగా పాఠశాలలు ఉండడం ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా గడువు చివరి వరకు వేచి ఉండి హడావుడిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని చూస్తున్నట్లు సమాచారం. అందుకు ఉదాహరణ గతేడాది ఆర్‌టిఓ కార్యాలయంలో నమోదైన ఫిట్‌నెస్ పరీక్షల బస్సుల సంఖ్య వివరాలు. ఏటా పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఫిట్‌నెస్ కోసం బస్సులను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళ్తున్నా విద్యా సంస్థల నిర్వాహకులు వారికి సంబంధించిన ఏజెంట్ల ద్వారానే బడిబస్సును ఫిట్‌నెస్‌కు తీసుకు వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలను అప్పజెప్పటంతో ఏ మేరకు నిబంధనలు అమలవుతాయో వేచి చూడాల్సి ఉంది.

ప్రమాణాలపై అనుమానాలెన్నో..

బడి బస్సుల ప్రమాణాలపై ప్రతి ఏడాది లాగానే.. ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యాలు ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటిస్తున్నాయా.. లేదా.. ఒకవేళ ఫిట్‌నెస్ లేకపోయినా ఏజెన్సీలు చూసీచూడనట్టుగా వదిలేసి వాటికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారా..? అనే ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకుల నుంచి ఉత్పన్నం అవుతున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సరిగా లేని బస్సులకు చిన్న చిన్న మరమ్మతులు చేసి రంగులు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఫిట్‌నెస్ పరీక్షలకు పంపుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలపై పూర్తి స్థాయిలో దష్టి సారించని అధికారులు హడావుడిగా ఆ ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉందని, తద్వారా ఈ పరీక్షలు తూతూ మంత్రంగా సాగుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల బస్సులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వాటి ప్రమాణాలపై అధికారులు పకడ్బందీగా వ్యవహరించాల్సిందేనని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.

ఫిట్‌నెస్ నిబంధనలు ఇలా..

బస్సుకు నాలుగు వైపుల పైభాగం మూలల్లో బయటివైపు గాఢ పసుపుపచ్చని రంగు గల ఫ్లాషింగ్ లైటు అమర్చాలి. విద్యార్థులు బస్సు నుంచి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, ఈ లైట్లను వెలిగించాలి. బస్సు ముందు భాగంలో 400 ఎంఎం సైజు బోర్డుపై పాఠశాల పేరుతో రాయించి అమర్చాలి. ఈ బోర్డుపై 250 ఎంఎంలకు తగ్గకుండా ఇద్దరు పాఠశాల విద్యార్థుల బొమ్మలను నల్లరంగులో చిత్రీకరించాలి. ఈ చిత్రం కింద స్కూల్ బస్సు అని నల్లరంగులో కనీసం 100 ఎంఎం అక్షరాలతో రాయాలి. ప్రతీ విద్యాసంస్థ సీటింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువగా విద్యార్థులను తీసుకొని వెళ్లరాదు. ప్రతీ విద్యాసంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంవత్సరానికి ఒకసారి రోడ్‌సేఫ్టీ తరగతులు నిర్వహించాలి. బస్సు ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు నుంచి 325 ఎంఎం ఎత్తుకు మించరాదు. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చాలి. బడి బస్సును నడిపే డ్రైవర్ వయస్సు 60 ఏళ్ల మించరాదు. బస్సు డ్రైవర్ పూర్తి వివరాలు ఆర్టీఓలో నమోదు చేయించాలి. డ్రైవర్‌కు హెవీ లైసెన్స్‌తో పాటు ఐదేళ్ల అనుభవం ఉండాలి. ఆరోగ్య పరిస్థితిని మూడు నెలలకు ఒకసారి యాజమాన్యమే చెక్ చేయించాలి. ప్రతి నెలా స్కూల్ ప్రిన్సిపల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి. బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ తప్పనిసరిగా ఉండాలి. ఇవి ఉన్నట్టు తెలిసేలా పెద్ద అక్షరాలతో రాయించాలి. ఇంజన్, బాడీ కండీషన్‌లో ఉండాలి. కన్వెక్షన్ క్రాస్ మిర్రర్ ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలి. బ్యాగ్‌లను భద్రపరుచుకునేందుకు సీట్ల కింద ర్యాక్‌లు ఉండాలి. బస్సు తయారైన తేది నుంచి 15 సంవత్సరాలు మించకూడదు. పూర్తి స్థాయిలో బీమా, రవాణా పన్నులు చెల్లించి ఉండాలి.

ఢిల్లీ వెళ్లే ఓపిక కూడా చంద్రబాబుకు లేదు : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా సమస్యలపై ఢిల్లీకి వెళ్లే ఓపిక కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేదని వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. 'యోగా డే' పేరుతో నాటకాలు ఆడుతున్నారని చెప్పారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం సజ్జల మీడియాతో మాట్లాడారు. టిడిపి కూటమి పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, మామిడి రైతులు సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మొన్నీమధ్యే వెళ్లి వచ్చిన తర్వాతనే.. కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు పొగాకు రైతులను కలిశారని పేర్కొన్నారు. కానీ వారి సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. మరోవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని, కూటమి పాలనలో వీధుల్లోనే గంజాయి అమ్ముతున్నారని పేర్కొన్నారు. కుప్పంలో జరిగే అరాచకాలు చంద్రబాబుకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పోలీసుల వ్యవస్థను భ్రష్టు పట్టించారని, అమాయకులపై, వైసిపి శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

భార్యాభర్తల కలహాలతో కుమారుడు బలి

- బిడ్డతో సహా నదిలో దూకిన తల్లి
- ఆమెను రక్షించిన స్థానికులు
- భర్తతో తరచూ గొడవలతో మనస్తాపం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భార్యాభర్తల కలహాలకు అభం శుభం తెలియని బాలుడు బలయ్యాడు. భర్తతో గొడవపడిన భార్య తన కుమారుడితో సహా ఆత్మహత్యకు చేసిన ప్రయత్నంలో, ఆమె బతికి బట్టకట్టగలిగినా.. కుమారుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు శ్రీకాకుళం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని కుశాపురం పంచాయతీ యాతపేట చెందిన తుమ్మల యేసుబాబుకు, పెద్ద రెల్లివీధికి చెందిన మేనకోడలు విమలతో నాలుగున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండున్నరేళ్ల వరుణ్‌తేజ్ అనే కుమారుడు ఉన్నాడు. యేసుబాబు సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని కొనుగోలు చేసి నిర్వహిస్తూ... ఉపాధి పొందుతున్నాడు.

అయితే అతను నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా వారిద్దరు గొడవ పడ్డారు. దీంతో క్షణికావేశంలో శనివారం ఉదయం విమల తన కుమారుడితో సహా గుడివీధి సమీపంలో నాగావళి నదిలోకి దూకేసింది. ఆ పక్కనే పిండ ప్రదాన కార్యక్రమం చేస్తున్నవారు గమనించి విమలను రక్షించి బయటకు తీసుకొచ్చారు.

కానీ, ఆమె కుమారుడు మాత్రం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికుల సాయంతో నదిలో గాలించగా చివరికి విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఒకటో పట్టణ ఎస్ఐ రామారావు సంఘటన స్థలానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడి తల్లి విమల కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయిందని కుటుంబ సభ్యులు అంటున్నారు, చికిత్స కూడా తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికీ భర్తతో గొడవ పడుతుండేదని చెబుతున్నారు. మృతదేహాన్ని యాతపేటలో శనివారం సాయంత్రం అత్యక్రియలు నిర్వహించారు.

కోనసీమ రైలు.. సాగదీత పనులు..

- పిల్లర్లలోనే కోటిపల్లి- నర్సాపురం రైల్వే లైన్
- ట్రాక్‌ల నిర్మాణం ఉసేలేదు
- దిండిలో గోదావరిలోకి ఒరిగిన ఫిల్లర్

ప్రజాశక్తి-రాజోలు (కోనసీమ జిల్లా)

కోనసీమ ప్రజల చిరకాల స్వప్నమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. పదేళ్లుగా రైల్వేలైన్ నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అడుగు ముందుకు పడడంలేదు. జిల్లాలోని మూడు ప్రధానమైన గోదావరి నదీపాయలపై వారధులకు సంబంధించి పియర్స్ (పిల్లర్స్) నిర్మాణాలు పూర్తయినా గడ్డర్ల ఏర్పాటులో మాత్రం కొన్నేళ్లుగా కాంట్రాక్టు సంస్థ మౌనం వహిస్తోంది. కేంద్రంలో టిడిపి పార్లమెంటు విప్, అమలాపురం ఎంపీ హరీష్ మాదుర్ కోనసీమ ప్రజలకు రైల్వేలైన్ కూత వినిపించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆశించిన మేర స్పందన లేకపోవడంతో ఈ రైల్వేలైన్ నిర్మాణ పనులకు అడుగడుగునా అవరోధాలే ఏర్పడుతున్నాయి.

గడ్డర్లు నిర్మించేది ఎప్పుడు

మూడు నదీపాయలపై నిర్మించిన పిల్లర్లపై గడ్డర్లు నిర్మిస్తే రైల్వేట్రాక్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా గడ్డర్ల నిర్మాణ ప్రగతిపై స్పష్టమైన ప్రకటన అయితే వెలువడలేదు. కోటిపల్లి నుంచి శానపల్లిలంక వరకు గౌతమీ నదిపై వారధి పిల్లర్లు నియమించించారు. గడ్డర్లు వేయకపోవడంతో నదిలో నిర్మించిన 41 పిల్లర్లు మొండి గోడల్లా దర్శనమిస్తున్నాయి.

ఎలైన్మెంట్ మార్చినా

కోనసీమ ప్రాంతానికి ఎంతో కీలకమైన కోటిపల్లి-నరసాపురం లైన్కు కోనసీమ జిల్లాలో భూసేకరణ సవాలుగా మారింది. తొలుత 57 కి.మీ. మేర ఈ లైన్ నిర్మాణానికి 2011-12లో అనుమతిచ్చారు. ఇది కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల మీదుగా వెళు_ంది.ఇందులో పశ్చిమగోదావరి జిల్లాలోని 11.31 కిమీ.లకు అవసరమైన 46.11 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. అయితే కోనసీమ జిల్లాలో 18 గ్రామాల మీదుగా ఈ ప్రాజెక్టు వెళ్తుండగా, వాటిలో భూసేకరణలో జాప్యం జరగడంతో, ఎలైన్మెంట్ పరిధిలో కొత్తగా అనేక ఇళ్ల నిర్మాణం జరిగిపోయింది. దీనివల్ల ఎలైన్ మెంట్ను కొన్నిచోట్ల మార్పుచేశారు. దీంతో రైల్వే లైన్ పొడవు కూడా 59.48 కి.మీలకు పెరిగింది. కొత్త ఎలైన్మెంట్ ప్రకారం భూసే కరణ వద్దని కొందరు, పాతది కొనసాగించొద్దని మరికొందరు రైతులు అభ్యంతరాలు చెబుతున్నారు. ఇప్పటివరకు 13 గ్రామాల్లోనే జాయింట్ సర్వే పూర్తయ్యింది. ఇంకా భట్నవిల్లి, అమలాపురం గ్రామీణం, పేరూరు, ఇమ్మిడి వరపాడు, బోడసకర్రు గ్రామాలపరిధిలో సర్వే కూడా చేయలేకపోయారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా ..

కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం ప్రవేశపెట్టే రైల్వే బడ్జెట్‌లో ప్రతిఏటా రూ.వంద కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నారు. ఆ నిధులు ఇక్కడ నిర్మాణ పనులకు వెచ్చించకపోవడంతో బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతరప్రాంతాల రైల్వేపనులకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేసులు కొట్టేయండి

- జర్నలిస్ట్ కృష్ణంరాజు

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పి తనపై పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు, ఎన్‌టిఆర్ కమిషనరేట్, పటమట పోలీసులు నమోదు చేసిన కేసుల్ని కొట్టేయాలంటూ జర్నలిస్ట్ వివిఆర్ కృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కావాలని తనపై వేర్వేరు కేసులు నమోదు చేస్తున్నారని, నేరం చేసినట్లు ప్రాథమిక ఆధారాలు లేకపోయినా కేసులు పెడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేయలేదన్నారు. మహిళా సెక్స్ వర్కర్ల గణాంకాల ప్రస్తావన చేసే క్రమంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు, ఎవరినీ కించపర్చాలనే ఉద్దేశం తనకు లేదని వివరించారు.

ప్రాణాలైనా వదులుకుంటాం.. ఎయిర్‌పోర్టుకు భూములివ్వం..

భూ బాధిత రైతులు

ప్రజాశక్తి- శాంతిపురం (చిత్తూరు)

తమ ప్రాంతంలో ఎయిర్పోర్ట్ వద్దు అని, తమ భూములు తమకు ముద్దు అని కుప్పం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు పేర్కొన్నారు. ఎయిర్పోర్ట్ బాధిత రైతులు చిత్తూరు జిల్లా శాంతిపురం మండల కేంద్రంలోని బడుగుమాకులపల్లి వద్ద శనివారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిపురం మండలం అమ్మవారిపేట, సొన్నేగానిపల్లి, కొలమడుగు, దండికుప్పం రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులందరూ చిన్న సన్నకారుల రైతులేనన్నారు. ఇక్కడ అందరికీ ఒక ఎకరా రెండు ఎకరాలు లేదా ఐదు ఎకరాలు భూములు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ భూములను తరతరాలుగా వారసత్వంగా పొంది ఎంతో కష్టపడి అప్పులు చేసి భూములను వ్యవసాయానికి అనుగుణంగా మార్చుకున్నామన్నారు. ఈ ప్రాంతం మెట్ట భూమి కావడంతో అత్యధికంగా బోర్లు వేసి ఒకటో రెండో బోర్లలో వచ్చే నీటితో బంగారం లాంటి పంటలను పండిస్తున్నామన్నారు. సంవత్సరానికి మూడు పంటలు పండించే సారవంతమైన భూములను ప్రభుత్వం ఏర్పాటు పేరుతో బలవంతపు భూసేకరణ చేయడం చాలా దారుణమన్నారు. 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా భూములను లాక్కొని రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 2014లో 450 ఎకరాలను ఎయిర్ పోర్టు కొరకు భూసేకరణ చేసి ఇప్పటివరకు పునాది రాళ్లు కూడా వేయలేదన్నారు.

ఇక్కడ ఏర్పోర్ట్ వస్తే స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఎలాంటి ఉపయోగం ఉండని అన్నారు. ప్రభుత్వం చెప్పే విధంగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి గాని ఇంకో రకంగా ఏమైనా ఎగుమతులు చేయడానికి ఈ ప్రాంతంలో అలాంటి పారిశ్రామికవేత్తలు ఎవరూ లేరన్నారని, అదే ఎయిర్పోర్టుకు బదులు పరిశ్రమలు తీసుకొని వస్తే నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించిన వారవుతారన్నారు. తాము అభివద్ధికి ఎన్నడూ అడ్డు కాదని ప్రజాపయోగకరం ఏమైనా పరిశ్రమలు తీసుకుని వచ్చి అభివద్ధి పరిస్తే సంతోషిస్తామన్నారు. ఈ విషయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజుతో కలిసి విజయవాడలో శుక్రవారం సీసీఎల్ఏ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, ఆర్అండ్ ఆర్ కమిషనర్‌కు రైతుల సమస్యలను తెలియజేశామని తెలిపారు. రైతుల సమస్యల పట్ల వారు సానుకూలంగా స్పందించారని, చాలామంది రైతులను రెవెన్యూ అధికారులు భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తాము ప్రాణాలైనా వదులుకునేందుకు సిద్ధమని, అంతేకానీ ఎయిర్ పోర్టు కోసం భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు చక్రపాణిరెడ్డి, పెద్దన్న, జయప్ప గౌడు, సోమప్ప, సుబ్రహ్మణ్యం, జ్ఞానేంద్ర, మనీ, జీవరత్న, సత్యమ్మ, పద్మమ్మ, సులోచనమ్మ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ మూతపడితే కార్మికులు వీధిన పడతారు

- సిమెంట్ కంపెనీ కార్మికుల ఆందోళన కేసులో హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

అల్ట్రాటెక్ సిమెంట్స్ అనుబంధ కంపెనీ ది ఇండియన్ సిమెంట్ ఫ్యాక్టరీలో డిమాండ్ల పరిష్కారం పేరుతో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన చేస్తున్నారని ఇలాగే కొనసాగితే వారు వీధిన పడతారని హైకోర్టు వ్యాఖ్యానించింది. అలాగే ఫ్యాక్టరీ మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం సమస్య కొలిక్కి తెచ్చే ప్రయత్నాలు చేయడం లేదని తప్పుపట్టింది. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించింది. కంపెనీ మూతపడితే కార్మికులు నష్టపోతారని చెప్పింది. కంపెనీ రాష్ట్రానికి పన్నులు, జిఎస్‌టి చెల్లిస్తోందని గుర్తు చేసింది. ఫ్యాక్టరీలో మనుషులు, సరుకుల రాకపోకలకు సమస్యలు లేకుండా డిజిపి, కడప జిల్లా ఎస్‌పి, యరగ్రుంట్ల సిఐలకు ఉత్తర్వులు జారీ చేసింది. భద్రత కల్పించాలంది. సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు పరిస్థితిని సమీక్షించాలంది.

ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఆదేశాలు జారీ చేశారు. కడప జిల్లా, యరగ్రుంట్లలో ఇండియన్ సిమెంట్స్ కంపెనీ సిమెంట్ తయారీ యూనిట్‌ను 400 మంది కార్మికులతో నిర్వహిస్తోంది. గత ఏప్రిల్ 20న కొందరు కాంట్రాక్ట్ కార్మికులు పనులను నిలిపివేశారు. దీనిపై ఇండియన్ సిమెంట్స్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించడంతో పైవిధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫ్యాక్టరీ కార్యకలాపాల పున్నప్రారంభానికి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

బ్రెజిల్‌లో ఎయిర్ బెలూన్ ప్రమాదం

- 8 మంది మృతి, 13 మందికి తీవ్ర గాయాలు


బ్రెజిల్ : బ్రెజిల్‌లోని ప్రైయా గ్రాండే పట్టణంలో శనివారం జరిగిన ఎయిర్ బెలూన్ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 13మంది గాయపడ్డారు. 21మందితో ప్రయాణిస్తున్న ఈ బెలూన్ గాల్లో ఉండగానే మంటలు చెలరేగాయి. దీంతో, వేగంగా నేలను ఢీకొట్టింది. ఈ దృశ్యాలను స్థానికులు ఫోన్లలో వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. రాష్ట్ర గవర్నర్ జోర్గిన్హో మెల్లో మీడియాతో మాట్లాడుతూ ప్రైయా గ్రాండే పట్టణం ప్రముఖ పర్యాటక ప్రాంతమని, ఎయిర్ బెలూన్ రైడ్స్‌కు ప్రసిద్ధమైన ప్రాంతంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. క్షతగాత్రులను హాస్పిటల్‌కి తరలించామని, బాధితులను ఆదుకుంటామని తెలిపారు. కొన్ని రోజుల క్రితమే సావో పాలో రాష్ట్రంలో ఈ తరహా ప్రమాదంలో ఒకరు మృతిచెందడం గమనార్హం.

ఇరాన్‌లో కంపించిన భూమి

టెహరాన్ : ఉత్తర ఇరాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత 5.1గా నమోదైందని అమెరికా జియోలాజికల్ సర్వీసెస్ (యుఎస్‌జిఎస్) తెలిపింది. సెమ్నాన్ నగరానికి వాయవ్యంగా భూమిలో 10కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం వున్నట్లు గుర్తించారు.

రానున్నది కష్టకాలమే!

- విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి
- పెరుగుతున్న ముడి చమురు ధరలు
- పడిపోతున్న రూపాయి విలువ



న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత విదేశీ మారక నిల్వలు తీవ్ర ఒత్తిడికి ఎదుర్కొంటున్నాయి. ఓ వైపు బ్రెంట్ ముడి చమురు (ఉత్తర సముద్రం నుంచి తీసిన ఓ రకమైన ముడి చమురు. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలకు ఇది ఓ బెంచ్‌మార్క్‌గా ఉపయోగపడుతోంది) ధరలు పెరిగిపోతుంటే మరోవైపు రూపాయి విలువ తగ్గుతోంది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఘర్షణల కారణంగా మన బ్రెంట్ ముడి చమురు దిగుమతులు గత కొన్ని వారాలుగా బాగా పెరుగుతున్నాయి. ప్రపంచ ముడి చమురులో సుమారు 20 శాతం హార్ముజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. ఇప్పుడు మధ్యప్రాచ్యంలో అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ జరుపుతున్న దుర్మార్గపు దాడులతో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా హార్ముజ్ ద్వారా జరుగుతున్న చమురు రవాణాకు ఆటంకం కలుగుతోంది. దీంతో ప్రపంచ చమురు మార్కెట్లలో ధరలు పెరిగిపోతున్నాయని అంటున్నారు.

దిగుమతుల బిల్లుపై ప్రభావం

అప్పుడప్పుడు జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు చమురు ధరలను కొంతమేర తగ్గిస్తున్నప్పటికీ బ్రెంట్ ముడి చమురు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. మన ముడి చమురు అవసరాలు 85 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. దీంతో అంతర్జాతీయంగా ఏర్పడే అస్థిర పరిస్థితుల ప్రభావం భారత్‌పై అనివార్యంగానే పడుతోంది. రూపాయి విలువ తగ్గిపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ నెల 2-19 తేదీల మధ్య డాలరుతో పోలిస్తే రూపాయి విలువ రూ.85.35 నుండి రూ.86.86కు... అంటే 1.75 శాతం పడిపోయింది. ఈ తగ్గుదల తక్కువగానే కన్పిస్తున్నప్పటికీ డాలర్ - చమురు ధరను బట్టి చూస్తే ప్రభావం ఎక్కువగానే ఉంది. ముడి చమురు ధరలు, రూపాయి విలువ అననుకూల దిశగా కదులుతున్నప్పుడు దిగుమతి బిల్లుపై అధిక ప్రభావం పడుతుంది. రూపాయి విలువలో తగ్గుదల ఒక రూపాయి ఉంటే చమురు దిగుమతుల భారం రూ.8,000-10,000 కోట్ల మధ్య ఉంటుందని ఓ అంచనా.

రంగంలోకి ఆర్‌బిఐ

అనిశ్చిత పరిస్థితులు ప్రపంచ ముడి చమురు మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో బ్యారల్ ముడి చమురు ధర 65 డాలర్లు ఉండగా గత వారం 73-76 డాలర్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యారల్ సగటు ముడి చమురు ధర 78 డాలర్లుగా ఉంది. దాని కంటే ప్రస్తుత ధర తక్కువే అయినప్పటికీ ఇంధన సరఫరాలో నెలకొన్న అంతరాయాల కారణంగా రాబోయే కాలంలో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. చాలా కాలం పాటు ముడి చమురు ధరలు పెరుగుతూనే ఉంటాయని, అవి భారతీయ కంపెనీల లాభాలపై ప్రభావం చూపుతాయని క్రిసిల్ తెలిపింది. రవాణా ఖర్చులు, బీమా ప్రీమియం కూడా పెరగవచ్చునని హెచ్చరించింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తున్న రిజర్వ్‌బ్యాంక్ ఆచితూచి వ్యవహరిస్తోంది. రూపాయి విలువలో అస్థిరతను నివారించడానికి డాలర్ల పరిమిత అమ్మకాల ద్వారా కరెన్సీ మార్కెట్లలో జోక్యం చేసుకుంటోంది. బాండ్ల కొనుగోలు చేసిన వ్యక్తులు పొందే మొత్తం (రిటర్న్)లో పెరుగుదల కన్పిస్తోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణ భయాలకు ఇది అద్దం పడుతోంది. ప్రభుత్వ రుణాలు కూడా పెరిగే అవకాశం ఉంది.

ఏం జరుగుతుంది?

పెరిగిన ముడి చమురు ధరలు, పడిపోతున్న రూపాయి విలువ... కరెంట్ ఖాతా లోటు పెంచుతాయి. ఖర్చులు పెరిగి ఆర్థిక సమతుల్యత దెబ్బతింటోంది. ఈ ఒత్తిడులు దీర్ఘకాలం కొనసాగితే ద్రవ్య, ఆర్థిక విధాన ఎంపికలు మరింత సంక్లిష్టమవుతాయి. పశ్చిమాసియాలో నెలకొన్న వివాదంతో అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. దౌత్య యత్నాలు ఫలిస్తే ఇంధన మార్కెట్లలో ఉద్రిక్తత తగ్గుతుంది. రూపాయిని స్థిరీకరించే అవకాశం ఏర్పడుతుంది. మధ్య ప్రాచ్యంలో వివాదం కొనసాగితే ఈ సంవత్సరం ద్వితీయార్థంలో మన దేశం చాలా అల్లకల్లోలమైన విదేశీ మారక ద్రవ్య పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావచ్చునని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

నినాదాలలోనే మోడీ ప్రావీణ్యం

- రాహుల్‌గాంధీ విమర్శ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ పని తీరు మాటలు ఘనం.. చేతలు శూన్యం అన్న చందంగా ఉందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని నినాదాలివ్వడంలో ప్రావీణ్యం సంపాదించారు.. కానీ సమస్యలను పరిష్కరించడంలో కాదని విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నరేంద్ర మోడీ ఘనంగా 'మేక్ ఇన్ ఇండియా' నినాదమిచ్చారు. కానీ తయారీ రంగంలో భారత్ రికార్డు స్థాయిలో పడిపోయింది. 2014 నుంచి తయారీ రంగం 14 శాతానికి పడిపోయింది. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన తయారీ రంగమే తీవ్ర క్షీణతకు గురైతే.. మేక్ ఇన్ ఇండియా ఎలా సాధ్యం' అని ఎక్స్ పోస్టులో మోడీని ఆయన ప్రశ్నించారు. యువతలో నిరుద్యోగం పెరిగింది. చైనా నుంచి దిగుమతులు చేసుకోవడం రెండింతలు పెరిగిందని రాహుల్ ఎద్దేవాచేశారు. 'స్మార్ట్‌ఫోన్లలో ప్రతిభావంతులైన యువకులు శివం, సైఫ్‌లను కలిశాను. మాట్లాడిన తర్వాత వారు తమ కలల్ని నెరవేర్చుకోలేకపోతున్నారని నాకు అర్థమైంది. దీన్నిబట్టి చూస్తే.. భారత దేశ యువత ఎన్ని సవాళ్లను ఎదుర్కొంటుందో స్పష్టమైందని' రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'అభివృద్ధి చెందాలని చెబుతూ సమావేశమవుతున్నాము కానీ... కానీ సొంతంగా తయారు చేసేందుకు నిరాకరిస్తున్నామని' విమర్శించారు. ప్రధానమంత్రి మోడీకి కొత్త ఆలోచనలు లేవని, భారతదేశ పరిశ్రమను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించడం మానేశారని అన్నారు. ముఖ్యమైన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పిఎల్‌ఐ) పథకాన్ని కూడా మోడీ నిలిపివేశారని విమర్శించారు. నిజాయితీలకు సంస్కరణలతో పాటు భారతీయ ఉత్పత్తిదారులకు ఆర్థిక సహాయమందించాలని, ఇతర దేశాలకు మార్కెట్‌గా ఉండడం మానేసి భారత్ సొంతంగా పరిశ్రమల్ని నిర్మించాలని, తయారీ రంగాన్ని అభివృద్ధి చేయాలని రాహుల్ కోరారు.

ముంబయి పోర్ట్ డ్రెడ్జింగ్ పనుల్లో అవినీతి

- టాటా గ్రూప్ కంపెనీపై సిబిఐ కేసు
- మరి కొందరు వ్యక్తులు, సంస్థలపై కూడా...
- రూ.800 కోట్ల అవినీతి జరిగిందని నిర్ధారణ

న్యూఢిల్లీ : ముంబయిలోని జవహల్‌లాల్ నెహ్రూ పోర్టుకు సంబంధించిన క్యాపిటల్ డ్రెడ్జింగ్ (తవ్వకాలు) ప్రాజెక్టులో రూ.800 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (టిసిఇ) కంపెనీపై సిబిఐ కేసు నమోదు చేసింది. దీనితో పాటు జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జెఎన్‌పిఎ) మాజీ చీఫ్ మేనేజర్ సునీల్ కుమార్ సహా పలువురు వ్యక్తులు, సంస్థలపై కూడా కేసు పెట్టింది. ఓడరేవులో డ్రెడ్జింగ్ పనులు చేపట్టినప్పుడు టిసిఇ కంపెనీ ముంబయి ఓడరేవు అధికారులతో కుమ్మక్కై కుట్ర పన్నిందని, కొన్ని ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించిందని సిబిఐ ఆరోపించింది.

ముంబయి పోర్టులో రెండు దశలుగా డ్రెడ్జింగ్ పనులు నిర్వహించారు. మొదటి దశను 2010-2014, రెండో దశను 2012-2019లో పూర్తి చేశారు. డ్రెడ్జింగ్ పనులలో అవినీతిపై మూడు సంవత్సరాల పాటు ప్రాథమిక విచారణ జరిపిన సిబిఐ .. ప్రాజెక్ట్ వ్యయ అంచనాలను భారీగా పెంచారని, అంతర్జాతీయ బిడ్డర్లకు అనుకూలంగా వ్యవహరించారని, కాంట్రాక్టర్లకు అవాంఛిత ప్రయోజనాలు చేకూర్చారని, స్వతంత్ర నిపుణుల నివేదికను తొక్కి పెట్టారని గుర్తించింది. జెఎన్‌పిఎ మాజీ చీఫ్ ఇంజినీర్ సునీల్ కుమార్, టీసీఈ మాజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవ్‌దత్ బోస్, గ్లోబల్ మారీటైమ్ ఇంజినీరింగ్ కంపెనీ బాస్కలిస్ స్మిత్ ఇండియా ఎల్‌ఎల్‌పీ, జన్ దే నల్ డ్రెడ్జింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు కొందరు ప్రభుత్వోద్యోగులపై ఐపీసీలోని 120-బీ (క్రిమినల్ కుట్ర), 420 (మోసం) సెక్షన్ల సహా అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల కింద కేసులు నమోదు చేసింది.


సిబిఐ అధికారులు బుధవారం ముంబయి, చెన్నైలోని ఐదు ప్రాంతాలలో సోదాలు నిర్వహించారు. క్యాపిటల్ డ్రెడ్జింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలు, ప్రభుత్వోద్యోగుల పెట్టుబడుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. జేఎన్‌పీటీ, టీసీఈ ఎగ్జిక్యూటివ్స్‌తో పాటు ప్రైవేటు వ్యక్తులు కుట్రకు పాల్పడడంతో డ్రెడ్జింగ్ మొదటి దశకు రూ.365.90 కోట్లు, రెండో దశకు రూ.438 కోట్ల నష్టం వాటిల్లిందని సీబీఐ విచారణ నిర్ధారించింది. డ్రెడ్జింగ్ పనులకు సంబంధించిన ధరలను నిర్ణయించడంలో నిబంధనలను ఉల్లంఘించారని కూడా తేల్చింది. ప్రాజెక్టును పూర్తి చేయడంలో జాప్యం జరిగిందని, కాంట్రాక్టర్లు రూ.348 కోట్ల మేర తప్పుడు బిల్లులు సమర్పించారని, రూ.430 కోట్ల అదనపు చెల్లింపులు జరిగాయని, తక్కువ కచ్చితత్వం కలిగిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి డ్రెడ్జింగ్‌కు ముందు జరిపిన సర్వేలను తారుమారు చేశారని కూడా సిబిఐ తెలిపింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీలు ఇంకా వాటిపై స్పందించలేదు.

గాజా, ఇరాన్ అంశంపై కేంద్రం మౌనం వీడాలి : సోనియా

న్యూఢిల్లీ : ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా, చట్టవిరుద్ధంగా ఇజ్రాయిల్ దాడి చేసిందని, ఈ దాడుల వల్ల ఏకపక్ష సైనికవాదం ప్రమాదకరమైన పరిణామాలను ప్రపంచం మరోసారి చూసిందని కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ విమర్శించారు. 'ద హిందూ' ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో ఇజ్రాయిల్ - ఇరాన్ గడ్డపై జరిపిన బాంబు దాడులను భారత జాతీయ కాంగ్రెస్ ఖండించినట్లు పేర్కొన్నారు. ఈ దాడులు ప్రాంతీయంగానూ, ప్రపంచస్థాయిలోనూ పొంచి ఉన్న ముప్పు తీవ్రతను సూచిస్తాయని తెలిపారు. గాజా మాదిరిగానే ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి చేయడం వల్ల ఇరాన్ ప్రాంతీయ స్థిరత్వంపైనా, పౌర జీవితాలపై ఆ ప్రభావం పడిందని, ఈ చర్యలు అస్థిరతను మరింత తీవ్రతరం చేస్తాయని పేర్కొన్నారు. సంఘర్షణలకు దారితీస్తాయని, ఇరాన్, అమెరికాల మధ్య దౌత్యసంబంధాలు ఆశాజనకంగా ఉన్న సమయంలోనే ఇరాన్‌పై ఇటువంటి దాడి జరగడం మరింత బాధాకరమని తెలిపారు. మానవతా విపత్తు ఎదుర్కొంటున్నప్పుడు భారత్ మౌనం వహించడం దౌత్యపరమైన లోపాన్ని ఎత్తిచూపుతున్నదని సోనియా వ్యాసంలో పేర్కొన్నారు. గతంలో ఇరాక్ యుద్ధానికి దారితీసిన తప్పులను మరోసారి అమెరికా అధ్యక్షుడు పునరావృతం చేస్తున్నట్లు కనిపిస్తోందని సోనియా పేర్కొన్నారు. సార్వభౌమ స్వతంత్ర పాలస్తీనాను, ఇజ్రాయిల్ పరస్పర భద్రతను కల్పించడం అనే భారత్ దీర్ఘకాలిక దౌత్యపరమైన నిబద్ధతను మోడీ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. గాజాలోనూ, ఇప్పుడు ఇరాన్‌పై జరుగుతున్న విధ్వంసంపై భారత్ మౌనం వహించడం మన నైతిక, దౌత్య సంప్రదాయాల నుంచి తప్పించుకోవడమే అని ఆమె అన్నారు. ఇరాన్ భారతదేశానికి దీర్ఘకాల మిత్రదేశం. జమ్మూ కశ్మీర్‌తో సహా కీలక సమయాల్లో భారత్‌కు ఇరాన్ మద్దతు ఉన్నదన్నారు. 1994లో కాశ్మీర్ సమస్యపై యూఎన్ కమిషన్ ఆన్ హ్యూమన్ రైట్స్‌లో భారతదేశాన్ని విమర్శించే తీర్మానాన్ని నిరోధించడంలో ఇరాన్ సహాయపడిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తన దౌత్య పాత్రను భారత్ పునరుద్ఘాటించాలని కోరారు. ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో భారత్ కల్పించుకోకపోవడం విలువల లొంగుబాటునే సూచిస్తుందని ఆమె విమర్శించారు. ఈ విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను అనుసరించాలని ఆమె సూచించారు.

ఇరాన్ నుండి 827మంది భారతీయులను తీసుకొచ్చాం

- విదేశాంగ శాఖ వెల్లడి


ఇరాన్ నుండి న్యూఢిల్లీ విమానాశ్రాయానికి చేరిన విద్యార్థులు

న్యూఢిల్లీ : ఇరాన్ నుండి భారతీయులను తీసుకుని రావడానికి కేంద్రం శనివారం కూడా రెండు విమానాలను నడిపింది. మషాహద్ నుండి వచ్చిన మొదటి విమానం శనివారం సాయంత్రం 4.30గంటలకు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోగా, రెండవ విమానం రాత్రి 11.30 గంటలకు చేరుకోనుంది. కొలంబో, ఖాట్మండుల నుండి వచ్చిన అభ్యర్థనల మేరకు శ్రీలంక, నేపాల్ జాతీయులను కూడా భారత ప్రభుత్వం తమ విమానాల్లో తరలిస్తోందని టెహరాన్‌లోని భారత ఎంబసీ ప్రకటించింది. ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ పౌరులను తీసుకువచ్చిన భారత ప్రభుత్వానికి నేపాల్ విదేశాంగమంత్రి అర్జూ దేబా కృతజ్ఞతలు తెలిపారు. భారతీయులను తీసుకెళ్లే విమానానికి తమ గగనతల ఆంక్షలను సడలిస్తామని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మషాహద్ నుండి ప్రత్యేక విమానాలు నడిపారు. శుక్రవారం వరకు ఆపరేషన్ సింధు కింద మొత్తంగా 517మంది భారతీయులను ఇరాన్ నుండి తరలించినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. మషాహద్ నుండి వచ్చిన విమానంతో ఈ సంఖ్య 827కి పెరిగిందన్నారు. అంతకుముందు తుర్కెమినిస్తాన్, అర్మేనియా, కతార్‌ల నుండి విమానాలు నడిపి ఇరాన్ నుండి వచ్చిన భారతీయులను స్వదేశానికి చేర్చారు. తుర్కెమినిస్తాన్‌లోని అస్గబాట్ నుండి వచ్చిన ప్రత్యేక విమానం శనివారం తెల్లవారు జామున 3గంటలకు న్యూఢిల్లీ చేరుకుంది.

క్షిపణి, అణు కేంద్రాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

- ఇరాన్ టాప్ కమాండర్ మృతి
- టెల్ అవీవ్‌సహా పలు నగరాలపై ఇరాన్ ప్రతి దాడులు


ఇజ్రాయిల్ దాడులను ఆపాలని కోరుతూ టెహరాన్‌లో ఆందోళన చేస్తున్న ఇరాన్ వాసులు

టెల్ అవీవ్, టెహరాన్ : వరుసగా తొమ్మిదో రోజైన శనివారం కూడా ఇజ్రాయిల్, ఇరాన్‌ల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్‌లోని క్షిపణి కేంద్రాలు, ఇస్ఫాహన్ అణు కేంద్రంపై ఇజ్రాయిల్ శనివారం తాజాగా దాడులు జరిపింది. విదేశాల్లో మిలటరీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న సీనియర్ కమాండర్‌ను హతమార్చినట్లు ప్రకటించింది. ఆ కమాండర్‌ను మహ్మద్ సయీద్ ఇజాదిగా గుర్తించామని ఇజ్రాయిల్ రక్షణ శాఖ ప్రకటించింది. హమాస్ వంటి గ్రూపులతో ఇరాన్ సంబంధాలను పర్యవేక్షించే ఇజాది, ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ వర్గాలకు దీర్ఘకాలంగా లక్ష్యంగా వున్నారు. అక్టోబరు 7 దాడుల గురించి ముందుగా తెలిసిన అతికొద్ది మందిలో ఇజాది కూడా ఒకరు. సెంట్రల్ ఇరాన్‌లో ఇజాది నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌పై శనివారం తెల్లవారు జామున దాడిచేసి, హత్య చేసినట్లు ఇజ్రాయిల్ తెలిపింది. వాయవ్య ఇరాన్‌లోని మిలటరీ సదుపాయాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు కొనసాగిస్తున్నాయని మిలటరీ ప్రకటించింది. శనివారం ఇరాన్ ప్రయోగించిన దాదాపు 40 డ్రోన్లను కూల్చివేసినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. దాదాపు మూడు రోజులుగా ఇరాన్‌వ్యాప్తంగా ఇంటర్‌నెట్ దాదాపుగా స్తంభించిపోయింది. శనివారం ఉదయానికి పాక్షికంగా సేవలు పునరుద్ధరిస్తున్నట్లు ఇంటర్‌నెట్ పర్యవేక్షక గ్రూపు పేర్కొంది.

శనివారం నాటి దాడుల్లో ఆక్రమిత పాలస్తీనా భూభాగాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాదాపు 10 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని, పలు ఇజ్రాయిల్ నగరాలను డజన్ల సంఖ్యలో 'విధ్వంసకర' డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ మీడియా వెల్లడించింది. అనేక డ్రోన్లు తమ లక్ష్యాలను విజయవంతంగా ఛేదించాయని సమాచారం వచ్చినట్లు ఇర్నా తెలిపింది. టెల్ అవీవ్‌లో శనివారం తెల్లవారు జామున పలు చోట్ల పేలుళ్లు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. నగరమంతా పెద్ద పెద్ద శబ్దాలు చాలాసార్లు వినిపించాయని ప్రజలు తెలిపారు. శుక్రవారం పొద్దుపోయిన తర్వాత కొన్ని క్షిపణులు ఇజ్రాయిల్ వైమానిక రక్షణ వ్యవస్థలను ఛేదించుకుని మరీ చొచ్చుకుపోయినట్లు తెలుస్తోంది.

400మందికి పైగా మృతి : ఇరాన్ ప్రకటన

ఇజ్రాయిల్ ఈనెల 13న దాడులు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు 400మందికిపైగా మరణించారని, వీరిలో 54మంది మహిళలు, పిల్లలు వున్నారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 3,056 మంది గాయపడ్డారని తెలిపింది. మృతుల్లో ఎక్కువమంది సామాన్య పౌరులేనని ఆరోగ్య శాఖ ప్రతినిధి తెలిపారు. వాయవ్య ఇరాన్‌లో జరిగిన దాడిలో నలుగురు రివల్యూషనరీ గార్డులు మరణించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది.

అణు చర్చలకు విఘాతం కలిగించడమే ఇజ్రాయిల్ ఉద్దేశం : టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్

అమెరికాతో అణు చర్చలకు విఘాతం కలిగించాలన్నదే ఇజ్రాయిల్ ఉద్దేశ్యంగా వున్నట్లు కనిపిస్తోందని టర్కీ అధ్యక్షుడు ఎర్డొగన్ విమర్శించారు. పశ్చిమాసియాను మొత్తంగా వినాశనం వైపునకు ఇజ్రాయిల్ లాక్కువెళుతోందని వ్యాఖ్యానించారు. దౌత్యానికి అవకాశం కల్పించేందుకు రెండు వారాల వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని భావించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ తన దాడులను తక్షణమే నిలిపివేస్తే ఇరాన్ దౌత్య పంథాను పరిశీలిస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు అమెరికా చేతులు కలిపితే ప్రతి ఒక్కరికీ ప్రమాదమేనని ఆయన హెచ్చరించారు. యురోపియన్ మంత్రులు, ఇరాన్ మధ్య అణు చర్చలను వేగిరపరిచేందుకు చర్యలు తీసుకోవాలని తాను, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ ఒక అంగీకారానికి వచ్చినట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ తెలిపారు.

భద్రతా మండలికి ఫిర్యాదు

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదంటూ ఇరాన్ రాయబారి, ఐక్యరాజ్య సమితిలో ప్రత్యేక ప్రతినిధి అమిర్ సయీద్ ఇర్వాని యుఎన్ ప్రధాన కార్యదర్శికి, భద్రతామండలి అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. ఉద్రిక్తతలు పెచ్చరిల్లిన సమయంలో ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ గ్రాసి చేస్తున్న ప్రకటనలు, వ్యాఖ్యలు చట్టబద్ధంగా లేవని ఖండించారు.

దాడులు చేస్తామంటూ హౌతీల హెచ్చరిక

ఇరాన్‌పై దాడుల్లో అమెరికా చేతులు కలిపితే ఎర్ర సముద్రంలోని అమెరికా నౌకలపై దాడులు చేస్తామని హౌతీలు హెచ్చరించారు. ఈమేరకు యెమెన్‌కి చెందిన హౌతీ గ్రూపు ప్రతినిధి శనివారం ఒక ప్రకటన చేశారు. మే నెలలోనే అమెరికా, హౌతీల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఒకరిని ఒకరు లక్ష్యంగా చేసుకోరాదని నిర్ణయించారు.

ఇజ్రాయిల్ దాడులను ఖండించిన షాంఘై సహకార సంస్థ, అరబ్‌లీగ్

టెహరాన్ : ఇరాన్‌పై ఇజ్రాయిల్ పాల్పడుతున్న దాడులను షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) తీవ్రంగా ఖండించింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాల పట్ల తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసింది. నివాసప్రాంతాలు, పౌరులను లక్ష్యంగా చేసుకోవడమే కాకుండా అణు శక్తి కేంద్రాలపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది.

ఇజ్రాయిల్ తక్షణమే దాడులు ఆపాలి : అరబ్ లీగ్

ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను అరబ్ దేశాల విదేశాంగ మంత్రులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఈ మిలటరీ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ఘర్షణలు ఇలాగే కొనసాగితే ప్రాంతీయ సుస్థిరతకు తీవ్ర పర్యవసానాలు ఎదురవుతాయని హెచ్చరించారు. శనివారం ఇస్లామిక్ దేశాల సహకార మండలి (ఓఐసి) 51వ సమావేశాలకు ముందుగా ఇస్తాంబుల్‌లో అరబ్ మంత్రులు, పెచ్చరిల్లుతున్న ఈ ఉద్రిక్తతలను చల్లార్చేందుకు అత్యవసరంగా సమావేశమయ్యారు. ఐక్యరాజ్య సమితి సభ్య దేశ సార్వభౌమాధికారాన్ని దారుణంగా ఉల్లంఘించి ఇజ్రాయిల్ దాడులకు పాల్పడిందని అరబ్ లీగ్ విమర్శించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన చేసింది. అత్యవసరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి అరబ్ మంత్రులు విజ్ఞప్తి చేశారు. గాజాలో కూడా సైనిక దురాక్రమణను తక్షణమే ఆపాలని కోరారు. ఇజ్రాయిల్ వైఖరితో విస్తృతమైన ప్రాంతీయ యుద్ధంగా మారే ప్రమాదముందన్నారు. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలను పునరుద్ధరించాలని కోరారు. అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని గుర్తించాల్సిన అవసరం వుందని ఆ ప్రకటన స్పష్టం చేసింది.

ఓటర్ల గోప్యతకు భంగం'

- 'మహా' పోలింగ్ సిసి ఫుటేజీలివ్వాలన్న డిమాండ్‌పై ఇసి

న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సిసి టివి ఫుటేజీలు బహిర్గతం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. అలా చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ చర్య ఓటర్ల గోపత్యకు భంగం కలిగించడమే అవుతుందని వ్యాఖ్యానించింది.

గతేడాది మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన సంగతి తెలిసిందే. పోలింగ్ సమయంలో అక్రమాలు జరిగాయని.. కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పోలింగ్‌కు సంబంధించి 45 రోజుల సిసి టివి ఫుటేజీను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశాయి. "2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్రతో సహ అన్ని రాష్ట్రాల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏకీకృత, డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలి. అంతేకాకుండా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి సిసి టివి ఫుటేజీని కూడా ఈసీ బహిర్గతం చేయాలి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఇసి "ఒక సమూహం లేదా ఓటర్‌ను సులభంగా గుర్తించేందుకు వీలుగా సిసి టీవీ ఫుటేజీ ఉపయోగపడుతుంది. దీన్ని బహిర్గతం చేయడం ద్వారా ఓటు వేసిన వారు, వేయని వారు సామాజిక వ్యతిరేక శక్తుల నుంచి ఒత్తిడికి గురవుతారు. ఓటర్లను బెదిరించే అవకాశం లేకపోలేదు. కాబట్టి, ఈ ఫుటేజీని బహిర్గతం చేయడం నిబంధనలకు వ్యతిరేకం. అలా చేస్తే చట్టపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ వీడియోలు అంతర్గత పర్యవేక్షణ కోసం మాత్రమే. ఎన్నికల కేసులో ఏదైనా కోర్టు కోరితే మాత్రమే ఆ న్యాయస్థానానికి ఈ వివరాలు చేరుతాయి" అని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

యోగాను ప్రపంచం గుర్తించింది

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా యోగా వినియోగంతో 'ఎవిడెన్స్ బేస్డ్ థెరపీ'ని అమలు చేయాలని అన్ని ప్రధాన వైద్య సంస్థలను కోరినట్లు చెప్పారు. ఈ దిశలో ఎయిమ్స్ ఇప్పటికే చేసిన పరిశోధనల్లో కార్డియాక్, న్యూరలాజికల్ సమస్యల పరిష్కారంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తేలిందని తెలిపారు. యోగా సర్టిఫికెట్లకు ఉద్యోగావకాశాల్లో పర్సంటేజీని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఉదయం 6.26 నిమిషాలకు ప్రధాని మోడీ సభా వేదికపైకి విచ్చేశారు. 15 నిమిషాలకు పైగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఒలింపిక్స్, ఆసియా, కామన్‌వెల్త్ క్రీడల్లోనూ యోగాను చేర్చేలా చొరవ చూపాలని ప్రధానిని కోరారు. మోడీ వల్లే యోగాకు అంతర్జాతీయ ఖ్యాతి లభించిందన్నారు. కుల మతాలు, ప్రాంతాలు, దేశాలు, భాషా భేదాలకతీతమైన రీతిలో ఆమోదం పొంది ఒక ఉద్యమంగా యోగా మారిందన్నారు. రోజూ ఒక గంట సమయం యోగా కోసం కేటాయించాలన్నారు. డిజిటల్ ప్రపంచంలో క్రమశిక్షణ, సృజనాత్మకతలను పెంచేందుకు వ్యాయామం ఉపయోగపడుతుందన్నారు. యోగాతోనే సంతోషకరమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. అందుకే 'ఒన్ ఎర్త్ ఒన్ హెల్త్' నినాదం తీసుకుని 2047 నాటికి హెల్దీ, వెల్దీ ఆంధ్రప్రదేశ్‌గా విజన్ - స్వర్ణాంధ్ర ప్రణాళిక తయారు చేశామన్నారు..మోడీ, చంద్రబాబుల వల్లే యోగాలో ప్రపంచ రికార్డు సాధ్యమైందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. యోగా గురించి రుగ్వేదంలో పేర్కొంటే దాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చి ప్రపంచానికి తెలిసేలా చేసినవారు వీరిద్దరేనన్నారు. కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ యోగా విశిష్టతను తెలియజేశారు. యోగా డే వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేష్, ఎంపి పురంధరేశ్వరి, శ్రీభరత్ ఉన్నారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్‌కుమార్, గణబాబు, విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలకూ గిన్నిస్

25 వేల మంది గిరిజన విద్యార్థులు శుక్రవారం సాయంత్రం సూర్య నమస్కారాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని కూడా గిన్నిస్ బుక్ గుర్తించింది. రికార్డుల్లో నమోదు చేసింది. ఆ మేరకు ధ్రువపత్రాలను శనివారం అందచేసింది.

రూ.1100కు పింఛను పెంపు

- బీహార్ సిఎం ఎన్నికల వరాలు

పాట్నా : త్వరలో బీహర్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీలిస్తున్నారు. తాజాగా పింఛన్ల పెంపుపై శనివారం ఎక్స్‌లో ఒక ప్రకటన చేశారు. ఇప్పటివరకు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే పెన్షన్ రూ.400 నుంచి రూ.1,100కు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. జులై నుంచి పెన్షన్ పెంపు అమల్లోకి రానుందని, ప్రతి నెలా 10వ తేదీనాటికి పెన్షన్ అందేలా చూస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.09 కోట్ల మంది పెన్షన్‌దారులు లబ్ధిపొందనున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోడీ శుక్రవారం బీహార్‌లో పర్యటించగా, శనివారమే పెన్షన్ పెంపుపై సిఎం కీలక ప్రకటన చేయడం గమనార్హం.

పనామాలో కార్మికుల 50 రోజుల జాతీయ సమ్మె

- ప్రభుత్వ నిర్బంధాన్ని లెక్క చేయని కార్మికులు
- సమ్మెకు ప్రజానీకం సంపూర్ణ మద్దతు


పనామాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పనామా : పనామాలో తమ హక్కుల కోసం కార్మికులు సమ్మెబాట పట్టారు. సమ్మె శనివారం నాటికి 50వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అపరేషన్ ఒమేగా పేరుతో అణచివేతకు దిగినా కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యవసాయ కార్మికులు, వైద్యులు, ఆదివాసీ ప్రజలు సమ్మెకు మద్దతుగా పాల్గొంటున్నారు. ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరుపుతుండటంతోపాటు నిర్బంధాన్ని కొనసాగిస్తోంది.

సమ్మె ఎందుకు?

పనామా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సంస్కరణలను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీటివల్ల రిటైర్డ్ బెనిఫిట్స్ నష్టపోతామని, ప్రైవేటీకరణ వల్ల భద్రత లేకుండా పోతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాతో భద్రతా ఒప్పందంలో భాగంగా నాలుగు సైనిక స్థావరాలకు అనుమతించే ప్రతిపాదనను కార్మికులతోపాటు సామాన్య ప్రజలూ వ్యతిరేకిస్తున్నారు. అమెరికా పనామా కాలువపై కన్నేసిందని, స్వాధీనానికి ప్రయత్నిస్తుందని కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అరటి తోటల కార్మికుల డిమాండ్స్‌లో కొన్నింటిని ప్రభుత్వం అంగీకరించింది. తొలగించిన కార్మికులను తిరిగి తీసుకుంటామని, సబ్సిడీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా అరటి కార్మికుల యూనియన్ నాయకుడు ఫ్రాన్సిస్కో స్మిత్ మాట్లాడుతూ మిగతా డిమాండ్లను సాధించుకునేందుకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

ప్రభుత్వ నిర్బంధం

ములినో ప్రభుత్వం ఒక వైపు చర్చలు జరుపుతూ మరోవైపు కార్మికులపై నిర్బంధాన్ని కొనసాగిస్తోంది. నిరసనలను అణచివేసేందుకు 1300 మంది భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. బొకాస్ డెల్ టోరోలో నిరసన తెలుపుతున్న కార్మికులను 50 మందిని అరెస్ట్ చేసి, 14 మందిని జైలుకు పంపింది. కార్మిక నాయకుడు ఫ్రాన్సిస్కో స్మిత్‌ని జూన్ 14న పనామాలో అరెస్ట్ చేసింది. విద్యార్థి నాయకుడు ఎడ్వర్డో గార్సియాను ఈ నెల 18న అరెస్ట్ చేసి, యూనివర్శిటీ నుంచి ఐదేళ్లపాటు బహిష్కరించింది. ములినో ప్రభుత్వం ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా, సంస్కరణలను రద్దు చేసేవరకూ తమ పోరాటం కొనసాగుతుందని ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఫెర్నాండో ఆబ్రెగో స్పష్టం చేశారు.



జీవన సౌరభం

విజయం కోసం ప్రయత్నించడమే జీవితం కాకూడదు. విలువల కోసం జీవించడమే జీవిత లక్ష్యం కావాలి.

మీకోసం

తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజూ తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.



చలో చలో




చెట్లను ఎక్కుదాం చలో చలో
పండ్లను తెంపుదాం చలో చలో
పండ్లను తిందాం చలో చలో
ఆరోగ్యంగా ఉందాం చలో చలో
గంతులు వేద్దాం చలో చలో
ఇంటి పనులు చేద్దాం చలో చలో
ఆటలు ఆడుదాం చలో చలో
పాటలు పాడుదాం చలో చలో
టివి చూద్దాం చలో చలో
అల్లరి చేద్దాం చలో చలో
పొద్దున లేద్దాం చలో చలో
బడికి వెళ్దాం చలో చలో
గురువు చెప్పింది విందాం చలో చలో
కవితలు రాద్దాం చలో చలో
కథలు రాద్దాం చలో చలో
మంచి పేరు పొందుదాం చలో చలో..




- మల్లె వెంకట ప్రవీణ్, 5వ తరగతి
బుచ్చయ్య పల్లి,
పెద్దపల్లి జిల్లా.

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన రంగుల బూరలను అంకెలుగా గణించి ఎదురుగా ఉన్న సమాధానం రాబట్టండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ



- బాలిన బాల త్రినాథ్,
5వ తరగతి,
విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
భోగాపురం,
పెదవేగి మండలం,
ఏలూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ మాస్టారు ఈజీగా నేర్పిస్తారు..

ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించటానికి నేడు ఇంగ్లీషు భాషా నైపుణ్యం చాలా అవసరవం అవుతోంది. ఈ నేపథ్యంలో వేలాది రూపాయల ఫీజు చెల్లించి, స్పోకెన్ ఇంగ్లీషు కోర్సులకు వెళ్లలేని వారికి ఉచితంగా బోధిస్తున్నారు ఉపాధ్యాయులు ఎం.రత్నకమల్ బాబు. 'కమల్ డిజిటల్ వరల్డ్ స్పోకెన్ ఇంగ్లీష్' పేరుతో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులే కాకుండా తన యూట్యూబ్ ఛానల్ 'కమల్ స్టూడియో ఇంగ్లీష్ డిజిటల్ క్లాసెస్' ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, గోల్‌సెట్టింగ్, పాజిటివ్ మెంటల్ ఆటిట్యూడ్, పబ్లిక్ రిలేషన్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మైండ్ మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.



విజయవాడ లబ్బీపేటకు చెందిన మాతంగి లాజరస్, ఆరోగ్యమ్మ దంపతుల కుమారుడు రత్నకమల్ బాబు సెప్టెంబర్ 4, 1975లో జన్మించారు. ఎమ్మెస్సీ జువాలజీ, ఎంఎ ఇంగ్లీష్, బిఇడి, టిటిసి పూర్తిచేశారు. 1998లో డిఎస్సీ ద్వారా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి ఎంపిటిఎస్ (మెయిన్)లో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం మైలవరం మండలం చిలుకూరివారిగూడెంలోని శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్నారు. ఎక్కడ పనిచేసినా అక్కడి పిల్లలను అక్కున చేర్చుకుని వారికి నైతిక విలువలు, ఇంగ్లీష్ నైపుణ్యాలను నేర్పిస్తూ వస్తున్నారు. ఇంగ్లీషు భాషా నైపుణ్యాలను పెంచేందుకు అవగాహనా సదస్సులు, ఉచిత తరగతులు, ఆన్‌లైన్ బోధనలు చేస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు.

పాఠ్య పుస్తకాల రూపకల్పనలో...

రాష్ట్రప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, టీచర్ మాడ్యూల్స్ తయారీలో బృందంలో నిపుణుల కమిటీ సభ్యులుగా రత్నకమల్ ఉన్నారు. ఎస్ఎస్‌సి స్టడీమెటీయల్, ఎస్ఎంసి టీచర్స్ మాడ్యూల్స్ రచనలో కూడా సభ్యునిగా పనిచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఎన్నో వేలమంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ బోధనలో అవసరమైన నైపుణ్యాలు నేర్పించారు. కరోనా సమయంలో డిడి సప్తగిరి దూరదర్శన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇంగ్లీషు పాఠ్యబోధన చేశారు. ప్రస్తుతం 'ఈ పాఠశాల యాప్' ద్వారా వీడియో లెసన్స్ బోధిస్తున్నారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటరీ తయారీలో ఎన్టీఆర్ జిల్లాకు విద్యాశాఖ కన్వీనర్‌గా వ్యవహరించారు. ముంబైలో జరిగిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రిని కలిశారు. విదేశీ ప్రతినిధులు, రాయబారులు వచ్చినప్పుడు వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున లైజన్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు. వందలాది మంది ఉపాధ్యాయులకు మెళకువలను నేర్పించారు. పాఠశాల యాజమాన్య కమిటీ కరదీపికలు, ఇంగ్లీష్ రెమిడియల్ స్టడీ మెటీరియల్ రూపకల్పనతోపాటుగా పలు ప్రాజెక్టులకు నోడల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2016, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం –2019ను అందుకున్నారు.

సరికొత్తగా ఇంగ్లీష్ నైపుణ్యాలు

జీవన నైపుణ్యాలకు తోడు భాషలపై పట్టుంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు. ఇప్పుడు ఉద్యోగ పరీక్షలు రాయాలంటే ఆంగ్లంలో పట్టు చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో ఇంగ్లీషు భాషా నైపుణ్యం పెంపొందించటమే లక్ష్యంగా కె.రత్నకమల్‌బాబు కృషిచేస్తున్నారు. గత 27 సంవత్సరాలుగా ఆయన ఇంగ్లీషు నైపుణ్యాలను వేలాదిమందికి బోధిస్తూ వస్తున్నారు.

ఎంబివికె ద్వారా ఆరేళ్లుగా...

విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో ఏటా ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను రత్నకమల్‌బాబు బోధిస్తున్నారు. ఇంగ్లీషులో నైపుణ్యం, భాషపై పట్టు కోసం ప్రొజెక్టర్ ద్వారా స్మార్ట్ క్లాసులు, ఆధునిక పద్ధతులతో సులభంగా బోధిస్తున్నారు. ఇంగ్లీషును సులువుగా నేర్పించటమే కాకుండా ప్రతిరోజూ క్లాసులో మాట్లాడటం, సాధన చేయించటం చేస్తున్నారు. వేసవి సెలవుల్లో జరుగుతున్న తరగతులకు హాజరైన వారంతా ఇంగ్లీషుపై పట్టు సాధిస్తున్నారు. 10వ తరగతి పరీక్షలు రాసినవారు, ఇంటర్, డిగ్రీ చదువుతున్న వారు కూడా ఈ తరగతులకు హాజరై తమ నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. విద్యార్థినీ విద్యార్థులతోపాటుగా ఉద్యోగులు, గృహిణులు కూడా ఈ తరగతులకు హాజరవుతున్నారు.

సామాజిక సేవలో ...

ఉపాధ్యాయ ఉద్యమనేతగా యుటిఎఫ్‌లో క్రియాశీలక పాత్రను నిర్వహిస్తూనే సామాజిక సేవలోనూ ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు తనవంతుగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎయిడ్స్, పల్స్‌పోలియో, బాల్యవివాహాలు, అక్షరాస్యత, నిరుద్యోగం వంటి సమస్యలపై తనవంతుగా సమాజానికి సేవలు అందిస్తున్నారు. డిఎస్సీ అభ్యర్థుల కోసం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు నిర్వహిస్తున్న తరగతుల్లో కమల్‌బాబు ఇంగ్లీషు సబ్జెక్టు బోధిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు


భాషా నైపుణ్యాల పెంపులో నా వంతుగా ...

గ్రామీణ, పేద, మధ్యతరగతికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు విడిగా వెళ్లటం ఆర్థికంగా భారంగా మారింది. అందుకే నేను సముపార్జించిన విజ్ఞానం, నైపుణ్యాలను సమాజ సేవలో భాగంగా అందజేస్తున్నా. వివిధ పోటీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు కూడా బాగా ఉపయోగించుకుంటున్నారు. వేసవికాలంలో ఎంబివికె ద్వారా జరుగుతున్న తరగతులకు బాగా ఆదరణ ఉంటోంది.

- ఎం.రత్నకమల్‌బాబు, ఉపాధ్యాయుడు,
జెడ్పీ ఉన్నత పాఠశాల, చిలుకూరివారిగూడెం,
మైలవరం మండలం, ఎన్టీఆర్ జిల్లా.
సెల్ : 85007 40964

గుమ్మడి విత్తనాలు.. కొన్ని సంగతులు

గుమ్మడి విత్తనాలు.. అనేక పోషకాలతో నిండి ఉంటాయి. ఇందులో లభించే ప్రొటీన్, ఫైబర్, మంచి కొవ్వులు, విటమిన్లు, మినరల్స్.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. పరిమితికి మించితే మాత్రం.. ఆరోగ్యంపై చెడు ప్రభావాలను చూపిస్తాయి.



- గుమ్మడి విత్తనాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. తక్కువ మోతాదులో తీసుకుంటే జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఎక్కువైతే.. కడుపునొప్పి, గ్యాస్ సమస్యలు, మలబద్ధకం, డయేరియా లాంటివి ఇబ్బంది పెడతాయి.
- వీటిలో క్యాలరీలు ఎక్కువే! మోతాదుకు మించి తీసుకుంటే.. బరువు పెరుగుతారు.
- కొందరిలో గుమ్మడి విత్తనాలు అలెర్జీని కలిగిస్తాయి. గొంతులో చికాకు, దగ్గుతోపాటు తలనొప్పికీ కారణం అవుతాయి. ఇంకొందరిలో చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిస్తే.. గుమ్మడి విత్తనాలను తినకపోవడమే మంచిది.
- లోబీపీ (హైపోటెన్షన్) ఉన్నవారు.. గుమ్మడి గింజలకు దూరం పాటించాలి. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. కాబట్టి, లోబీపీ వారికి మరింత ఇబ్బందిని కలిగిస్తాయి.
- పిల్లలకు వీటిని చాలా తక్కువగా అందివ్వాలి. లేకుంటే.. కడుపునొప్పి, విరేచనాలు ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి, పిల్లలతోపాటు పెద్దలు కూడా.. గుమ్మడి గింజలు తీసుకునేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి.

'నో డ్రగ్స్' అఫిడవిట్


మాదక ద్రవ్యాల వాడకాన్ని నియంత్రించేందుకు మలయాళ చిత్ర పరిశ్రమ కీలక నిర్ణయం తీసుకుంది. సినిమా అంగీకరించేటప్పుడే నటీనటులు ఎవరైనా సరే 'సెట్స్‌లో డ్రగ్స్ ఉపయోగించము' అని ఒక అఫిడవిట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. నటీనటులతో పాటు వారి సిబ్బంది, చివరకు డ్రైవర్స్ కూడా ఇందులో భాగమే. వారందరూ సంతకాలు చేస్తేనే సెట్‌లోకి అడుగుపెట్టగలరని నిబంధనలు పెట్టారు. ఈ మేరకు మలయాళ సినీ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. షూటింగ్ లొకేషన్స్‌తోపాటు నిర్మాణాంతర పనులు జరిగే ప్రదేశాల్లోనూ ఈ నిబంధన వర్తిస్తుంది. సూపర్‌స్టార్స్ నుంచి చిన్నస్థాయి టెక్నీషియన్స్ వరకూ ఎవరూ దీనికి అతీతులు కారని నిర్మాతల మండలి తీసుకున్న ఈ నిర్ణయంపై అన్ని విభాగాల వారు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఆదివారం (జూన్ 22) 'అమ్మ' సమావేశం జరగనుంది.

జులై 24న 'హరి హర వీరమల్లు'

పవన్ కళ్యాణ్ చారిత్రక యోధుడిగా కనిపించనున్న 'హరి హర వీరమల్లు'. ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకులు. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ డియోల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. పవన్ కళ్యాణ్ మొదటిసారి చారిత్రక యోధుడిగా నటిస్తుండటంతో పాటు, భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా చిత్రంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్ విజువల్స్‌కి సోషల్ మీడియాలోమంచి స్పందన లభించింది. 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో', 'అసుర హననం', 'తార తార' గీతాలు విడుదలై ట్రెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే ట్రైలర్ విడుదల చేయటానికి చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేస్తోంది. జూలై 24న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి మనోజ్ పరమహంస, జ్ఞాన శేఖర్ వి.ఎస్.ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కె.ఎల్.ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కళా దర్శకుడు తోట తరణి అద్భుతమైన సెట్లను రూపొందించారు. ఇంకా ఈ సినిమాలో అనుపమ్‌ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నరా ఫతేహి తదితరులు నటిస్తున్నారు.




చిరంజీవి సినిమాలో వెంకీ



చిరంజీవి–అనిల్ రావిపూడి కాంబోలో కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ వస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సాహు గారపాటి, సుస్మిత కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. చిరంజీవి– నయనతార జంటగా వస్తున్న ఈ చిత్రంలో వెంకటేశ్ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ విషయాన్ని సినిమా ప్రారంభం రోజునే స్పష్టం చేశారు. తాజాగా మూవీ టీమ్ ముస్సోరిలో ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. త్వరలోనే చేయబోయే షెడ్యూల్‌లో వెంకటేశ్ జాయిన్ అవుతారు. నెల రోజుల పాటు డేట్స్ కేటాయించినట్లు సమాచారం.

'సతీ లీలావతి' ఫస్ట్ లుక్ విడుదల

లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం 'సతీ లీలావతి'. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి.. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. లావణ్య త్రిపాఠి పుట్టినరోజు సందర్భంగా (డిసెంబర్ 15) ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించిన చిత్ర బృందం, తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తున్నారు.



సెంచరీతో చెలరేగిన పంత్

రిషబ్ పంత్ (134) ఫటాఫట్ సెంచరీతో కదం తొక్కాడు. తొలిరోజు యశస్వి జైస్వాల్ (101), శుభ్‌మన్ గిల్ (147) శతకాలు సాధించగా, రెండో రోజు వైస్ కెప్టెన్ షో చూపించాడు. టాప్-5లో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలతో మెరవటంతో లీడ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓ దశలో 600 ప్లస్ స్కోరు సాధించేలా కనిపించిన టీమ్ ఇండియా.. చివరి ఏడు వికెట్లను 41 పరుగులకే చేజార్చుకుంది. ఇంగ్లాండ్ పేసర్లు బెన్ స్టోక్స్, జోశ్ టంగ్ నాలుగేసి వికెట్లతో భారత్‌ను 471 పరుగులకు కట్టడి చేశారు!.



తనదైన శైలిలో విలక్షణ షాట్‌తో ఆడుతున్న రిషబ్ పంత్ (134)

- **భారత్ తొలి ఇన్నింగ్స్ 471/10**
- **భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు రెండో రోజు**

లీడ్స్ : తొలి టెస్టులో టీమ్ ఇండియా యువ బ్యాటర్ల విధ్వంసం కొనసాగింది. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ శతక జోరును రిషబ్ పంత్ (134, 227 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) కొనసాగించాడు. తనదైన శైలిలో బౌండరీలు, సిక్సర్లు సంధించిన రిషబ్ పంత్ లీడ్స్‌ను హోరెత్తించాడు. పంత్ టెస్టుల్లో ఏడో సెంచరీతో మెరిసినా.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఆశించిన స్కోరు అందుకోలేదు. 430/3తో పటిష్టంగా సాగుతున్న ఇన్నింగ్స్‌ను.. ఇంగ్లాండ్ పేసర్లు స్టోక్స్, టంగ్ కుదిపేశారు.

చివరి ఏడు వికెట్లను 41 పరుగుల వ్యవధిలోనే పడగొట్టారు. రెండో రోజు 28 ఓవర్లలో 112 పరుగులు చేసిన భారత్ 7 వికెట్లు కోల్పోయింది. 2017 ధర్మశాల (ఆసీస్‌తో) టెస్టు తర్వాత తొలిసారి లీడ్స్‌లో ఆడుతున్న కరుణ్ నాయర్ (0) డకౌట్‌గా నిష్క్రమించాడు. రవీంద్ర జడేజా (11), శార్దుల్ ఠాకూర్ (1) నిరాశపరిచారు. ఇంగ్లాండ్ బౌలర్లు జోశ్ టంగ్ (4/96), బెన్ స్టోక్స్ (4/66) రాణించారు.

పంత్ మెరుపులు

ఓవర్‌నైట్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్ (147), రిషబ్ పంత్ (134) తొలి రోజు జోరు కొనసాగించారు. గిల్ కాస్త దూకుడు తగ్గించినా.. డ్రింక్స్ విరామం వరకు భారత్ వికెట్ కోల్పోలేదు. ఓవర్‌నైట్ స్కోరుకు 20 పరుగులు జోడించిన గిల్ స్పిన్నర్ బషీర్ ఓవర్లో వికెట్ కోల్పోయాడు. దీంతో 209 పరుగుల నాల్గో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రిషబ్ పంత్ రెండో రోజు మరో 69 పరుగులు జోడించాడు. విలక్షణ షాట్లతో విరుచుకుపడిన పంత్ 12 ఫోర్లు, 6 సిక్సర్లతో మెరిశాడు. 10 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 146 బంతుల్లో కెరీర్‌లో ఏడో సెంచరీ నమోదు చేశాడు. గిల్ నిష్క్రమణ తర్వాత పంత్‌కు మరో ఎండ్ నుంచి ఆశించిన సహకారం దక్కలేదు. 2017 తర్వాత తొలిసారి టెస్టుల్లో ఆడుతున్న కరుణ్ నాయర్ (0) నాలుగు బంతులకే పెవిలియన్‌కు చేరుకున్నాడు. రవీంద్ర జడేజా (11, 15 బంతుల్లో 2 ఫోర్లు), శార్దుల్ ఠాకూర్ (1) నిరాశపరిచారు. బుమ్రా (0), ప్రసిద్ కృష్ణ (1) వికెట్లు సమర్పించుకోగా.. మహ్మద్ సిరాజ్ (3 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 113 ఓవర్లలో 471 పరుగులకు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. ఇంగ్లాండ్ పేసర్లు జోశ్ టంగ్ (4/96), బెన్ స్టోక్స్ (4/66) నాలుగు వికెట్ల ప్రదర్శనతో మెరిశారు. క్రిస్ వోక్స్ (103/0) చెత్త గణాంకాలను మూటగట్టుకున్నాడు.

లంచ్ విరామం తర్వాత ఐదు ఓవర్లకే భారత్ తొలి ఇన్నింగ్స్ ముగియగా.. ఆ తర్వాత వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. ఓ సమయంలో ఇంగ్లాండ్ ఓపెనర్లు, భారత ఆటగాళ్లు గ్రౌండ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతుండగా వర్షం మరోసారి అంతరాయం కలిగించింది. టీమ్ హడిల్‌లో గిల్ మాట్లాడుతూ ఆటగాళ్లను ఉత్తేజపరుస్తున్న సమయంలోనూ మళ్లీ వర్షం రంగ ప్రవేశం చేసింది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (బి) స్టోక్స్ 101, కెఎల్ రాహుల్ (సి) రూట్ (బి) కార్స్ 42, సాయి సుదర్శన్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0, శుభ్‌మన్ గిల (సి) టంగ్ (బి) బషీర్ 147, రిషబ్ పంత్ (ఎల్బీ) టంగ్ 134, కరుణ్ నాయర్ (సి) పోప్ (బి) స్టోక్స్ 0, రవీంద్ర జడేజా (బి) టంగ్ 11, శార్దుల్ ఠాకూర్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 1, బుమ్రా (సి) బ్రూక్ (బి) టంగ్ 0, సిరాజ్ నాటౌట్ 3, ప్రసిద్ కృష్ణ (బి) టంగ్ 1, ఎక్స్‌ట్రాలు : 31, మొత్తం : (113 ఓవర్లలో ఆలౌట్) 471.

వికెట్ల పతనం : 1-91, 2-92, 3-221, 4-430, 5-447, 6-453, 7-454, 8-458, 9-469, 10-471. **బౌలింగ్ :** క్రిస్ వోక్స్ 24-4-103-0, బ్రైడన్ కార్స్ 22-5-96-1, జోశ్ టంగ్ 20-0-86-4, బెన్ స్టోక్స్ 20-2-66-4, షోయబ్ బషీర్ 27-6-100-1.

మెరిసిన నీరజ్ చోప్రా

- **పారిస్ డైమండ్ లీగ్‌లో పసిడి**



పారిస్ (ఫ్రాన్స్) : భారత అథ్లెటిక్స్ సూపర్‌స్టార్, ఒలింపిక్స్‌లో రెండు సార్లు పతకాలు సాధించిన జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రా ఈ ఏడాది అదిరే విజయం అందుకున్నాడు. దోహ డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా ఎన్నాళ్లో ఎదురుచూసిన 90 మీటర్ల (90.23 మీటర్లు) దూరం అందుకున్నప్పటికీ.. అక్కడ ద్వితీయ స్థానంతోనే సరిపెట్టుకున్నాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా అగ్రస్థానం సాధించి సత్తా చాటాడు. తొలి ప్రయత్నంలోనే బల్లెంను 88.16 మీటర్ల దూరం విసిరిన నీరజ్ చోప్రా పసిడి పతకం లాంఛనం చేసుకున్నాడు. దోహాలో ఆఖర్లో అద్భుతం చేసిన అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) పారిస్‌లో ఐదో స్థానానికి పరిమితం అయ్యాడు. జులియన్ వెబర్ 87.88 మీటర్లతో సిల్వర్ మెడల్ అందుకోగా.. లూయిజ్ డ సిల్వ 86.62 మీటర్లతో కాంస్య పతకం దక్కించుకున్నాడు.

బంగ్లా, శ్రీలంక తొలి టెస్టు డ్రా

- **నజ్ముల్ శాంటో అజేయ సెంచరీ**

గాలె (శ్రీలంక) : ఆసక్తికరంగా సాగిన బంగ్లాదేశ్, శ్రీలంక తొలి టెస్టు డ్రాగా ముగిసింది. ఆఖరు రోజు ఆటకు వర్షం అంతరాయం కలిగించినా.. డిక్లరేషన్ ప్రకటించి ఆతిథ్య శ్రీలంకను ఛేదనకు ఆహ్వానించిన బంగ్లాదేశ్ గాలె టెస్టుకు ఉత్కంఠను జోడించింది. 296 పరుగుల ఛేదనలో శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 32 ఓవర్లలో 72/4తో నిలిచింది. తైజుల్ ఇస్లామ్ (3/23) మూడు వికెట్లతో మెప్పించాడు. శ్రీలంక బ్యాటర్లలో పతుం నిశాంక (24) ఫర్వాలేదనపించగా.. లహిరు (9), చండిమాల్ (6), మాథ్యూస్ (8) తేలిపోయారు. మెండిస్ (12 నాటౌట్), ధనంజయ డిసిల్వ (12 నాటౌట్) అజేయంగా నిలిచారు. ఆఖరు రోజు ముగియటంతో తొలి టెస్టు డ్రాగా ముగిసింది. అంతకుముందు బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌ను 285/7 పరుగులకు డిక్లరేషన్ ఇచ్చింది. కెప్టెన్ నజ్ముల్ శాంటో (125, 199 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీతో మెరిశాడు. ముష్ఫికర్ రహీమ్ (49) ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 495 పరుగులు చేయగా, శ్రీలంక 485 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు సాధించిన నజ్ముల్ శాంటో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. బంగ్లాదేశ్, శ్రీలంక రెండో టెస్టు బుధవారం నుంచి కొలంబోలో జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68